PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 245 | విజయవాడ, శనివారం 8 ఏప్రిల్ 2023 | 8+8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 8 April 2023 | Rs

సిలబస్‌లో మార్పులు, మతపరమైన దాడులపై

బనారస్ వర్శిటీలో

నిరసనలు

• లోపలి పేజీలో.. •



మళ్లీ సన్‌రైజర్స్‌కు నిరాశ

• లక్నో సూపర్‌జెయింట్స్ చేతిలో ఐదు వికెట్ల తేడాతో ఓటమి

లోపలి పేజీలో..

సిఎఫ్ఎంఎస్ అనుసంధానం

• రాష్ట్రానికి ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ తాఖీదు • 200 పైగా అంశాలపై వివరాలు, విధానాలపై ఆరా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అనునిత్యం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమాచారం కావాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాసే ప్రిన్సిపల్ అక్కౌంటెంట్ జనరల్ తాజాగా మరో తాఖీదు పంపారు. రాష్ట్ర ఆర్థిక శాఖకు సంబంధించిన అన్ని వివరాలు తాము తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, అందుకే సిఎఫ్ఎంఎస్‌తో తమకు అనుసంధానం కల్పించాలని కోరింది. ఇందుకుగాను దాదాపు 200 అంశాలకు సంబంధించిన సమాచారం ఇవ్వాలంటూ పిఎజి కార్యాలయం మార్చి 30న లేఖ రాసింది. ఏయే వివరాలు కావాలో కూడా స్పష్టంగా వివరించింది. ఆ వివరాలు గమనిస్తే... మొత్తం రాష్ట్ర పాలనకు సంబంధించి ప్రతి అంశం ఎప్పటికప్పుడు పిఏజి తెలుసుకునే అవకాశాలు ఉంటాయి. నెలవారీ నివేదికలు తమకు పంపాలంటూ ఇటీవల రాజ్‌భవన్ నుండి లేఖ రావడం, 200 అంశాలపై వివరాలు కావాలని పిఎజి కోరడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై కేంద్రం నిఘా నానాటికీ పెరుగుతుందనడానికి నిదర్శనాలని విశ్లేషకులంటున్నారు.

మొత్తం 31 విభాగాలకు సంబంధించిన వివరాలు తాము తెలుసుకోవాలనుకుంటున్నట్లు పిఏజి పేర్కొంది. ప్రధానంగా పాలనాంశాలకు సంబంధించిన చెల్లింపులు, నియామకాల నిబంధనలు, సర్వీసు అంశాలు, క్రమశిక్షణ చర్యల విధానాలు, వాటివల్ల చెల్లింపులపై పడే ప్రభావం, ఉద్యోగులకు అందిస్తున్న రవాణా ఛార్జీలు, ఎల్‌టిసి, వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్, విద్యా రాయితీలకు సంబంధించిన ఉత్తర్వుల వివరాలు కావాలని పిఏజి పేర్కొంది. బదిలీలు, నియామకాలు, ఇతర డిప్యుటేషన్‌లు, అమలు చేస్తున్న జిపిఎస్, ఎన్‌పిఎస్, సిపిఎస్ విధానాలు, మరణా నంతరం అందించే ప్రయోజనాలపైనా ఆరా తీయనుంది.

ఆర్థిక అంశాలకు సంబంధించి నిబంధనల్లో సవరణలు, ట్రెజరీ కోడ్, పలు శాఖలకు అందించే బడ్జెట్ రిలీజ్ ఆర్డర్లు, ప్రత్యేక అలవెన్సుల జారీ ప్రక్రియ, అధికారులకు కల్పించే ఆర్థిక అధికారాలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల నిబంధనలు, అధికారులకు సమకూర్చే వాహనాల ప్రక్రియ, శాఖలు సమకూర్చుకునే యంత్రాలు, పరికరాలలో అనుసరించే విధానాలు వంటి పలు అంశాలకు సంబంధించిన ఉత్తర్వుల వివరాలు కూడా పిఏజి కోరడం గమనార్హం. అలాగే సెక్రటేరియట్ వ్యవహారాల నిబంధనలు, వాటిలో సవరణలు, సబార్డినేట్ సర్వీస్ నిబంధనలు, సివిల్ సర్వీస్ నిబంధనలు వంటి వివరాలతోపాటు, పబ్లిక్ వర్క్సకు సంబంధించిన వివరాలు, రికార్డుల నిర్వహణ, గోదాముల నిర్వహణ వివరాలు కూడా సేకరించనుంది.

అప్పులపై ఆరా

రాష్ట్ర ప్రభుత్వం చేసే అప్పులు, వివిధ సంస్థలకు ఇస్తున్న గ్యారంటీలు, చెల్లిస్తున్న వడ్డీపైనా వివరాలు తెలుసుకోవాలని భావిస్తు న్నట్లు పిఏజి పేర్కొంది. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లకు సంబంధించి న బైలా వివరాలు, వాటిల్లో చేసిన సవరణలు, వాటిల్లో ప్రభుత్వం పెట్టిన పెట్టుబడులపైనా ఆరా తీస్తోంది. సవరణ బడ్జెట్, బడ్జెట్ అంచనాలు, ప్రజా పద్దుల కమిటీ సమావేశాలు, చేసిన ఖర్చుకు ఇస్తున్న వినియోగ ధృవీకరణ పత్రాలు వంటి అంశాలు కూడా చెప్పాలని నిర్దేశించింది.

స్థానిక సంస్థల నిధులపైనా

స్థానిక సంస్థలకు అందిస్తున్న నిధుల వివరాలు, వాటికి అందుతున్న ఆర్థిక సంఘం నిధులు, పంచాయితీల స్థాయి పెంపు, మున్సిపాల్టీలుగా మార్పు, స్థానిక సంస్థలకు కల్పించిన అధికారాల వివరాలతోపాటు, స్థానిక సంస్థల ద్వారా అమలు జరుగుతున్న ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టుల తీరు, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఆదాయ వనరులు కూడా చూడాలనుకుంటున్నట్లు పిఏజి పేర్కొంది.

పన్నులు, సెస్‌లపైనా

ఖజానాకు ఆదాయం సమకూర్చే రంగాలపైనా పిఏజి దృష్టి సారిస్తోంది. రిజిస్ట్రేషన్ ఛార్జీలు, సెస్‌లు, ఆస్తి పన్ను, చిట్‌లు, హుండీల ద్వారా సమకూరే ఆదాయానికి సంబంధించిన చట్టాలు, వాటిలో సవరణలు కూడా తెలుసుకోవాలని భావిస్తోంది. మద్యం, వాణిజ్య పన్నుల చట్టాలపైనా ఆరా తీస్తోంది. సంక్షేమం, ఇళ్ల నిర్మాణం, పోలీసు శాఖలో ప్రత్యేక అలవెన్సుల విధానం, భూములకు సంబంధించిన చట్టాలు, జిల్లా పాలనాంశాలపై చట్టాలు, ఉత్తర్వులతోపాటు అనేక ఇతర శాఖలకు సంబంధించిన చట్టాలు, సవరణలపైనా ఆరా తీస్తోంది.

కోరలు చాస్తున్న కోవిడ్

• 6 వేలు దాటిన కేసులు

• అప్రమత్తంగా ఉండాలన్న కేంద్ర ఆరోగ్యశాఖ

న్యూఢిల్లీ : కోవిడ్ మహమ్మారి దేశంలో మరోమారు కోరలు చాస్తోంది. రోజువారీ కేసులు క్రమంగా పెరుగుతూపోతున్నాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు గడిచిన 24 గంటల్లో 6050 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గత 203 రోజుల్లో ఇదే అధికం. దీంతో క్రియాశీల కేసుల సంఖ్య 28,303కి పెరిగినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. గతేడాది సెప్టెంబరు 16న 6,298 కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా కోవిడ్ కారణంగా 24 గంటల్లో 14 మంది చనిపోయారు. దీంతో కోవిడ్ బాధిత మృతుల సంఖ్య 5,30,943కి పెరిగింది. రోజువారీ పాజిటివిటీ రేటు 3.39 శాతంగా నమోదవ్వగా, వీక్లీ పాజిటివిటీరేటు 3.02 శాతంగా వుంది. ఇప్పటివరకు మొత్తంగా కోవిడ్ కేసులు 4.47 కోట్లుగా నమోదు కాగా, క్రియాశీల కేసులు అందులో 0.06 శాతంగా వున్నాయి. దేశవ్యాప్తంగా కోవిడ్ నుండి కోలుకున్నవారి సంఖ్య 4,41,85,858గా వుండగా, రికవరీ రేటు 98.75 శాతంగా వుందని కేంద్ర ఆరోగ్య శాఖ పేర్కొంది. కోవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులు, ప్రధాన కార్యదర్శులు, అదనపు చీఫ్ సెక్రటరీలతో ఆన్‌లైన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా వుండాల్సిందిగా కోరారు. కోవిడ్ వచ్చి తగ్గిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీవన విధానంపై కూడా ప్రజల్లో చైతన్యం పెంచాల్సిందిగా కోరారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సహకారం, సమన్వయం వుండాలని కోరారు. అన్ని ఆస్పత్రుల్లో ఈ నెల 10, 11 తేదీల్లో మాక్‌డ్రిల్స్ ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్రాల ఆరోగ్య మంత్రులను కోరారు. జిల్లాల యంత్రాంగంతో ఈ నెల 8, 9 తేదీల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

సికింద్రాబాద్ - తిరుపతి వందే భారత్

• నేడు ప్రారంభించనున్న ప్రధాని మోడీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ - తిరుపతి మధ్య వందేభారత్ రైలును (20701) ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శనివారం ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రారంభించనున్నారు. రెండు పట్టణాల మధ్య సాధారణ రైలు ప్రయాణం 12 గంటల సమయం పడుతుండగా వందేభారత్ రైలులో ఎనిమిదిన్నర గంటల్లోనే చేరుకోవచ్చని రైల్వే అధికారులు తెలిపారు. మంగళవారం మినహా అన్ని రోజుల్లో ప్రయాణికులకు ఈ రైలు అందుబాటులో ఉంటుంది. నల్గొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు స్టేషన్లలో మాత్రమే ఈ రైలు ఆగుతుంది. ఆదివారం నుంచి ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. తిరుపతిలో ఆదివారం మధ్యాహ్నం 3.15 గంటలకు బయల్దేరే ఈ రైలు (20702) రాత్రి 11.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి ఉదయం ఆరు గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.30 గంటలకు తిరుపతి చేరుకోనుంది. రూ.720 కోట్లతో చేపట్టిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను మోడీ ప్రారంభించనున్నారు.

సమగ్ర కులగణన

• ముఖ్యమంత్రికి సిపిఎం విజ్ఞప్తి

• లోపలి పేజీలో.. •

పిఐబికి విస్తృత అధికారాలు..

సెన్సార్‌షిప్‌తో సమానం

• ఐటి చట్ట సవరణలను ఉపసంహరించాలని సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : సామాజిక మాధ్యమ వేదికలను వినియోగిస్తున్న వినియోగదారులను ప్రభావితం చేసేలా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి)కి విస్తృత అధికారాలను ఇవ్వడం సెన్సార్‌షిప్‌తో సమానమని సిపిఎం పేర్కొంది. ఇందుకోసం తీసుకొచ్చిన ఐటి రూల్స్ 2021 సవరణలు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం పొలిట్‌బ్యూరో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్ వంటి సామాజిక మాధ్యమాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రస్తావనలతో పోస్టు చేసిన సమాచారం నిజమైనదా? లేదా బూటకమైనదా? తప్పుడు సమాచారమా? అని నిజ నిర్ధారణ చేసే అధికారాలను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి)కి దఖలు పరుస్తూ మోడీ సర్కార్ ఇటీవల సమాచార సాంకేతిక నిబంధనావళి (ఐటి రూల్స్) - 2021కి సవరణలు చేసింది. కేంద్ర ప్రభుత్వ ప్రస్తావనలతో ఉన్న ఏదైనా సమాచారాన్ని ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్ వంటి సామాజిక మాధ్యమాల వేదిక నుండి తొలగించాలని ఆదేశించే అధికారాన్ని కూడా పిఐబికి ఇచ్చారు. ఒకవేళ ఈ కంపెనీలు ఆ సమాచారాన్ని తొలగించ డానికి తిరస్కరిస్తే, వెంటనే "సేఫ్ హార్బర్ ఇమ్యూనిటీ"ని అవి కోల్పోతాయి. ఈ సామాజిక మాధ్యమాల వేదికలపై యూజర్లు ఎవరైనా అక్రమమైన లేదా తప్పుడు సమాచారాన్ని పోస్టు చేస్తే వాటికి వ్యతిరేకంగా సోషల్ మీడియాకు కల్పించే రక్షణే సేఫ్ హార్బర్ ఇమ్యూనిటీ. (అంటే సమాచారాన్ని పోస్టు చేసి నవారే ఆ సమాచారానికి బాధ్యులు అవుతారు. సామాజిక మాధ్యమాలుకాదు). పిబిఐకి ఇటువంటి విస్తృత అధికారాలను ఇవ్వడమంటే మిగతా 2లో

దోషులను శిక్షించాలి

ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి : వాకపల్లి బాధిత మహిళల డిమాండ్

ప్రజాశక్తి- పాడేరు, కలెక్టరేట్ (విశాఖపట్నం)

తమపై అత్యాచారానికి పాల్పడిన పోలీసులను కఠినంగా శిక్షించాలని 'వాకపల్లి' బాధిత మహిళలు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, తమ కేసులో సహకరించని, సరిగా దర్యాప్తు చేయని అధికారులనూ శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కోర్టు తీర్పు నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం నుంచి విలేకరుల బృందం వాకపల్లి గ్రామాన్ని శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామంలోని బాధిత మహిళలు విలేకర్లతో మాట్లాడారు. 'మాపై జరిగిన అత్యాచారం వల్ల చాలా అవమానపడ్డాం. ఎంతో ద్ణుఖించాం. విశాఖకు వెళ్లాం. హైదరాబాదుకు తిరిగాం. ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోలేదు. ఏళ్లు గడుస్తున్నా మాకు న్యాయం జరగలేదని చాలా బాధపడ్డాం. కోర్టును నమ్ముకున్నాం. కోర్టు వల్లే ఇప్పుడు మాకు న్యాయం జరిగింది. దీనికి మేమెంతో సంతోషిస్తున్నాం' అంటూ వాకపల్లి బాధిత మహిళలు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా న్యాయం కోసం తాము ఎదురు చూస్తున్నామని చెప్పారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మహిళా సంఘాల నాయకులు

నైతిక విజయం : మహిళా సంఘాలు

ఉమ్మడి విశాఖ జిల్లా జి.మాడుగుల మండలం వాకపల్లిలో ఆదివాసీ మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసుల అత్యాచారం సంఘటన వాస్తవమని, దర్యాప్తు అధికారుల నిర్లక్ష్యం వల్లే కేసును కొట్టివేస్తున్నామని, దర్యాప్తు అధికారి శివానందరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోర్టు తీర్పు ఇవ్వడం బాధిత ఆదివాసీ మహిళల నైతిక విజయమని మహిళా సంఘాలు పేర్కొన్నాయి. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, చైతన్య మహిళా సంఘం అధ్యక్షులు డి.లలిత, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి కె.వెంకటలక్ష్మి, మహిళా సమాఖ్య నగర అధ్యక్షులు ఎండి బేగం, హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విఎస్.కృష్ణ పాల్గొని మాట్లాడారు. 2007 మిగతా 2లో

బాధితులకు రూ.25 లక్షల చొప్పున పరిహారం

• సిపిఎం డిమాండ్

• లోపలి పేజీలో.. •

తమిళనాడు గవర్నరు వ్యాఖ్యలపై

స్టాలిన్ ఆగ్రహం

చెన్నై : రాష్ట్ర అసెంబ్లీ పంపిన బిల్లులు రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్నాయంటే వాటిని నిరాకరించినట్లేనని తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దీనిపై ముఖ్యమంత్రి స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ తన పరిపాలనా బాధ్యతల నుండి తప్పించుకుని, ప్రజాప్రతినిధులు ప్రవేశపెట్టిన బిల్లులు, ఆర్డినెన్స్ వంటి 14 పత్రాలకు సమ్మతించడం లేదని విమర్శించారు. పదవీ ప్రమాణానికి విరుద్ధంగా, రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా తరచూ వ్యవహరిస్తున్న ఆయన తీరు ఖండించదగిందని పేర్కొన్నారు. బిల్లులు, ఆర్డినెన్సులు, చట్ట సవరణలను వెంటనే ఆమోదించకుండా జాప్యం చేస్తూ తన బాధ్యతను విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షిప్త రూపమే గవర్నర్ అంటూ ఓ తీర్పులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. దానిని మరచి డిక్టేటర్‌గా గవర్నర్ భావించడాన్ని మానుకోవాలని కోరారు. ఇకనైనా తన బాధ్యతను గుర్తించి దానికి తగినట్టు గవర్నర్ నడుచుకుంటారని ఆశిస్తున్నామని అన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు

ప్రతిభా పురస్కారాలు సబబే

• హైకోర్టు తీర్పు

• ప్రయివేటు విద్యా సంస్థలు, విద్యార్థుల పిటిషన్లు డిస్మిస్



ప్రజాశక్తి-అమరావతి

పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఇచ్చే ప్రతిభా పురస్కారాల్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ఇవ్వాలన్న ప్రభుత్వ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. జీవో 82ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టేస్తూ తీర్పు చెప్పింది. జీవోను కొట్టేసేందుకు నిరాకరించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ప్రతిభా పురస్కారాలు ఇవ్వడం వివక్ష కిందకు రాదని, అది విధాన నిర్ణయమని న్యాయమూర్తి జస్టిస్ మంతోజు గంగారావు ఇటీవల తీర్పు చెప్పారు. జీవో 82లో ప్రభుత్వం సవరణ తెచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఆ పురస్కారాలు ఇవ్వాలని 2019లో నిర్ణయించింది. ఈ జీవోను ఏపీ ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం, పలువురు విద్యార్థులు సవాల్ చేస్తూ రిట్లు దాఖలు చేశారు. 2017-18 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ గణాంకాలు చూస్తే అత్యధిక ప్రతిభా పురస్కారాలు ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకే వచ్చాయని గుర్తు చేసింది. పేదలు, మధ్య తరగతి విద్యార్థులు చదివే పాఠశాలల్లో ప్రతిభ చూపే వారికి పురస్కారాలు ఇవ్వడం, ప్రయివేటు పాఠశాల్లో చదివే విద్యార్థులకు ఇవ్వకపోవడం వివక్ష అవ్వదని స్పష్టం చేసింది. పాఠశాల విద్యను ప్రోత్సహించే క్రమంలో రాష్ట్రప్రభుత్వం జగనన్న విద్యా కానుక, నాడు-నేడు, గోరుముద్ద, మనబడి తదితర పథకాల కోసం వేల కోట్ల రూపాయల్ని ఖర్చు చేస్తోందని తెలిపింది.



నగరి నియోజకవర్గంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆర్‌కె రోజా

'జగనన్నే మా భవిష్యత్' ప్రారంభం

• ఇంటింటికీ స్టిక్కర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరో ఏడాదిలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని వైసిపి శ్రేణులు అట్టహాసంగా ప్రారంభించాయి. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ఇళ్ల తలుపులకు, సెల్‌ఫోన్లకు స్టిక్కర్ అంటించే కార్యక్రమం నిర్వహించాయి. ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు పాల్గొన్నాయి. శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారామ్, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్‌పిలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరక్టర్లు, వైసిపి నేతలు, గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు తమ ప్రాంతాల్లో నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాలకు హాజరయ్యారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఏడు లక్షల మంది పార్టీ శ్రేణులు పాల్గొన్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై సంతృప్తి వ్యక్తం చేసిన వారికి మద్దతు ఇస్తున్నట్లు ధ్రువీకరిస్తూ రసీదు అందజేశారు.



బిజెపిలోకి కిరణ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి బిజెపిలో చేరారు. శుక్రవారం నాడిక్కడ బిజెపి ప్రధాన కార్యాలయంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సమక్షంలో ఆయన బిజెపి కండువా కప్పుకున్నారు. కిరణ్ కుమార్ రెడ్డికి ప్రహ్లాద్ జోషి, బిజెపి ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబానికి నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌తో అనుబంధముందని, తమ ఎదుగుదలకు కారణమైన పార్టీని వీడాల్సి వస్తుందని ఎన్నడూ అనుకోలేదన్నారు. తమ తప్పు లేదు, ఓటు వేయని ప్రజలదే తప్పనే మనస్తత్వం కాంగ్రెస్ నాయకత్వంలో ఉందన్నారు. ఈ కారణంతోనే తాను పార్టీని వీడుతున్నట్లు చెప్పారు. ఆ తరువాత బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాను మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్రంలో అరాచక పాలన

• టిడిపి జోన్-4 సమావేశంలో చంద్రబాబు

• నెల్లూరులో టిడ్కో గృహ సముదాయాల వద్ద సెల్ఫీ దిగి సిఎంకు ఛాలెంజ్



టిడ్కో గృహ సముదాయాల వద్ద సెల్ఫీ తీసుకుంటున్న చంద్రబాబు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి నిజస్వరూపం తెలియక ప్రజలు వైసిపికి పట్టం కట్టారని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అరాచకాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. నెల్లూరులోని వేణుగోపాలస్వామి కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన టిడిపి జోన్-4 సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయవాడ నుంచి రోడ్డు మార్గంలో వస్తూ మార్గమధ్యంలో నెల్లూరు నగర పరిధి వెంకటేశ్వరపురంలోని టిడ్కో గృహ సముదాయాలను సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న ఆ ఇళ్ల వద్ద సెల్ఫీ దిగి ముఖ్యమంత్రి జగన్‌కు ఛాలెంజ్ విసిరారు. అనంతరం సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ నిరుపేదల కోసం నెల్లూరుతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లు నిర్మించామని తెలిపారు. ఆ ఇళ్లను లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వడం లేదో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీనివల్ల కోట్లాది రూపాయల విలువైన ఇళ్లు శిథిలమైపోయాయని తెలిపారు. రాష్ట్రంలో మద్యం, గంజాయి రాజ్యమేలుతోందని, ప్రజల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయని అన్నారు. 'వైనాట్ కుప్పం అంటూ నిన్నటి వరకూ జగన్ విర్రవీగారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత ఏమీ మాట్లాడడం లేదు. ఇప్పుడు నేను చెబుతున్నాను. వైనాట్ పులివెందుల?' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా టిడిపి విజయం తథ్యమన్నారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేసేలా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి కార్యకర్త, నాయకులు ఇంటింటికీ వెళ్లాలని సూచించారు. టిడిపి కార్యక్రమాలు నిర్వహించని పార్టీ శ్రేణులకు గుర్తింపు ఇవ్వబోనన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఐదు పార్లమెంట్ నియోజకవర్గాల (నెల్లూరు, ఒంగోలు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు) పరిధిలోని 35 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 2,500 మంది క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మరో 20లక్షల కోవిడ్ బూస్టర్ డోస్‌లు ఇవ్వండి

- కేంద్రానికి మంత్రి రజని వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి మరో 20 లక్షల కోవిడ్ బూస్టర్ డోస్‌లు ఇవ్వాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో కోవిడ్ పూర్తిగా అదుపులో ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గత రెండు వారాల్లో 15,096 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 267మందికి కోవిడ్ లక్షణాలున్నట్లు తేలిందని తెలిపారు. వీరంతా ఇంటి వద్దే ఉంటూ వైద్య ఆరోగ్యసేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల గురించి కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ అన్ని రాష్ట్రాల వైద్య ఆరోగ్యశాఖ మంత్రులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజని మాట్లాడుతూ రాష్ట్రానికి మరో 20లక్షల బూస్టర్ డోస్‌లను కేంద్రం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆక్సిజన్ ప్లాంట్లు, పిహెచ్‌సిల నిర్వహణ తదితర అవసరాలకు అయ్యే మొత్తాన్ని నేషనల్ హెల్త్‌మిషన్ భరించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

రచయిత బుర్రా లక్ష్మీనారాయణ ఇకలేరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ప్రముఖ రచయిత, కవి బుర్రా లక్ష్మీనారాయణ (68) శుక్రవారం హైదరాబాద్‌లోని బాగ్ అంబర్‌పేటలో తన నివాసంలో కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన ఊపిరితిత్తుల జబ్బుతో బాధపడుతున్నారు. లక్ష్మీనారాయణ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 1955లో జన్మించారు. 1977లో ఈనాడు దినపత్రికలో టెలిప్రింటర్ ఆపరేటర్‌గా చేరి కొంతకాలం పనిచేశారు. కొన్నాళ్ల తరువాత హైదరాబాద్‌కు మకాం మార్చారు. యుఎన్‌ఐ వార్తాసంస్థలో చేరి, సుదీర్ఘకాలం పాటు పనిచేసి, ఆ సంస్థలోనే ఉద్యోగ విరమణ పొందారు. దాదాపు వందకుపైగా కథలు రచించారు. కలచాలనమ్, నాలుగు పుంజీలు, మట్టిఅరుగు, దేహనది, ఫాలచుక్కలు, ద్వాదశి శీర్షికలతో ఆరు కథల సంపుటాలు వెలువరించారు. కవిత్వంలోనూ ప్రయోగాలు చేశారు. 'సెంద్రి తలపులు-ఎన్నెల మొగ్గలు' శీర్షికన కూనలమ్మ పదాల తరహాలో రాసిన చిన్న కవితలతో ఓ పుస్తకం తీసుకొచ్చారు. అలాగే 'ఇదీవరస' శీర్షికన ఒక వచన కవితా సంపుటి ప్రచురించారు. కథకునిగా ప్రసిద్ధి చెందిన బుర్రా లక్ష్మీనారాయణ సీనియర్ జర్నలిస్టు కీర్తిశేషులు బుర్రా సుబ్రహ్మణ్యం సోదరుడు. మధ్యతరగతి కుటుంబాల్లోని వైరుధ్యాలను లక్ష్మీనారాయణ ప్రధానంగా చిత్రించారు.

సమగ్ర కులగణన

- ముఖ్యమంత్రికి సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనాభా లెక్కల సేకరణ కార్యక్రమంలో ప్రభుత్వం సమగ్రంగా కులగణన జరిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. 2021లో జరగాల్సిన జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం కరోనా కారణంగా ఇప్పటి వరకు జరగలేదని, 2023 అక్టోబరు నుండి మొదలవుతుందని రిజిస్ట్రార్ జనరల్ ప్రకటించారని తెలిపారు. దశాబ్దకాలంలో జనాభా పొందికలో అనేక మార్పులు వచ్చాయని, సంక్షేమ కార్యక్రమాలు మొదలుకొని సామాజిక అంశాలపై నిర్ణయాల వరకు ఏ నిర్ణయం తీసుకోవాలన్నా జనాభా లెక్కలే ప్రామాణికమని తెలిపారు. దేశంలో కులాల చుట్టూ అనేక వివాదాలొస్తున్నాయని, వీటిని ఒక శాస్త్రీయపద్ధతిలో పరిష్కరించాలంటే కులగణన అవసరమని పేర్కొన్నారు. కులాల మధ్య ఉన్న అసమానతల నిర్మూలనకు, అణగారిన కులాల అభ్యున్నతికి, ఆయా కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వాలకు సరైన అంచనా ఉండాలని వివరించారు. కులాల వారీ లెక్కలు లేకుండా ఇది సాధ్యం కాదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎస్‌సి, ఎస్‌టి లెక్కల సేకరణ జరుగుతోందని, కానీ వెనకబడిన తరగతులకు లెక్కలు లేవని పేర్కొన్నారు. ఆయా కులాల దామాషా అర్థం కావాలంటే లెక్కలు అవసరమని వివరించారు. దానికి కులగణన తప్పనిసరని, 1931 తరువాత కులాలవారీ జనాభా లెక్కల సేకరణ జరగలేదని వివరించారు.

2011లో చేసినప్పటికీ తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం ఆ లెక్కల్ని తొక్కిపెట్టిందని, అత్యంత ఆవశ్యకమైన కులగణనను కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తిరస్కరిస్తోందని పేర్కొన్నారు. బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ హిందూత్వ ప్రాజెక్టులో భాగంగా అగ్రకుల ఆధిపత్యాన్ని దేశంపై రుద్దడానికి మనుధర్మ శాస్త్రాన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేస్తోందని, ప్రజాస్వామ్య చైతన్యంలో నుండి వివిధ అణగారిన కులాల్లో వస్తున్న కోర్కెలను అంగీకరించకుండా అణగదొక్కుతున్నదని పేర్కొన్నారు. న్యాయంగా అత్యంత వెనకబడిన తరగతులకు రావాల్సిన వాటా నిధులు రావడం లేదని, రిజర్వేషన్లు అమలు కావడం లేదని, అనేక నిర్ణయాలు వివాదాల్లో చిక్కుకొని వాటి అమలే ఆగిపోవడం లేదా ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చి కులగణన జరిగేటట్లు చూడాలని కోరారు. 2021 నవంబర్ 23న రాష్ట్ర అసెంబ్లీ కూడా కులగణన జరపాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని, బీహార్, ఒరిస్సా ప్రభుత్వాలు మరొక అడుగు ముందుకు వేసి ఆయా ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే కులగణన చేపట్టాయని తెలిపారు. దీనిపై వ్యక్తిగతంగా శ్రద్ధపెట్టి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కులగణన జరిగేట్లుగా చూడాలని సిఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు. లేదా ఈ అంశానికున్న ప్రాధాన్యత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వమైనా అందుకు చొరవ తీసుకొని కులగణన చేయాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 48గంటలు

ప్రజాశక్తి - తిరుమల

వారాంతంలో వరుస సెలవులు రావడంతో తిరుమలకు సందర్శకులు భారీగా తరలివచ్చారు. ప్రస్తుతం టోకెన్ లేని భక్తులకు శ్రీవారి దర్శనం కోసం 48 గంటల సమయం పడుతోంది. ఈ విషయాన్ని దష్టిలో ఉంచుకుని భక్తులు తమ తిరుమల యాత్ర ప్రణాళిక రూపొందించుకోవాలని టిటిడి పేర్కొంది.

అన్నప్రసాదాల కోసం మిల్లర్ల నుంచి బియ్యం సేకరణ : ఇఒ

తిరుమలలోని మాతశ్రీ వెంగమాంబ భవనంలో భక్తులకు అందించే అన్నప్రసాదాల నాణ్యత మరింత పెంచడానికి గతంలో లాగే మిల్లర్ల నుంచి బియ్యం సేకరించాలని ఆలోచిస్తున్నామని టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి చెప్పారు. ప్రస్తుతం టెండర్ల ద్వారా బియ్యం సేకరిస్తున్నామని చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇఒ 31 మంది భక్తులతో మాట్లాడారు. ఏప్రిల్ 15 నుండి జూలై 15వ తేదీ వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ విఐపి బ్రేక్, శ్రీవాణి, టూరిజం కోటా, వర్చువల్ సేవలు, రూ.300 దర్శన టికెట్లను టిటిడి బోర్డు తగ్గించింది. సామాన్య భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించడం కోసమే ఈ నిర్ణయం తీసుకుందన్నారు. తిరుమలలో దాదాపు 7400 గదులు, 4 పిఏసిలు ఉన్నాయి. వీటిలో 40 వేల మందికి సరిపడా వసతి అందుబాటులో ఉంది. దాదాపు 85 శాతం గదులు సామాన్య భక్తుల కోసమే కేటాయిస్తున్నామని ఇఒ తెలిపారు.

మిర్చి రైతుల న(క)ష్టాల సాగు

- అకాల వర్షాలతో కోలుకోలేని దెబ్బ
- నాణ్యత పేరుతో క్వింటాలుకు రూ. 2 వేలు తగ్గింపు
- దిగుబడిపైనా ప్రభావం



పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గంలో కల్లాల్లో ఆరబోసిన మిర్చి (ఫైల్)

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అకాల వర్షాలు మిర్చి రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. దీంతో మిర్చి ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. గత వారం రోజుల్లో క్వింటాలుకు రూ.2 వేల వరకు తగ్గింది. సాధారణ రకాలు కనిష్ట ధర క్వింటాలు రూ. 9 వేలు, గరిష్ట ధర రూ.25 వేలు ఉంది. మేలురకాలైన తేజ, బాడిగ, దేవనారు డీలక్స్ రకాలు కనిష్టంగా రూ.9500, గరిష్టంగా రూ.27 వేల వరకు లభిస్తోంది. ఎక్కువ సరుకు కనిష్ట ధరలకే కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత లేదనే కారణంతో ధరలు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

మిర్చి అధికంగా సాగయ్యే గుంటూరు, పల్నాడు, ఎన్‌టిఆర్, ప్రకాశం, బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అకాల వర్షాలు కురిశాయి. ఈ జిల్లాలతోపాటు అనంతపురం, సత్యసాయి, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా గుంటూరు యార్డుకు మిర్చి వస్తోంది. మిర్చి నాణ్యత తక్కువగా ఉందని చెబుతూ ప్రస్తుతం కొనుగోలును వ్యాపారులు తగ్గించారు. దీనికితోడు విదేశీ ఆర్డర్లు కూడా గత 15 రోజులుగా నిలిచిపోయాయి. ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డుకు రోజుకు లక్ష టిక్కిలకుపైగా సరుకు వస్తోంది. గత నెలలో నాణ్యమైన సరుకు వచ్చినప్పుడు సగటు ధర రూ.20 నుంచి రూ.25 వేలు ఉండగా ప్రస్తుతం రూ.17 వేల నుంచి రూ.20 వేల మధ్యన ధరలు వస్తున్నాయి. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంలేదని రైతులు చెబుతున్నారు. మొత్తం నాలుగు కోతల్లో 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు ఆశించగా ఎక్కువ ప్రాంతాల్లో 12 క్వింటాళ్లకు మించి రాలేదు. పెట్టుబడి ఎకరాకు రూ.లక్షకుపైగా పెట్టినట్టు రైతులు చెప్పారు. కనీసం 15 క్వింటాళ్ల దిగుబడి రావాలని, అలాగే క్వింటాలు రూ.20 వేలకు తగ్గకుండా ఉంటేనే కొంత వరకు నష్టాల నుంచి బయటపడతామని అంటున్నారు. గత అక్టోబరులో మాండూస్ తుపానుతో కొంత నష్టం జరిగింది. తరువాత జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల్లోనే అకాల వర్షాలు రైతులను కోలుకోని దెబ్బతీశాయి. మిర్చి తడిసిన ప్రాంతాల్లో నాణ్యత తక్కువగా ఉందని వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పూర్తి స్థాయిలో నాణ్యత అంతగా తగ్గలేదని, స్వల్ప మార్పు మాత్రమే వచ్చిందని రైతులు తెలిపారు.

వాకపల్లి బాధిత మహిళలకు
రూ.25 లక్షల చొప్పున పరిహారం

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్
- దర్యాప్తు జరపని అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వాకపల్లిలో గ్రేహౌండ్స్ పోలీసులు గిరిజన మహిళలపై లైంగిక దాడి చేసిన ఘటనలో నిందితులకు శిక్షపడకపోవడం న్యాయచరిత్రలో విషాద ఘటనగా భావిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ అసమర్థత, పోలీసు ఉన్నతాధికారులు నేరస్తుల కొమ్ముకాసే వైఖరే దీనికి కారణమని వివరించారు. కోర్టు తీర్పును అనుసరించి తక్షణ దర్యాప్తు జరపని పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలం జరిగిన విచారణ అనంతరం కోర్టు తీర్పు సందర్భంగా జడ్జి వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. దీన్ని గుణపాఠంగా తీసుకుని వేరే కేసుల్లో బాధితులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. పోలీసులే నిందితులుగా ఉన్న ఘటనలో పోలీసులనే దర్యాప్తు అధికారులుగా నియమించడం అమానుషమని వివరించారు. అత్యాచారం చేసిన పోలీసులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

ఆనాడు ఐక్యవేదిక ఆధ్వర్యంలో గిరిజన మహిళలు ఆందోళనలు చేసినప్పటికీ, దర్యాప్తు తీరు పట్ల పలు విమర్శలు వెల్లువెత్తినప్పటికీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని వివరించారు. సిబిసిఐడి పోలీసులు సరిగ్గా దర్యాప్తు జరపలేదని, కోర్టు కూడా అదే విషయాన్ని తీర్పులో చెప్పిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా దర్యాప్తు సక్రమంగా జరపని పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, లైంగిక దాడికి పాల్పడిన గ్రేహౌండ్స్ పోలీసులను శిక్షించాలని, బాధిత మహిళలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. దళితులు, గిరిజనులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే న్యాయం జరగలేదు : ఐద్వా

వాకపల్లి ఘటనలో ప్రభుత్వ వైఫల్యం వల్లే న్యాయం జరగలేదని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తప్పులు దిద్దుకుని న్యాయం చేయాలని కోరారు. బాధితులకు పరిహారం ఇప్పించాలని న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని కోరారు. పోలీసులే దర్యాప్తు చేయడం ఎంతవరకూ న్యాయమని ప్రశ్నించారు. బాధితులు అనేక ఇబ్బందులు పడ్డారని, వెలికి గురయ్యారని వివరించారు. తీర్పును ఆలస్యం చేయకుండా నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

విచారణ అధికారులపై చర్యలు : కెవిపిఎస్ డిమాండ్

వాకపల్లి ఘటనలో విచారణను నీరుగార్చి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి కోరారు. దళితులు, గిరిజనులపై దాడులు పెరుగుతున్నాయని, వారి పట్ల ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయనే విషయం ఈ ఘటనతో రుజువైందని అన్నారు. కోర్టు తీర్పు ప్రకారం బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

మా భూములివ్వం

- కాకినాడ-అన్నవరం నాలుగు లేన్ల రహదారి ప్రాజెక్టుపై రైతులు
- అరకొర పరిహారం సరిపోదంటున్న అన్నదాతలు



నాలుగు లేన్ల రహదారి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

భారతమాల ప్రాజెక్టు తమ భూములు ఇవ్వబోమని కాకినాడ-అన్నవరం నాలుగు లేన్ల రహదారి బాధిత రైతులు తెగేసి చెబుతున్నారు. అరకొర పరిహారం ఇస్తుండడంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసుకున్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఎకరా భూమికి చెల్లించిన ధర ప్రకారం తమకు పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ మేరకు కలెక్టర్ కోర్టులో పలువురు రైతులు ఆర్బిట్రేషన్ పిటిషన్లు వేశారు.

కాకినాడ జిల్లా వాకలపూడి నుంచి అన్నవరం వరకు 516 ఎఫ్ జాతీయ రహదారి 2018లో మంజూరైంది. భారతమాల ప్రాజెక్టులో భాగంగా రూ.1,327 కోట్ల అంచనాతో 41 కిలోమీటర్ల పొడవున నాలుగు లేన్ల రహదారిని 45 అడుగుల వెడల్పుతో నిర్మించనున్నారు. వాకలపూడి లైట్ హౌస్ నుంచి అన్నవరం రైల్వేస్టేషన్ మీదుగా జాతీయ రహదారి 16కు ఈ రహదారిని అనుసంధానం చేయనున్నారు. యు.కొత్తపల్లి, తొండంగి, శంఖవరం, కాకినాడ రూరల్ మండలాల్లోని 21 గ్రామాల మీదుగా ఈ రోడ్డు వెళుతుంది. 39 ఎకరాల ప్రభుత్వ భూమి, 382 ఎకరాల ప్రయివేటు భూమి మొత్తంగా 421 ఎకరాలను సేకరించనున్నారు. ప్రయివేటు భూసేకరణకు రూ.204 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే అవార్డులు కూడా జారీ చేశారు. స్థానిక మార్కెట్ విలువ ఆధారంగా రైతులకు పరిహారం నిర్ణయించారు. అయితే ఒక్కొక్కరికీ పరిహారం ప్రకటించడంతో పలువురు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కొందరికి రూ.50 లక్షలు ఇస్తుండగా మరికొందరికి రూ.15 నుంచి రూ.25 లక్షలకు మించి ఇవ్వడం లేదు.

తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో సుమారు 30 ఎకరాల భూములను సేకరిస్తుండగా మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.17.17 లక్షల చొప్పున ఇస్తామని 2022 జూన్‌లో జాయింట్ కలెక్టర్ పేరుతో రైతులకు లెటర్లు అందాయి. ఈ లెక్కన ఎకరాకు రూ.46.42 లక్షలు పరిహారం ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ఎకరాకు రూ.10 లక్షలు మాత్రమే మార్కెట్ విలువ ఉందని అధికారులు మాట మారుస్తున్నారని, దీని ప్రకారం రూ.25 లక్షలకు మించి పరిహారం రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యు.కొత్తపల్లి మండలం అమరవిల్లిలో సుమారు 20 ఎకరాలు సేకరిస్తుండగా ఇక్కడ కూడా మార్కెట్ విలువ రూ.10 లక్షలు మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నారు. జగనన్న కాలనీలకు సేకరించిన భూములకు ఇచ్చినట్లుగానే ఎకరాకు రూ.46 నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పరిహారం పెంచేలా చర్యలు తీసుకోవాలని 338 మంది రైతులు జిల్లా కలెక్టర్ కోర్టులో ఆర్బిట్రేషన్ పిటిషన్లు వేశారు.


నష్టపరిహారం పెంచాలి



నాలుగేళ్ల క్రితం రోడ్డు కోసం సర్వే జరిగింది. దాని ప్రకారం భూ సేకరణ చేస్తున్నారు. ఎకరా రూ.60 లక్షలకు పైగా పలికే భూములకు కనీస పరిహారం కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఎప్పటికైనా స్పందించి మార్కెట్ ధరను పెంచి పరిహారం చెల్లించాలి.

దల్లి నాగిరెడ్డి, రైతు, అమరవిల్లి, యు.కొత్తపల్లి మండలం

భారత హాకీజట్టు సహాయ కోచ్‌గా హాల్కెట్



భువనేశ్వర్: భారత పురుషుల, మహిళల హాకీజట్టు విశ్లేషణాత్మక కోచ్‌గా హాల్కెట్ ఫారీ నియమించబడ్డాడు. పురుషుల జట్టు కొత్త చీఫ్ కోచ్‌గా క్రెయిగ్ ఫుల్టన్ ఎంపిక కాగా.. ఇతర సభ్యులుగా రెట్ హాల్కెట్, అలాన్ టాన్‌లు వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని హాకీ ఇండియా(హెచ్‌ఐ) శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. దక్షిణాఫ్రికాకు చెందిన హాల్కెట్ 2010-18 మధ్యకాలంలో 155 అంతర్జాతీయ ఆడాడు. అలాగే 2022 స్కాట్లాండ్‌కు అసిస్టెంట్ కోచ్‌గా, అండర్-21 జట్టుకు ప్రధాన కోచ్‌గా వ్యవహరించిన అనుభవముంది. ఇక మహిళల హాకీజట్టు చీఫ్ కోచ్‌గా కెనడాకు చెందిన ఆంథోనీ పారీ నియమింపబడ్డాడు. ఫారీ 2020లో అమెరికా మహిళల హాకీజట్టు చీఫ్ కోచ్‌గా ఉన్నారు. దానికి ముందు జపాన్ మహిళల జట్టుకు కోచ్‌గా ఉన్నారు. 2018 ఆసియా క్రీడల్లో జపాన్ మహిళల జట్టు భారత్‌ను ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. రాబోయే ఆసియా క్రీడలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు హాకీ ఇండియా అధ్యక్షులు దిలీప్ టిర్కే ధన్యవాదాలు తెలిపారు.

పిఐబికి విస్తృత అధికారాలు.. సెన్సార్‌షిప్‌తో సమానం

మొదటి పేజీ తరువాయి

సామాజిక మాధ్యమాల వేదికల వినియోగదారులందరినీ ప్రభావితం చేసే పూర్తి స్థాయి సెన్సార్‌షిప్‌తో సమానం కాగలదని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ చర్య పూర్తిగా అప్రజాస్వామికమని, ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఐటి నిబంధనలకు చేసిన ఈ సవరణలను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేసింది.



దీక్షల్లో కూర్చున్న ఉక్కు కార్మికులు

'ఉక్కు'పై కేంద్రం కుట్రలను తిప్పికొడతాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పన్నుతోన్న కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన దీక్షలు శుక్రవారానికి 785వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, చిత్రాడ సన్యాసిరావు, డి.శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపదని, కార్పొరేట్లకు కట్టబెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి.. ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేస్తోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలేగానీ సహజ మరణం దిశగా నెట్టే ప్రయత్నం చేస్తే సహించేది లేదన్నారు. 2021-22 వార్షిక లెక్కల ప్రకారం దాదాపు రూ.950 కోట్ల నికర లాభంతో రూ.28 వేల కోట్ల పైచిలుకు టర్నోవర్ చేసిన పరిశ్రమను కేవలం కొద్ది నెలల్లోనే నష్టాల దిశగా నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం సకాలంలో ఉత్పత్తికి కావాల్సిన కోకింగ్ కోల్, బాయిలర్ కోల్ వంటి ముడిసరుకులను కొనుగోలు చేయకుండా తాత్సారం చేస్తోందన్నారు. సంవత్సరం నుంచి బ్లాస్ట్ ఫర్నేస్‌లలో ఉత్పత్తిని తగ్గించడం వల్ల ఈ ఏడాది నష్టాల దిశగా ప్లాంట్ నడుస్తోందని తెలిపారు. కేంద్రం ఎన్ని ఎత్తుగడలు వేసినా ప్రజా ఉద్యమాల ముందు తలవంచక తప్పదన్నారు. దీక్షల్లో కార్మిక నేతలు ఎ.సుబ్బయ్య, అలమండ శ్రీనివాసరావు, ఎం రవికిరణ్, కొణతాల శ్రీను, బి.సూర్యనారాయణ, ఆర్.వెంకటరావు, వర్మ, నల్ల రవి పాల్గొన్నారు.

తెలుగులోనూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలు

- ఆ మేరకు సిఆర్‌పిఎఫ్ నోటిఫికేషన్‌ను సవరించాలి
- కేంద్ర హోం మంత్రికి కెటిఆర్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం హిందీ, ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే పోటీ పరీక్షలు నిర్వహించాలనే నిర్ణయాన్ని కేంద్రం సమీక్షించాలని రాష్ట్ర మంత్రి, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. తాజాగా విడుదల చేసిన సిఆర్‌పిఎఫ్ జాతీయ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో కేవలం హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో మాత్రమే పరీక్ష ఉంటుందని స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలని ఆ లేఖలో సూచించారు. సిఆర్‌పిఎఫ్ ఉద్యోగ సిబ్బంది నియామకం కోసం చేపడుతున్న పరీక్షను, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు గుర్తించబడిన అన్ని అధికారిక భాషల్లో నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. వివిధ ఉద్యోగాల కోసం అనేక పరీక్షలు నిర్వహించే బదులు, నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా కామన్ ఎలిజిబిటీ టెస్ట్ విధానంలో 12 అధికారిక భాషల్లో పరీక్ష నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే ఈ నిర్ణయం సంపూర్ణంగా అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా సిఆర్‌పిఎఫ్ సిబ్బంది నియామకం కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లోనే పరీక్ష అంటూ విధించిన పరిమితులను కేంద్ర మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకుపోయారు. అనేక అధికారిక భాషలు కలిగిన భారత దేశంలో, కేవలం హిందీ వారికి మాత్రమే మాతృభాషలో పోటీ పరీక్షలు రాసే అవకాశం ఇవ్వడం దేశ రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. దేశంలో రాజ భాష అంటూ ఏదీ లేదని రాజ్యాంగం స్పష్టంగా చెప్పిన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం ప్రాంతీయ భాషలను పట్టించుకోకుండా కేవలం హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లో ఉద్యోగాల భర్తీ పరీక్షలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. సమాన అవకాశాలు పొందేలా ఈ దేశ ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కునిసిఆర్‌పిఎఫ్ నోటిఫికేషన్ కాలరాస్తుందని తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలన్నింటిని గుర్తించబడిన అన్ని అధికారిక ప్రాంతీయ భాషల్లోనూ నిర్వహించాలని తమ ప్రభుత్వం కేంద్రాన్ని కోరిందని గుర్తుచేశారు. ఇందుకు సంబంధించి 2020 నవంబర్ 18న కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి కెసిఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. ప్రాంతీయ భాషల్లో చదువుతున్న కోట్లాది మంది యువకులకు ఎలాంటి వివక్ష, అసమానతలు లేకుండా సమాన అవకాశాలు దక్కేలా సిఆర్‌పిఎఫ్ నోటిఫికేషన్‌కు సవరణ చేయాలని అమిత్ షాకు కెటిఆర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

జెస్ట్‌మనీలో 100 మందికి ఉద్వాసన

న్యూఢిల్లీ : ఫిన్‌టెక్ సంస్థ జస్ట్‌మనీ తమ 100 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. జెస్ట్‌మనీ కొనుగోలు కోసం ఫోన్‌పే జరిపిన చర్చలు విఫలమవ్వడంతో ఈ నిర్ణయం తీసుకుంది. 20 శాతం మంది ఉద్యోగులను తొలగించినట్లు గురువారం సాయంత్రం ఆ సంస్థ సిబ్బందికి తెలిపింది. ఉద్వాసనకు గురైన వారికి ఒక నెల వేతన పరిహారం, జీవిత బీమా, మానసిక ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలను కల్పిస్తోన్నట్లు సమాచారం. కాగా.. తొలగించిన ఉద్యోగులను ఫోన్‌పే నియమించుకునే అవకాశం ఉంది.

దోషులనుశిక్షించాలి

మొదటి పేజీ తరువాయి

ఆగస్టు 20న వాకపల్లిలో గ్రేహౌండ్స్ పోలీసులు 11 మంది ఆదివాసీ మహిళలపై అత్యాచారం చేశారన్నారు. పోలీసులపై పెట్టిన కేసు విచారణను పోలీసు అధికారులే చేపట్టడం వల్ల నిందితులు తప్పించుకున్నారని తెలిపారు. బాధిత మహిళలు గ్రామాలకు నాడు తిరిగి వెళ్లినప్పుడు భర్తలు తిరిగి వాళ్లని తీసుకెళ్లేందుకు అభ్యంతరం చెప్పారని, అప్పటి ఎఎస్‌పి బాధిత మహిళలకు డబ్బులు ఇవ్వాలని చూశారని గుర్తు చేశారు. అన్ని ప్రజా, మహిళా సంఘాలూ ఆనాడు వాకపల్లిని సందర్శించాయని తెలిపారు. మానవ హక్కుల నేత బాలగోపాల్ హైకోర్టులో పిటిషన్ వేసి అక్కడ కేసు కొట్టేస్తే, సుప్రీంకోర్టులో కేసు వేశారని, దీంతో, ఆరు నెలల్లో కేసును పూర్తిగా దర్యాప్తు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించిందని తెలిపారు. అప్పుడు విశాఖలోని 11 ఎడిజె కోర్టు ట్రైల్ ప్రారంభమైందన్నారు. ఐడెంటిఫికేషన్, దర్యాప్తును అప్పటి దర్యాప్తు అధికారులు ఆనందరావు, శివానంద రెడ్డి వెంటనే వేగవంతం చేయలేదని తెలిపారు. అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి, హోం మంత్రి జానారెడ్డి తప్పుడు ఫిర్యాదు అని చెప్పడంతో దర్యాప్తు అధికారులు, వైద్యులు కేసును నీరుగార్చారని విమర్శించారు. ప్రభుత్వం, దర్యాప్తు అధికారులు ఎన్ని కుట్రలు చేసినా కోర్టు తీర్పు బాధిత ఆదివాసీ మహిళలకు అనుకూలంగా వచ్చిందన్నారు. హక్కుల సంఘాలు, ఆదివాసీ సంఘాలు, మహిళా సంఘాలు రాజకీయాలకతీతంగా అండగా నిలవడంతో ఆదివాసీ బాధిత మహిళల పదహారేళ్ల న్యాయపోరాటానికి విజయం లభించిందని, ఇది బాధిత మహిళల నైతిక విజయమని తెలిపారు.

శిక్షపడకపోవడం విచారకరం : ఏపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

వాకపల్లి ఘటనలో దోషులకు శిక్షపడకపోవడం న్యాయ చరిత్రలో విషాద ఘటనగా మిగిలిపోతుందని ఏపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అసమర్థత, పోలీసు ఉన్నతాధికారులు నిందితుల కొమ్ముకాయడం ఇందుకు కారణమన్నారు. శుక్రవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తక్షణ దర్యాప్తు జరపని పోలీసు అధికారులపై కోర్టు తీర్పుననుసరించి చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సరిగా దర్యాప్తు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని గిరిజన మహిళా సంఘం (ఐద్వా అనుబంధం) జిల్లా నాయకులు ఎస్.హైమావతి, వివి.జయ విలేకర్ల సమావేశంలో కోరారు.

థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఆధునీకరణపై దృష్టి

- జెన్‌కో ఎమ్‌డి చక్రధర్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఆధునీకరణపై దృష్టి సారిస్తామని జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు తెలిపారు. జెన్‌కో ఎమ్‌డిగా, ట్రాన్స్‌కో జెఎమ్‌డిగా విద్యుత్ సౌధలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జెన్‌కో ప్రాజెక్టుల సమీక్ష నిర్వహించారు. వేసవిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి గరిష్టస్థాయి చేరుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. బొగ్గు సరఫరాతో సహా విద్యుత్ ఉత్పత్తిలో ఎటువంటి ఇబ్బందులైనా నివారించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు.

విద్యుత్ ఉత్పత్తిలో, అత్యధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ నిర్వహణలో జాతీయస్థాయిలో అత్యుత్తమ సంస్థగా అవతరించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకు అందించాలనే ప్రభుత్వ లక్ష్యంతో జెన్‌కో పనిచేస్తుందన్నారు. సిబ్బందంతా కలిసి పనిచేయాలని సూచించారు. జెన్‌కో ప్రాజెక్టుల గురించి అధికారులు ఎమ్‌డికి వివరించారు. ఎన్‌టిటిపిఎస్ ప్లాంట్‌లో మరో 800 మెగావాట్ల యూనిట్ ఈ ఏడాదిలో ప్రారంభమవుతుందని తెలిపారు.

పరీక్షా కేంద్రం వద్ద చీటీలు

- ఇన్విజిలేటర్ సస్పెన్షన్
- చీఫ్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి- పిట్టలవానిపాలెం (బాపట్ల జిల్లా)

పదోతరగతి పరీక్షా హాలు వెలుపల చీటీలు లభించడంపై ఇన్విజిలేటర్‌ను విద్యాశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం సస్పెండ్ చేశారు. ఇద్దరు చీఫ్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం, చందోలు నీలి బంగారయ్య జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రాన్ని జిల్లా పరిశీలకులు పి.పార్వతి పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఒక రూమ్ వెలుపల రెండు చీటీలు లభించాయి. దీనిపై ఉన్నతాధికారులకు ఆమె నివేదిక ఇచ్చారు. ఇన్విజిలేటర్ నాగాంజనేయులును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. చీఫ్ ఆఫీసర్లు ఆర్‌వి.సుబ్బారావు, కె.శ్రీనివాసరావుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

విక్రయ ప్రక్రియలోనే వైజాగ్ స్టీల్

- బిడ్డర్లతో చర్చలు కొనసాగింపు
- స్టీల్ మంత్రిత్వ శాఖ వర్గాల వెల్లడి



న్యూఢిల్లీ : వైజాగ్ స్టీల్ అమ్మకం ప్రక్రియ కొనసాగుతుందని ఉక్కు మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. రాష్ట్రీయ ఇస్పాట్ నిగమ్ లిమిటెడ్ (వైజాగ్ స్టీల్) కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న బిడ్డర్లతో కేంద్ర ప్రభుత్వం చర్చలు కొనసాగిస్తుందని ఉక్కు మంత్రిత్వ శాఖ భేటీలో పాల్గొన్న వ్యక్తులు పేర్కొన్నట్లు బిజినెస్ లైన్ ఓ కథనం ప్రచురించింది. ఆ సమాచారం మేరకు.. పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగానే గతేడాది సెప్టెంబర్ లో ఫోర్జ్ వీల్ యూనిట్ కార్యకలాపాలు, నిర్వహణను నిలిపివేశారు. సంస్థ ప్రయివేటీకరణకు వీలుగా లావాదేవీల సలహాదారున్ని కూడా నియమించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) విక్రయ ప్రక్రయను పర్యవేక్షిస్తుంది. ఆర్‌ఐఎన్‌ఎల్ ఫోర్జ్ వీల్ ఏడాదికి 80,000 యూనిట్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. "డిజిన్వెస్ట్‌మెంట్ ప్రక్రియ ట్రాక్‌లోనే ఉంది. మెరుగైన ఆర్థిక సాధ్యత కోసం సంస్థను ప్రయివేటు శక్తులకు బదిలీ చేసే ప్రణాళికలు కొనసాగుతు న్నాయి. సుమారు 24 ఎకరాల భూమి మానిటైజేషన్ కూడా చేయబడుతుంది." అని ఓ అధికారి పేర్కొన్నారు. ఆర్‌ఐఎన్‌ఎల్‌ను అమ్మి తీరుతామని ఇంతక్రితం ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, దీపమ్ సెక్రటరీ తూహిన్ కాంత్ పాండే పలు సార్లు స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌లో 100 శాతం వాటాల విక్రయానికి 2021 జనవరి లోనే కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ ప్రక్రియను ముందుకు తీసుకు వెళ్లే పనిలోనే తాము ఉన్నామని పాండే తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాంట్‌ను ప్రయివేటుకు అమ్మనివ్వబోమంటూ వైజాగ్ స్టీల్ ఉద్యోగులు, కార్మికులు, అక్కడి ప్రజా సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయమూ తెలిసిందే.

రాష్ట్రానికి ఏం చేశారని 'మన భవిష్యత్'

- యువగళంలో జగన్మోహన్‌రెడ్డిపై లోకేష్ విమర్శలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని సొంత తల్లి, చెల్లి సైతం నమ్మడం లేదని, ఇలాంటి వ్యక్తిని రాష్ట్ర ప్రజలు ఎలా నమ్ముతారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రశ్నించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 63వ రోజుకు చేరుకుంది. శుక్రవారం ఉదయం అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం మర్తాడులో ప్రారంభమైన పాదయాత్ర బూదేడు, గార్లదిన్నె మీదుగా జంబులదిన్నెకు చేరింది. లోకేష్ పాదయాత్ర శుక్రవారంనాటికి 800 కిలో మీటర్ల మైలురాయిని దాటింది. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు. అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవం కూడా ఇదే రోజు కావడంతో 'గంజాయి వద్దు బ్రో' అన్న నినాదంతో ఉన్న క్యాప్‌ను తలకు ధరించి పాదయాత్రలో లోకేష్ పాల్గొన్నారు. మత్తు పదార్థాలు వినియోగించి యువత ఆరోగ్యాలు పాడుచేసుకుంటున్నారని, వీడిని వాడవద్దంటూ తన ప్రసంగాల్లోనూ ప్రస్తావించారు. అనంతరం జరిగిన బహిరంగ సభల్లో మాట్లాడారు. రాష్ట్రాన్ని అధోగతిపాలుజేసిన జగన్మోహన్‌రెడ్డి ఏ ముఖం ఎత్తుకొని జగనే మా భవిష్యతుఉ కార్యక్రమాన్ని చేపడుతున్నారని ప్రశ్నించారు. ఇంటింటికి స్టిక్కర్లు వేస్తున్న వలంటీర్లను నిలదీయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే అతి తక్కువ ఐటి ఎగుమతులు చేస్తున్న రాష్ట్రమని తేలిందన్నారు. వైసిపి చెపట్టిన మరో కార్యక్రమం 'జగన్‌కు చెబుదాం' అని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డికి ఏమని చెప్పాలి... బాబాయి వివేకానందరెడ్డిని ఎవరు చంపారని చెప్పాలా... కోడికత్తి కేసులో దాడి ఎవరు చేయించారో చెప్పాలా... అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణితో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



యువగళం పాదయాత్ర 800 కిలో మీటర్ల మైలురాయి శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నారా లోకేష్, నందమూరి బాలకృష్ణ

వైసిపి పాలనలో అంతా వినాశనమే : ఎమ్మెల్యే బాలకృష్ణ

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్య, వైద్యం ఇలా అన్ని రంగాలూ నాశనం అయ్యాయని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విమర్శించారు. లోకేష్ పాదయాత్రకు మద్దతుగా శుక్రవారం ఆయన అనంతపురం జిల్లా శింగమనల నియోజకవర్గం మార్తాడుకు విచ్చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలవుతోందని తెలిపారు. ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో రాష్ట్రం మరో శ్రీలంకగా మారుతుందని చెప్పారు. రాష్ట్రంలో సాగుతోంది సైకో పాలన, ఆయనకు ప్రజలపై ఏ మాత్రం ప్రేమలేదని విమర్శించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని, రాష్ట్రానికి సరైన మార్గంలో నడిపించే టిడిపిని గెలిపించాల్సిన బాధ్యత ఉందని అన్నారు.

ఏప్రిల్, మే, జూన్ నెలలకు 10న సదరం స్లాట్ బుకింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సదరం స్లాట్ బుకింగ్ ఈనెల 10న ప్రారంభం కానుంది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి స్క్రీనింగ్ కోసం ముందస్తు స్లాట్ బుకింగ్ చేసుకోదలచిన వారు గ్రామ సచివాలయాలు, మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవచ్చని ఎపి వైద్య విధాన పరిషత్ పేర్కొంది.

ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మీసేవ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రారంభించబడిన ముందస్తు స్లాట్ బుకింగ్ గడువు మార్చి 31తో ముగిసిందని, ఈ నేపథ్యంలో తాజా స్లాట్‌లు అవసరమైన నేపథ్యంలో స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించినట్లు తెలిపింది. జిజిహెచ్ / రిమ్స్, జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఇప్పటికే ఉన్న స్లాట్ నమూనా ప్రకారం స్క్రీనింగ్ యథావిధిగా కొనసాగుతుందని వివరించింది. స్లాట్‌లను బుక్ చేసుకునే సందర్భంలోనూ, వికలాంగుల స్క్రీనింగ్‌లో కోవిడ్ ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎపి వైద్య విధాన పరిషత్ పేర్కొంది.

దళితులపై దాడులను నియంత్రించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలను, దాడులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నటరాజ్, నాయకులు తాళ్లూరు నరసింహారావు, టి రవికుమార్, ఎం విజయ్‌కుమార్, కర్ల పోలయ్య తదితరులు ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి కమిషన్ చైర్మన్ ఎం విక్టర్ ప్రసాద్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల కాలంలో రోజురోజుకు దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని వివరించారు. దళితులపై దాడులు జరిగినప్పుడు పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసులను నమోదు చేయకుండా దళితులపైనే కౌంటర్ కేసులు పెడుతున్నారని తెలిపారు. నెల్లూరు జిల్లా దగదర్తి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దళిత కౌలురైతు తలారి రవికుమార్‌పై దాడి చేసి కొట్టడంతోపాటు అక్రమంగా కేసును బనాయించారని వివరించారు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొత్తూరు గ్రామంలో ఆర్‌టిసి డ్రైవర్‌పై ఆధిపత్య కులాలు దాడికి పాల్పడ్డాయని తెలిపారు. గొల్లమండల గురుకుల పాఠశాలలో దళిత విద్యార్థిపై ఉపాధ్యాయుడు కులదురహంకారంతో వ్యవహరించారని తెలిపారు. ఇలాంటి దుర్ఘటనలను నియంత్రించేందుకు ప్రభుత్వయంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పోలవరానికి కేంద్రం మొండిచెయ్యి

- నిలదీయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- హోదా, విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి



పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం మొండిచేయి చూపించిందని ఎపి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వమే నిర్మిస్తుందని 2014 ఎన్నికల ముందు తిరుపతి సభలో మోడీ చేసిన వాగ్దానాలను ఆయన గుర్తు చేశారు. గడిచిన ఎనిమిదిన్నరేళ్లలో ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. తాజా బడ్జెట్‌లోనూ పోలవరం ప్రాజెక్టుకు మొండిచేయి చూపించారని, నిధులివ్వకుండా పూర్తిస్థాయి పునరావాసం, పరిహారం ఎలా అందజేస్తారని ప్రశ్నించారు. వీటిపై రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష, జనసేన ప్రశ్నించకపోవడం శోచనీయమన్నారు. బిజెపి విషకౌగిలి నుంచి ఆ పార్టీలు బయటకు రావాలని హితవు పలికారు. ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం రాష్ట్రంలో పార్టీలన్నీ ఉమ్మడి పోరాటాలకు కలిసి రావాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి మధు మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్ పలువురు సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

కాలి గాయాన్ని రాజకీయం చేయొద్దు : వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాలికి అయిన గాయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒంటిమెట్ట కోదండరాముని కళ్యాణోత్సవానికి వెళ్లలేకపోయిన అంశాన్ని కూడా రాజకీయం చేయడం తగదని ఎపి ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శలకు ఏమీ లేకపోవడంతో సంస్కారం లేకుండా మతం, కులం ప్రస్తావనలతో కువిమర్శలు చేస్తున్నారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కాలికి అయిన గాయం మరుసటి రోజుకు కొంత మెరుగవడంతో డాక్టర్ల సూచన మేరకు చిలకలూరిపేటకు వెళ్లారని తెలిపారు. నమ్ముకున్న పార్టీకి ద్రోహం చేసిన ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు ఓటేస్తే ఆ గెలుపును చూసి తెలుగుదేశం పొంగిపోతోందని అన్నారు. ప్రజలకు ఏమి చేశామో ధైర్యంగా చెప్పేందుకే తమ పార్టీ విస్తృతంగా ప్రజల్లోకి వెళుతోందని తెలిపారు.



కాళియమర్దనాలంకారంలో శ్రీకోదండరాముడు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శుక్రవారం కాళీయమర్దనాలంకారంలో రాములవారు దర్శనమిచ్చారు. ఉదయం ఎనిమిది గంటల నుండి కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్క భజనలు, కోలాటాలతో, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. 11 గంటలకు ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామి, అమ్మవార్లకు వేడుకగా అభిషేకం చేశారు. సాయంత్రం ఐదు గంటలకు ఊంజల్‌సేవ, రాత్రి ఏడు గంటలకు హనుమంత వాహనంపై స్వామివారు యాత్రికులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, విశేష సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం : బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు శనివారం ఉదయం 10.30 గంటలకు చక్రస్నానం వైభవంగా జరగనుంది. రాత్రి ఏడు గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

రేపు పుష్పయాగం : కోదండరామస్వామి వారి ఆలయంలో పదోవ రోజు ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు..

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సజీవ దహనం కేసులో నలుగురి అరెస్టు, ఒకరు పరారీ

ప్రజాశక్తి - తిరుపతి అర్బన్

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సజీవ దహనం కేసులో వివాహేతర సంబంధమే ప్రధాన కారణమని, హత్యకు ఐదుగురు కీలకంగా వ్యవహరించారని పోలీసులు వెల్లడించారు. కేసు వివరాలను మీడియాకు వెల్లడించిన ఎఎస్‌పి వెంకట్రావు కథనం మేరకు.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సోంపల్లి జయరామయ్యకు ఇద్దరు కొడుకులు నాగరాజు, పురుషోత్తం ఉన్నారు. ఇద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన రిపంజయ భార్యతో పురుషోత్తానికి వివాహేతరం సంబంధం ఉంది. దీంతో ఇరు కుటుంబాల మధ్య ఇటీవల వివాదం చోటు చేసుకుంది. పురుషోత్తంను ఎలాగైనా చంపాలని రిపంజయ ప్రయత్నిస్తున్నాడని గుర్తించిన కుటుంబసభ్యులు ఆయనను బెంగళూరుకు పంపారు. నాగరాజుకు రిపంజయ ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడాడు. ఆ సంభాషణను నాగరాజు ఫోన్‌లో రికార్డు చేసి గ్రామంలో తెలిసిన వారందరికీ వినిపించడంతో రిపంజయ అవమానంగా భావించాడు. ఈ విషయాన్ని తన అన్న చాణిక్యప్రతాప్‌కు రిపంజయ తెలిపాడు. నాగరాజును చంపాలని పథకం రచించారు. గోపినాథ్‌రెడ్డి సహాయంతో నాగరాజును చంద్రగిరికి పిలిపించారు. నాగరాజు బంధువులైన బొప్పరాజుపల్లికి చెందిన రమేష్, కుమార్ సాయంతో నాగరాజుకు అధిక మోతాదులో మద్యం తాగించి పథకం ప్రకారం ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. శవాన్ని కారులో పడేసి, పెట్రోలు పోసి నిప్పంటించారు. ఈ కేసులో రిపంజయ, చాణిక్య ప్రతాప్, గోపీనాథ్‌రెడ్డి, రమేష్, కుమార్‌లపై కేసు నమోదు చేశారు. నలుగురిని అరెస్టు చేయగా, చాణిక్య ప్రతాప్ పరారీలో ఉండడంతో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని ఎఎస్‌పి తెలిపారు.

'ది ప్రింట్' కథనంపై ఏం చెబుతారు?

జగన్‌కు బొండా ఉమా ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో అందరి ముఖ్యమంత్రుల కంటే సిఎం జగన్ ధనవంతుడని ది ప్రింట్ వెబ్‌సైట్ కథనం పేర్కొందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. దీనిపై జగన్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు డబ్బు లేదంటున్న జగన్ దేశంలోనే అత్యంత ధనవంతుడైన ముఖ్యమంత్రి ఎలా అయ్యారని ప్రశ్నించారు. ఐదేళ్లలో 25లక్షల ఇళ్లు నిర్మిస్తానని చెప్పిన జగన్ నాలుగేళ్లల్లో ఐదిళ్లే కట్టారని చెప్పారు. టిడిపి ప్రభుత్వం పేదలకోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను ఇప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వకుండా పాడుపెట్టారని అన్నారు. ఈ ఇళ్లను తనఖాపెట్టి రూ.4వేల కోట్ల అప్పు తెచ్చారని చెప్పారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచనని నాలుగేళ్లలో ఎనిమిది సార్లు పెంచి రూ.50వేల కోట్లకు పైగా భారాన్ని ప్రజలపై మోపారని తెలిపారు. ఇచ్చిన హామీల్లో 87శాతం నెరవేర్చానంటున్న జగన్ వాటిని ఎక్కడ, ఎప్పుడు నెరవేర్చారో చెప్పాలని నిలదీశారు. జగన్ పాలనలో రాష్ట్రంలో గన్ కల్చర్ మొదలైందని, గంజాయి, డ్రగ్స్ మాఫియా ఎక్కువైందని తెలిపారు.

నేటి నుంచి ఉద్యోగుల మలిదశ పోరాటం

- 29వరకు ఆందోళనలు
- సిఎస్ జవహర్‌రెడ్డికి ఎపి అమరావతి జెఎసి నోటీసు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఎపి అమరావతి జెఎసి పేర్కొంది. ప్రభుత్వం ఉద్యోగులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, కనీసం జీతాలు, పెన్షన్లు కూడా సకాలంలో ఎందుకు చెల్లించలేకపోతుందో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వ పెద్దలపై ఉందని జెఎసి తెలిపింది. సిఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డిని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, వలిశెట్టి దామోదరరావు నేతృత్వంలో ప్రతినిధులు శుక్రవారం విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో కలిశారు. మలిదశ ఉద్యోగుల పోరాటం ఈనెల 29 వరకు నిర్వహిస్తామని పేర్కొంటూ అందుకు సంబంధించిన షెడ్యూల్ నోటీసును సిఎస్‌కు అందజేశారు. అనంతరం బొప్పరాజు వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ ఉద్యమం మొదలు పెట్టాక రెండుసార్లు ప్రభుత్వంతో చర్చలు జరిగినప్పటికీ ఉద్యోగులకు చట్టప్రకారం చెల్లించాల్సిన నాలుగు డిఎల బకాయిలు, పిఆర్‌సి అరియర్స్ అంశాలకు సంబంధించి మొత్తం ఎంత చెల్లించాలి? ఇప్పటి వరకు ఎంత చెల్లించారు? అనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో మలిదశ ఉద్యమానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. కొత్త డిమాండ్ల కోసం ఉద్యోగులు ఆందోళన చేయడం లేదని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేయాల్సి రావడం పట్ల చింతిస్తున్నామన్నారు. సిఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డిని కలిసి నోటీసు అందజేసిన వారిలో ఎపిజెఎసి అమరావతి నాయకులు బి. కిశోర్‌కుమార్, కెపి చంద్రశేఖర్, ఐఎల్ నారాయణ, ఎ.సాంబశివరావు, ఎస్.మల్లేశ్వరరావు, కె.సుమన్, బత్తిన రామకృష్ణ, డి.శ్రీనివాస్, జి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చింతకాయల అప్పారావు పాల్గొన్నారు.



నేడు విజయవాడ లెనిన్ సెంటర్‌లో ప్లకార్డుల ప్రదర్శన

విజయవాడ లెనిన్ సెంటర్‌లో శనివారం ఉదయం 10.30 గంటలకు ఎపి అమరావతి జెఎసి నేతృత్వంలో నల్ల కండువాలు ధరించి, డిమాండ్లతో కూడిన "ప్లకార్డుల ప్రదర్శన" నిర్వహించనున్నట్లు జెఎసి నేతలు తెలిపారు.

పవర్ ఫైనాన్స్ అదిరిపోయే రిటర్న్స్

ఏడాదిలో 38 శాతం రాబడి



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పిఎఫ్‌సి) తమ ఇన్వెస్టర్లకు అదిరిపోయే రాబడిని అందించింది. తన డివిడెండ్, షేర్ల పెరుగుదలతో బ్యాంక్ ఎఫ్‌డిల కంటే ఆకర్షణీయ రిటర్న్స్ ఇచ్చింది. గడిచిన ఏడాదిలో ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.10 డివిడెండ్‌ను అందించింది. అదే సమయంలో షేర్ ధర 30 శాతం పెరిగింది. ఏడాదికి క్రితం పిఎఫ్‌సి షేర్ విలువ రూ.120గా ఉంది. గురువారం ఈ కంపెనీ షేర్ విలువ రూ.156 వద్ద నమోదయ్యింది. 2022 జూన్‌లో ప్రతీ షేర్‌పై రూ.1.25, సెప్టెంబర్‌లో రూ.2,25, నవంబర్‌లో మరో రూ.3, 2023 ఫిబ్రవరిలో రూ.3.50 శాతం చొప్పున పలు సార్లు డివిడెండ్ చెల్లింపులు చేసింది. షేర్ల ధర పెరుగుదల, డివిడెండ్ కలుపుకుంటే నిరకరంగా 38 శాతం రాబడి నమోదయ్యింది. గతేడాదిలో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై గరిష్టంగా వడ్డీపై 7 శాతం రాబడి ఉంది. సాంప్రదాయ పెట్టుబడుల కంటే పిఎఫ్‌సి అధిక రిటర్న్‌లను అందించినట్లయ్యింది.


క్వాంటమ్ నుంచి కొత్త ఇ-స్కూటర్



హైదరాబాద్ : ఎలక్ట్రిక్ స్కూటర్ల డిజైన్, తయారీదారు అయినా క్వాంటమ్ ఎనర్జీ కొత్త వేరియంట్లను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. వాణిజ్య డెలివరీలకు వీలుగా 'క్వాంటమ్ బిజినెస్' పేరుతో వీటిని విడుదల చేసింది. మూడేళ్ల పాటు లేదా 90వేల కిలోమీటర్ల వరకు వారంటీని అందిస్తున్నట్లు తెలిపింది. సింగిల్ చార్జింగ్‌తో 130 కిలోమీటర్ల వరకు ప్రయాణించడానికి వీలుందని తెలిపింది. వీటి ధరలు రూ.99,000 నుంచి ప్రారంభం అవుతాయని తెలిపింది.

సికింద్రాబాద్ - తిరుపతి
వందే భారత్ టికెట్ ధరలివే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సికింద్రాబాద్ - తిరుపతి మధ్య వందేభారత్ రైలును (20701) ప్రధాన మంత్రి నరేంద్రమోడీ శనివారం ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రారంభించనున్నారు. ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్‌లో పేర్కొన్న ప్రకారం ఈ ట్రైన్ టికెట్ ధరలిలా ఉంటాయి. సికింద్రాబాద్ - తిరుపతి ఎసి ఛైర్‌కార్ టికెట్ ధర రూ.1680, ఎగ్జిక్యూటివ్ ఛైర్‌కార్ టికెట్ ధర రూ.3080లుగా నిర్ణయించారు. తిరుపతి - సికింద్రాబాద్‌కు ఎసి ఛైర్‌కార్ టికెట్ ధర రూ.1625, ఎగ్జిక్యూటివ్ ఛైర్ కార్ టికెట్ ధర రూ.3030లుగా పేర్కొన్నారు. సికింద్రాబాద్-తిరుపతి టికెట్ ధర బేస్ ఫేర్ రూ.1168గా నిర్ణయించారు. రిజర్వేషన్ ఛార్జీ రూ.40, సూపర్ ఫాస్ట్ ఛార్జీ రూ.45, మొత్తం జిఎస్‌టి రూ.63గా పేర్కొన్నారు. రైల్లో సరఫరా చేసే ఆహార పదార్థాలకుగానూ రూ.364 చొప్పున ఒక్కో ప్రయాణికుడి నుంచి క్యాటరింగ్ ఛార్జీ వసూలు చేయనున్నారు. తిరుపతి- సికింద్రాబాద్ రైల్లో బేస్ ఛార్జీని రూ.1169గా పేర్కొన్నారు. కేటరింగ్ ఛార్జీ రూ.308గా నిర్ణయించారు. ఈ ఛార్జీలకు టికెట్ బుకింగ్ కన్వీనియెన్స్ ఛార్జీలు అదనంగా ఉంటాయి. సికింద్రాబాద్ నుంచి ఛైర్ కార్ ధరలు నల్గొండకు రూ.470, గుంటూరుకు రూ.865, ఒంగోలు రూ.1075, నెల్లూరుకు రూ.1270, తిరుపతికి రూ.1680గా తెలిపారు. సికింద్రాబాద్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఛైర్ కార్ ఛార్జీలు నల్గొండకు రూ.900, గుంటూరుకు రూ.1620, ఒంగోలుకు రూ.2045, నెల్లూరుకు రూ.2455, తిరుపతికి రూ.3080గా నిర్ణయించారు.

శ్రీవారిని సందర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని శుక్రవారం ప్రముఖులు సందర్శించారు. విఐపి బ్రేక్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దర్శించుకున్నారు. టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి, జెఇఒ వీరబ్రహ్మం కలిసి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ

కేంద్ర మహిళా, శిశుఅభివృద్ధి వ్యవహారాల శాఖ మంత్రి స్మృతి జుబిన్ ఇరానీ తిరుమలను సందర్శించారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కులు తీర్చుకున్న అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంత్రి వెంట మాజీ టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి ఉన్నారు.

ఎస్‌విబిసి ట్రస్టుకు రూ. 20 లక్షలు విరాళం

ఎస్‌విబిసి ట్రస్టుకు జంషెడ్‌పూర్‌కు చెందిన సర్ లాల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ సంస్థ రూ.20 లక్షలు విరాళం అందించింది. ఆ సంస్థ తరుపున ప్రతినిధి వై రాఘవేంద్ర ఈ మేరకు విరాళం చెక్కులను శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో ఇఒ ఎవి ధర్మారెడ్డికి అందజేశారు.



నేషనల్ కమిషన్ ఫర్ సఫాయి కర్మచారిస్ ఛైర్మన్ ఎం వెంకటేశన్‌ను ఎస్‌బిఐ జిఎం దేబాశిష్ మిత్రా, డిప్యూటీ మేనేజర్ మంజూ శర్మ, డిజిఎం అండ్ సిడిఒ జితేంద్ర శర్మ సత్కరించారు. వెంకటేశన్ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.

సంపాదకీయం

చెరిపేస్తే చరిత్ర చెరగదు !

కాలనాళికలో నిక్షిప్తమైన మంచి, చెడుల చరిత్ర చెరిపేస్తే చెరిగిపోదు. తొలగిస్తే తొలగిపోదు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని విద్యా సంస్థల పాఠ్యాంశాల్లో తమకు అనుకూలమైనవి ఉంచి, ప్రతికూలమైనవి తొలగించేస్తే సచ్ఛీలురమైపోతామనే భ్రమలతో సంఘ్ పరివార్, బిజెపి చేస్తున్న ప్రయత్నాలు సిగ్గుమాలినవి. కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలో నడిచే జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) ఇటీవల పది, 12 తరగతుల పాఠ్యపుస్తకాల నుంచి భారతదేశ చరిత్రకు సంబంధించిన ప్రధానమైన పాఠ్యాంశాలను తొలగించడం సంఘ్ పరివార్ తుంటరి చేష్టలకు పరాకాష్ట. మహాత్ముని హత్య, తదనంతరం సంఘ్ పరివార్‌పై నిషేధం వంటి ప్రధాన పాఠ్యాంశాలను తాజాగా తొలగించారు. కోవిడ్ నేపథ్యంలో సిలబస్ భారాన్ని తగ్గించే క్రమంలో హేతబద్ధీకరణతో కొన్ని పాఠ్యాంశాలను తొలగిస్తున్నామంటూ గతేడాది ఎన్‌సిఇఆర్‌టి ప్రకటించింది. జాతీయ సమైక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొదించే పాఠ్యాంశాలను, సంఘ్ పరివార్ నేతల అసలు బాగోతాన్ని చాటి చెప్పే అధ్యాయాలను, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటి చెప్పే అంశాలను, లౌకికతత్వం, ప్రజాస్వామ్యం వంటి రాజ్యాంగ విలువలను పెంపొందించే పాఠ్యాంశాలను ఇప్పటికే తొలగించారు. తాజాగా ప్రచురించిన కొత్త పుస్తకాల్లో ప్రధానంగా జాతిపిత మహాత్మాగాంధీకి సంబంధించిన పాఠ్యాంశాలు, అలాగే సంఘ్ పరివార్‌పై నిషేధం వంటి భాగాలను తొలగించేశారు. గతేడాది సిలబస్ భారాన్ని తగ్గించాలనే పేరుతో తొలగిస్తే ఈ ఏడాది తొలగింపులకు కారణాలే చెప్పకపోవడం గమనార్హం. సంఘ్ పరివార్‌కు ప్రతికూలంగా ఉన్న పాఠ్యాంశాలు తొలగించేసి తాము సచ్ఛీలురమని అబద్ధాలు ప్రచారం చేసుకోవడానికి ఇదొక ఎత్తుగా కనిపిస్తోందే తప్ప మరో కారణమేదీ కానరాదు.

భరతమాత దాస్య శృంఖలాలను తెంచిన స్వతంత్ర సంగ్రామంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి లొంగిపోయిన చీకటి చరిత్ర సంఘ్ పరివార్‌ది. షాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి యువకిశోరాలు ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి భారతావనికి స్వేచ్ఛ ప్రసాదించేందుకు నవ్వుతూ ఉరికంబమెక్కితే..పట్టుమని పది రోజులు కూడా కారాగారవాసాన్ని భరించలేక వి.డి సావర్కర్ వంటి నాటి మతతత్వ నేతలు బ్రిటీష్ పాలకులకు మోకరిల్లిన సిగ్గుమాలిన చరిత్ర సంఘ్ పరివార్‌ది. దేశానికి స్వతంత్రం సిద్ధించిన తర్వాత కూడా వారిది హీన చరిత్రే. మహాత్మ గాంధీ హత్య మొదలు..గోద్రా అనంతర మారణహోమం దాకా..గౌరీ లంకేష్, గోవింద్ పన్సారే, నరేంద్ర దభోల్కర్ వంటి హేతువాదులను బలిగొన్న ముసుగు గూండాలు మొదలుకొని..దళితులను, మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్న గోగూండాల వరకు.. వినాశకర, విధ్వంసకర మూఢత్వ భావజాలం నిండిన తడారని నెత్తుటి చరిత్ర సంఘ్ పరివార్‌ది.

చరిత్రను మతోన్మాద ధోరణులతో తిరిగిరాయడానికి చేస్తున్న ప్రాజెక్టులో ఇది ఒక భాగం. కేవలం మతతత్వ అభిప్రాయ భేదాలను ప్రాతిపదికగా తీసుకుని కాలగర్భంలో నిక్షిప్తమైన గతాన్ని తొలగించలేమన్న ఇంగితం కూడా మోడీ సర్కార్‌కు లేకపోయింది. మొఘల్ సామ్రాజ్యం గురించిన మొత్తం అధ్యాయాలను తొలగించడం ద్వారా చరిత్రను వక్రీకరించే మెజారిటీవాదుల ధోరణిని ఎన్‌సిఇఆర్‌టి చర్య ప్రతిబింబిస్తోంది. మహాత్మా గాంధీ హత్య, తదనంతరం ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించడానికి దారితీసిన పరిస్థితులకు సంబంధించిన కీలకమైన పాఠ్య భాగాలను తొలగించడం కచ్చితంగా ఆర్‌ఎస్‌ఎస్ విచ్ఛిన్నకర, హింసాత్మక పాత్రను తుడిచిపెట్టే ఉద్దేశ్యం మినహా మరొకటి కాదు. హేయమైన ఈ చర్యలను చైతన్యశీలురైన ప్రజానీకమే తిప్పికొట్టాలి. మన రాజ్యాంగం విద్యను ఉమ్మడి జాబితాలో చేర్చింది. కానీ మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగ విరుద్ధంగా విద్యను కేంద్రీకరించే పన్నాగాలు కొనసాగిస్తోంది. ఏకపక్షంగా నూతన విద్యా విధానాన్ని రుద్దుతోంది. కేంద్రీకరణ, కాషాయీకరణ, వ్యాపారీకరణ గావించే ఈ యత్నాలను ప్రజలందరం ప్రతిఘటించి తీరాలి. పార్లమెంటును దాటవేసి, రాష్ట్రాలను, విద్యతో సంబంధమున్న అన్ని పక్షాల అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ భారత విద్యా వ్యవస్థను నాశనం చేయాలని చూస్తున్న సంఘ్ పరివార్ ఆగడాలను ప్రజలందరూ ఐక్యంగా తిప్పికొట్టాలి.

మహనీయుల మాట



ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు. సామాజిక క్రమాన్ని శత్రువులు నేరాలతోను, బల ప్రయోగంతోను అణచివేయలేరు. ప్రజలే చరిత్ర నిర్మాతలు.

- సాల్వడార్ అలెండీ,
అమెరికా కుట్రలకు
బలైన చిలీ అధ్యక్షుడు, కమ్యూనిస్టు నేత.

మోడీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరుల గందరగోళం

విశ్లేషణ




ఎం. వేణుగోపాలరావు

పునరుత్పత్తి అయ్యే విద్యుత్‌ను (ఆర్.ఇ) ప్రోత్సహించే పేరుతో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు వెర్రితలలు వేస్తున్నాయి. ఒకే అంశంపై కేంద్ర మంత్రులు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ పేరుతో కాలుష్యకారకమైన బొగ్గును విద్యుత్ ఉత్పత్తికి వినియోగించటం తగ్గించాలని, ఆర్.ఇ ని ప్రోత్సహించాలని ఒకవైపు మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఈ విషయమై దేశంలో సాధించాలంటున్న లక్ష్యాలను ప్రధానమంత్రి అంతర్జాతీయ వేదికలపై ప్రకటిస్తున్నారు. మరోపక్క దేశంలో బొగ్గు గనుల తవ్వకానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను మోడీ ప్రభుత్వం ఆహ్వానిస్తున్నది. దేశంలో వాణిజ్య అవసరాల పేరుతో బొగ్గు గనులను వేలం వేసి ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నది. గనుల తవ్వకానికి, పరిశ్రమలు, ప్రాజెక్టుల స్థాపనకు అటవీ భూముల వినియోగానికి విచక్షణా రహితంగా అనుమతులు ఇస్తున్నది. పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ ప్రాజెక్టులకు పరిసరాల అనుమతి, కాలుష్య నియంత్రణా మండలి అనుమతి అవసరం లేకుండా మినహాయించే ముసాయిదా ప్రతిపాదనలను కూడా కేంద్రం చేసింది. మోడీ ప్రభుత్వ ఈ ద్వంద్వ వైఖరులలో ఇమిడి ఉన్నది పెట్టుబడిదారుల ప్రయోజనమే. ఒకపక్క స్వదేశీ పెట్టుబడిదారులకు మరోపక్క అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ...దేశంలో పెట్టుబడి పెట్టేందుకు, విపరీత లాభార్జనకు అవకాశాలను కల్పించి, చట్ట ప్రకారం పొందాల్సిన అనుమతుల నుండి మినహాయింపు ఇవ్వడమంటే వారి పబ్బం గడపటమే.

దేశంలో కృత్రిమ బొగ్గు కొరత సృష్టిస్తూ, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ థర్మల్ విద్యుత్ స్టేషన్లు విదేశీ బొగ్గును వినియోగించి కొరత లేకుండా అత్యధికంగా విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఇందుకు అత్యవసర పరిస్థితి అధికారాలను కూడా వాడుతున్నది. విద్యుత్ ఉత్పత్తికి దేశంలో బొగ్గు కొరత లేదని బొగ్గు శాఖ మంత్రి మరోపక్క ప్రకటనలు చేస్తున్నారు. విద్యుత్ స్టేషన్లకు బొగ్గు సరఫరాకు వ్యాగన్లను పెంచుతున్నట్లు రైల్వేలు ప్రకటనలు చేస్తున్నాయి. బొగ్గు రవాణాకు దేశంలో చాలినంతగా వ్యాగన్లు, ఇతర రవాణా సదుపాయాలు లభ్యం కావటం లేదని ప్రకటనలు చేసిన కేంద్రం... విదేశీ బొగ్గును దిగుమతి చేసుకున్నాక... విద్యుత్ స్టేషన్ల వరకు ఓడరేవుల నుండి సరఫరా చేసేందుకు అవసరమైన సంఖ్యలో వ్యాగన్లు, ఇతర రవాణా సదుపాయాలు ఎలా లభిస్తాయన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వటం లేదు. దేశంలో బొగ్గు రవాణాకు విద్యుత్, బొగ్గు,

వాస్తవానికి రోజంతా ఉత్పత్తి అయ్యే థర్మల్ విద్యుత్‌కు ఆర్.ఇ విద్యుత్ అనుబంధంగా ఉండాలి. మోడీ ప్రభుత్వ వైఖరి ఇందుకు విరుద్ధంగా ఉంది. పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్‌ను ఎక్స్ఛేంజ్‌ల ద్వారా యూనిట్‌కు రూ.50 వరకు అమ్ముకొనేందుకు అనుమతిస్తూ సిఇఆర్‌సి ఉత్తర్వు జారీ చేసింది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించిన కొద్దీ, విద్యుత్ కొరత పెరిగి, మార్కెట్లో విద్యుత్ చార్జీలు పెరుగుతాయని అనుభవం స్పష్టం చేస్తున్నది. ఈ మోడీ ప్రభుత్వ తలతిక్క విధానాలు విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని పెంచి, వినియోగదారులపై చార్జీల భారాన్ని లేదా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీని లేదా రెండింటిని పెంచాల్సిన పరిస్థితికి దారితీస్తున్నాయి.

రైల్వే, ఓడరేవుల మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం కోసం కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం పార్లమెంటులోను, బయట ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో బొగ్గు కొరతను నివారించటంలో, రవాణాకు తగిన ఏర్పాట్లు చేయటంలో విఫలమౌతున్నది.

ఒకపక్క విదేశీ బొగ్గును దిగుమతి చేసుకుని అత్యధికంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న ఆదేశానికి విరుద్ధంగా, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ థర్మల్ విద్యుత్ కేంద్రాలను క్రమేణా మూసివేయాలని, వాటికి బదులు ఆర్.ఇ విద్యుత్‌ను చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ, ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలను ఆదేశించింది. ఆ విధంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు తమ ప్రాజెక్టుల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 2023-24లో 20 శాతం, 2024-25లో 35 శాతం, 2025-26లో 45 శాతం మేరకు తాను నిర్దేశించిన లక్ష్యం ప్రకారం తగ్గించాలని ఆదేశించింది. అలా తగ్గించిన థర్మల్ విద్యుత్ సామర్థ్యం బదులు అందుకు సమానమైన సౌర, ఇతర ఆర్.ఇ విద్యుత్ సామర్థ్యాన్ని చేర్చాలని ఆదేశించింది. దానివల్ల తలెత్తే పర్యవసానాలు ఎలా ఉంటాయనేది పట్టించుకోకుండా మోడీ ప్రభుత్వం గుడ్డెద్దు చేలో పడ్డట్లు వ్యవహరిస్తున్నది.

లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో నెలకొల్పి, విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న థర్మల్ విద్యుత్ స్టేషన్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి, చివరకు మూసివేస్తే వాటిల్లే భారీ నష్టాలను ఎవరు, ఎలా భరించాలనేది మోడీ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టటం లేదు. థర్మల్ విద్యుత్ స్టేషన్ల ఉత్పత్తి సామర్థ్యానికి కేంద్రం నిర్దేశించిన విధంగా తగ్గించాలంటే అనేక సాంకేతిక సమస్యలు ఎదురవుతాయి. అనవసరంగా అధిక ఆర్.ఇ ని కొనుగోలు చేయటం వల్ల ఇప్పటికే థర్మల్ విద్యుత్ స్టేషన్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్-పిఎల్ఎఫ్) తగ్గించటం, పెంచటంలో ఇబ్బందులు, నష్టాలు ఎదురవుతున్నాయని ఇంజినీర్ల సంఘాల ప్రతినిధులు ఎపిఇఆర్‌సి బహిరంగ విచారణలలో వివరించారు. వీటిపై అధ్యయనం జరిపిస్తామని రెండేళ్ల క్రితం అప్పటి ఎపిఇపిడిసిఎల్ సిఎండి బహిరంగ విచారణలో ప్రకటించారు. కేంద్ర విద్యుత్ అథారిటీ (సిఇఎ) నియమించిన నిపుణుల కమిటీ ఆర్.ఇ ని గ్రిడ్‌లో చేర్చటంలో తలెత్తుతున్న సాంకేతిక, ఆర్థిక సమస్యలను, వాటిల్లే నష్టాలను వివరిస్తూ ఇచ్చిన నివేదికలోని అంశాలను రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలు ఎపిఇఆర్‌సికి లిఖితపూర్వకంగా చేసిన నివేదనలలో పొందుపరిచాయి. 2020-21 సంవత్సరానికి ఇచ్చిన చార్జీల ఉత్తర్వులో కమిషన్ వాటిని పొందుపరిచింది. బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులతో డిస్కమ్‌లు చేసుకున్న దీర్ఘకాలిక పిపిఎ లలోని షరతులు చట్టబద్ధంగా వర్తిస్తాయి. ఆ ప్రాజెక్టులు ఉత్పత్తిని తగ్గించాలని కేంద్రం ఆదేశం మేరకు డిస్కమ్‌లు స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డిసి) ద్వారా ఆదేశిస్తే, ఆ మేరకు స్థిర చార్జీలను చెల్లించాలి. పిపిఎ ల గడువు ఉన్నంతవరకు వాటిని మూసివేయాలని ఆదేశించాలంటే, ఆ థర్మల్ ప్రాజెక్టులకు పిపిఎ గడువు ముగిసే వరకు సంవత్సరాలపాటు విద్యుత్‌ను పొందకుండానే డిస్కమ్‌లు స్థిర చార్జీలను చెల్లిస్తూ, ఆ భారాలను వినియోగదారులపై మోపాల్సి వస్తుంది. ఆర్.ఇ విద్యుత్ పీక్ డిమాండ్ తీర్చలేదు గనుక, దానికి అనుబంధంగా పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్ వంటివి అభివృద్ధి చేయాలని నిర్ణయించి కేంద్రం అందుకు ప్రోత్సాహకాలను కూడా ప్రకటించింది.

వాస్తవానికి రోజంతా ఉత్పత్తి అయ్యే థర్మల్ విద్యుత్‌కు ఆర్.ఇ విద్యుత్ అనుబంధంగా ఉండాలి. మోడీ ప్రభుత్వ వైఖరి ఇందుకు విరుద్ధంగా ఉంది. పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్‌ను ఎక్స్ఛేంజ్‌ల ద్వారా యూనిట్‌కు రూ.50 వరకు అమ్ముకొనేందుకు అనుమతిస్తూ సిఇఆర్‌సి ఉత్తర్వు జారీ చేసింది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించిన కొద్దీ, విద్యుత్ కొరత పెరిగి, మార్కెట్లో విద్యుత్ చార్జీలు పెరుగుతాయని అనుభవం స్పష్టం చేస్తున్నది. ఈ మోడీ ప్రభుత్వ తలతిక్క విధానాలు విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని పెంచి, వినియోగదారులపై చార్జీల భారాన్ని లేదా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీని లేదా రెండింటిని పెంచాల్సిన పరిస్థితికి దారితీస్తున్నాయి. విద్యుత్‌ను బ్యాటరీలో నిల్వ ఉంచి అవసరమైనప్పుడు వినియోగించుకోవటం చాలా ఖరీదైన వ్యవహారమని ప్రస్తుత పరిస్థితి నిర్ధారిస్తున్నది. విద్యుత్‌ను నిల్వ ఉంచి, అవసరమైనప్పుడు వాడుకునేందుకు నిలకడగా చవకగా ఉండే బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్ అభివృద్ధి చెందితే పరిస్థితి మెరుగవుతుంది. అలాంటి పరిస్థితిలో, థర్మల్ విద్యుత్ మిగులుగా ఉన్న సమయాల్లో దానిని కూడా బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్ పద్ధతిలో వినియోగించుకునేందుకు వీలవుతుంది.

బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు 40-50 సంవత్సరాలపాటు పనిచేస్తాయి. ప్రతియేటా వాటికి విద్యుత్ కొనుగోలు చార్జీలలో భాగంగా అరుగుదల చార్జీల చెల్లింపుతో, పెట్టుబడి వ్యయానికి చేసిన అప్పులు, వడ్డీ చెల్లించటంతో యేటేటా వాటికి డిస్కమ్‌లు చెల్లించాల్సిన స్థిరచార్జీలు తగ్గుతాయి. క్రమేణా ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతున్న పాత థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులను నవీకరించి, ఆధునీకరించటం (ఆర్ అండ్ ఎం) ద్వారా వాటి పిఎల్ఎఫ్‌ను పెంచుతున్నారు. కొత్తగా నెలకొల్పే బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు గణనీయంగా ఖర్చైనా కాలుష్య నియంత్రణకు అవసరమైన సాంకేతిక ఏర్పాట్లకు వీలుంది. ప్రస్తుతమున్న, కొత్తగా నెలకొల్పే ప్రాజెక్టులకు అలాంటి ఏర్పాట్లు చేయాలని కూడా కేంద్రం ఆదేశిస్తున్నది.

కేంద్ర మంత్రులు, ప్రభుత్వం, విద్యుత్ సంస్థల, బొగ్గు కంపెనీల ఉన్నతాధికారులు అంతర్జాతీయ వేదికలలో, దేశంలో వివిధ సందర్భాలలో చేస్తున్న ప్రకటనలు బొగ్గుతో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కొనసాగాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశ విద్యుత్ రంగానికి బొగ్గు వెన్నెముక. దేశంలో విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గుది కీలకమైన పాత్ర. ఇది 2040 సంవత్సరం వరకు, ఆ తరువాత కూడా కొనసాగుతుంది. దేశ ఇంధన అవసరాలలో బొగ్గు అంతర్భాగం. దేశంలో బొగ్గు నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయి. అమెరికా, ఐరోపా యూనియన్ దేశాలు, బ్రిటన్ చారిత్రకంగా పెద్ద కాలుష్య కారకాలుగా వున్నాయి. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య ఉద్గారాల విడుదల నియంత్రణకు అంతర్జాతీయ సహకారం అవసరం. అనేక దేశాలతో పోల్చితే దేశంలో తలసరి బొగ్గు వినియోగం చాలా తక్కువ. బొగ్గుతో ఉత్పత్తి చేసే థర్మల్ విద్యుత్ బదులు ఆర్.ఇ ని చేర్చటం అనేక సమస్యలతో కూడుకున్నది. ఇది క్రమేణా జరగాలి.

వచ్చే కొద్ది దశాబ్దాలలో బొగ్గు వినియోగాన్ని నిలిపివేయటం సమస్యలకు దారితీస్తుంది. ఇవన్నీ అధికారికంగా వెలిబుచ్చిన అభిప్రాయాలే. ప్రజలపై భారాలను తగ్గించేందుకు, ప్రజావసరాలు తీర్చేందుకు అభివృద్ధి చెందుతున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. దీర్ఘకాలిక ప్రాతిపదికన అధిక చార్జీలకు ఆర్.ఇ ని కొనుగోలు చేసేందుకు మితిమీరి చేసుకున్న పిపిఎ ల ఫలితంగా...వినియోగదారులపై నివారించదగిన భారాలు కొనసాగుతున్నాయి. ఆర్.ఇ ని ప్రోత్సహించటం దశల వారీగా జాగ్రత్తగా జరగాలి. హెచ్చుతగ్గులకు లోనవుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు సాధ్యమైనంత వరకు మిగులు విద్యుత్ తక్కువగా ఉండే విధంగా వివిధ రకాల విద్యుత్ మిశ్రమంలో సాంకేతికంగా సాధ్యమైన మేరకు సమతూకం ఉండేలా సముచిత నిర్ణయాలు తీసుకోవాలి. సానుకూల, ప్రతికూల అంశాలను, లాభనష్టాలను బేరీజు వేసుకోవాలి. ఈ దిశలో పరిశోధన, అభివృద్ధికి తగిన ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలి.

/వ్యాసకర్త విద్యుత్ రంగ నిపుణులు/

రైతును ఆదుకోని ఉచిత పంటల బీమా

సమస్య


వి. కృష్ణయ్య

వ్యవసాయ రంగ, సాగు అనుబంధ కార్యకలాపాలపై రైతులకు మద్దతు కల్పించేందుకు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు (ఆర్.బి.కె) స్థాపించబడ్డాయి. నాణ్యమైన ఉత్పాదకాలను (విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మొదలైనవి) రైతులకు అందుబాటులోకి తేవడం, పండిన పంటలు కొనడం వాటి బాధ్యత.

డా|| వై.ఎస్.ఆర్ ఉచిత పంటల బీమా పథకాన్ని 2020 ఖరీఫ్ నుండి అమలు చేస్తున్నారు. బీమా పథకం ద్వారా ఎంపిక కాబడిన పంటలను సాగు చేసి ఈ-క్రాప్ ద్వారా పంట నమోదు పూర్తయి ఆధార్ బయోమెట్రిక్ ఇ.కె.వై.సి పూర్తి చేసిన రైతులందరికీ బీమా రక్షణ కల్పించే విధంగా ఈ పథకాన్ని రూపొందించారు.

ఏదైనా విపత్తు వల్ల పంట నష్టం సంభవించి దిగుబడి నష్టం జరిగిన సందర్భంలో డాక్టర్ వై.ఎస్.ఆర్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా అర్హులకు బీమా పరిహారం అందించబడుతుంది. ఈ-క్రాప్ బుకింగ్ పంట కోత ప్రయోగాల ద్వారా దిగుబడి అంచనా మొదలైన వాటికి సంబంధించిన అన్ని కార్యకలాపాలు ఆర్.బి.కె ల చేత అమలు చేయబడుతున్నాయని ప్రభుత్వం చెబుతున్నది. అంతేకాక ఈ-క్రాప్ బుకింగ్ జాబితాలు, పంట బీమా లబ్ధిదారుల జాబితాలు, సామాజిక తనిఖీ కోసం ఆర్.బి.కె స్థాయిలో ప్రదర్శించబడతాయని, ఫిర్యాదులను పరిష్కరించడంలో సహాయ పడుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ మంత్రి ప్రకటించారు.

వాస్తవాలను పరిశీలిస్తే పంటల బీమా అమలు గతం కన్నా మెరుగ్గా ఉన్నా...రాష్ట్రంలో అమలులో చాలా అస్తవ్యస్తంగా ఉంది. రాష్ట్ర వ్యవసాయంలో వస్తున్న ఒడిదుడుకులకు, ప్రభుత్వం అమలు చేస్తున్నామన్న దానికి చాలా వ్యత్యాసం ఉంది. రైతుల బాధలను పరిష్కరించలేకున్నది.

ఆర్.బి.కె లు సర్వరోగ నివారణ కేంద్రాలుగా పనిచేస్తున్నాయనే భ్రమలో ముఖ్యమంత్రి, ప్రభుత్వం ఉన్నట్లుగా కనిపిస్తున్నది. కానీ 10 శాతం ఆర్.బి.కె లు కూడా పనిలో లేవు. అద్దె కట్టే వారు లేరు. తలుపులు తీసిన వారు లేరు. దుమ్ము దులిపేవారు లేరు. విత్తనాలు, ఎరువులు టైముకు రావడంలేదు. అడిగిన క్వాలిటీ ఉండడం లేదు. ముఖ్యంగా లబ్ధిదారుల జాబితాలో పాలక పార్టీ వారి పేర్లు కనిపిస్తుంటాయి. ఇక పంటలు కొనుగోలు ఒక ప్రహసనమే.



ఆర్‌బికె పుస్తకాలలో రైతుల పేర్లు ఉంటాయి. ప్రభుత్వ మద్దతు ధరలకే కొన్నట్లుగా ఉంటాయి. మిల్లర్లకు నిజంగా ఎమ్.ఎస్.పి కి కొన్న దానికన్నా అదనపు మొత్తాలను రైతులు వెనక్కి చెల్లిస్తున్నారు.

పంటల బీమా పథకంలో కేంద్ర ప్రభుత్వం కూడా చేరినట్లు మంత్రి గారు నర్మగర్భంగా చెప్పారు. ప్రస్తుతం పంటల బీమా రెండు ముక్కలైంది. ఒకటి, వాతావరణ ఆధారిత బీమా (డాక్టర్ వైయస్సార్ ఎఫ్.సి.ఐ వెదర్ బేస్డ్). రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించి కొన్ని పంటలకు (26 జిల్లాల్లో) బీమా ఇస్తుంది. రెండు, దిగుబడి ఆధారిత బీమా (ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన). కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి బాధ్యత వహించి కొన్ని పంటలకు (26 జిల్లాల్లో) బీమా ఇస్తాయి. కొన్ని జిల్లాల్లో కొన్న పంటలకు ప్రైవేటు బీమా కంపెనీలను కటబెట్టడం జరిగింది. పంటల బీమాలో కేంద్రం వాటా 1/3 శాతం రావడానికి ఈ సర్దుబాటు చేసుకోవాల్సి వచ్చిందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా వాస్తవంగా చూస్తే రిలయన్స్ వంటి కార్పోరేట్ కంపెనీలను రాష్ట్రంపై ఒత్తిడి చేసి మరీ కేంద్రం చేర్పించింది.

వైఎస్ఆర్ ఉచిత పంటల బీమాను ... ఏ రాష్ట్రంలో అమలు చేయలేనన్ని పంటలకు, వివిధ రకాల భూములకు అమలు చేస్తున్నామని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం... ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.1600 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నది. గత అక్టోబర్ నుండి ఈ మార్చి చివరకు రకరకాల విపత్తులకు లక్షల మంది రైతులు పంటలు నష్టపోయారు. పాత పద్ధతిలో ఇస్తే ఎకరానికి చాలా కొద్ది మొత్తం మాత్రమే పొందుతారు. వాణిజ్య పంటలకు లక్షలలో ఖర్చు పెడుతున్నారు. పొగాకు, మిర్చి, చెరకు లాంటి పంటల నుంచి కేంద్ర ప్రభుత్వానికి విదేశీ మారక ద్రవ్యం వస్తుంది. కాని రైతు కష్టాలను, అవసరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నది రైతుల ఆవేదన.

పంటల బీమా అమలు కత్తి మీద సాము లాంటిది. అందులో ముఖ్యంగా వాతావరణ బీమా నిర్ధారణ చాలా కష్టతరమైనది. సున్నితమైన వాతావరణ మార్పులను (గాలి వేగంలో మార్పులు, గాలి తేమలో మార్పులు, గాలిలో వేడిని) ప్రతి సెకనుకు రికార్డు చేయగలిగిన నూతన యంత్రాలు వచ్చాయి. వాటి ఆధారంగా పంట నష్టాన్ని లెక్కవేస్తున్నారు. ఆచరణలో పంటల దిగుబడి చాలా తక్కువగా ఉంటున్నది. ఒకటి రెండు రోజుల పాటు వాతావరణంలో వచ్చిన మార్పులతో పంట దిగుబడిపై చాలా ప్రభావం ఏర్పడుతుంది. రైతులకు నష్టపరిహారాన్ని లెక్కించడానికి ఏ పద్ధతి అవలంభించాం అనేది ప్రధానం కాదు. నిజంగా పంట నష్టపోయిన రైతులకు ఏం ఒరిగిందనేది ముఖ్యం. రైతుల పంట నష్టాన్ని ఖచ్చితంగా గుర్తించగలిగే యంత్రాంగాలు, విధానాలు అభివృద్ధి కాలేదని అర్థమవుతున్నది.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సమాచార పత్రాన్ని పరిశీలిస్తే ... ఒక పంటకు ఓ జిల్లాలో వర్షాధారమైన పంటల బీమా వర్తిస్తుంది. అదే పంటకి ఇంకొక జిల్లాలో వర్తించదు. ఎండు మిర్చి ఎక్కువగా పండే పల్నాడు జిల్లాలో నీటిపారుదల సౌకర్యం ఉందని గత సంవత్సరం రెండు లక్షల ఎకరాల్లో పంటల బీమా అమలు కాలేదు. అదే జిల్లాలో అదే పంటకు వర్షాధార మండలాలకు బీమా అమలైంది. ప్రకాశం జిల్లా మెట్ట ప్రాంతం అని వర్షాధారమని జె పంగులూరు మండలంలో పంటల బీమా మిర్చి పంటకు వచ్చింది. దాని పక్కనే ఉన్న ఇంకొల్లు మండలంలో పది వేల ఎకరాల మిర్చి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఒక్క రూపాయి కూడా రాలేదు. కారణం! ఇంకొల్లు మండలంలో నీటిపారుదల సౌకర్యం ఉంది. పంగులూరు మండలంలో లేదట. ఎంత విడ్డూరం? మిర్చి పంట కనీసం మూడు లేదా నాలుగు తడుపుల నీరు పారాల్సిందే. కాలువలు, బావులు, చెరువులు లేకపోతే పండదు. ఈ వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించనందుకు రైతులు నష్టపోతున్నారు.

ఏలూరు జిల్లాలో పత్తి వర్షాధార ఆధారితం. అదే పత్తి పంటకు ఎన్టీఆర్ జిల్లాలో దిగుబడి ఆధారిత పద్ధతి బీమా ఉంది. ఎండు మిరప ఎన్టీఆర్ జిల్లాలో నీటిపారుదల ఆధారిత లిస్టులో ఉంది. మిరప గుంటూరు జిల్లాలో వర్షాధార ఆధారితంలో ఉంది. ఈ సంవత్సరం ఆంధ్ర రాయలసీమ జిల్లాల్లో అధిక వర్షాలకు ఎకరానికి 10 క్వింటాళ్ళకు పైగా దిగుబడి రావాల్సింది. ఐదు క్వింటాళ్ల లోపుగా వచ్చింది. ఒక ఎకరానికి రూ.50,000 పైన ఖర్చులు అయినాయి. నాసిరకం విత్తనాలతో లక్షలాది ఎకరాల్లో పత్తి పంట దిగుబడి రాక రైతులు నష్టపోయారు. నెలల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇంతవరకు ఫలితం లేదు.

ప్రకాశం జిల్లాలో ఒక లక్షా ఇరవై వేల ఎకరాల్లో పొగాకు వేశారు. పంట బాగా పెరిగి ఆకు కోసే సమయానికి సిద్ధమైన దశలో (50 రోజులు) వర్షాల వల్ల 50,000 ఎకరాల పంట పీకవలసి వచ్చింది. ఆ రైతులకు పంటల బీమా రాలేదు. ఈ సంవత్సరం మామిడి పంటకు నల్లి తెగులు వచ్చింది. ఎన్టీఆర్ జిల్లాలో గాని విజయనగరం జిల్లాలో గాని వేలాది ఎకరాల్లో మామిడి పంట నాశనం అయ్యింది. ప్రభుత్వ విధానంలో మామిడికి బీమా లేదు. వ్యవసాయ అధికారులకు, మంత్రులుకు నివేదించుకున్నా ఫలితం కనబడడం లేదు.

బాపట్ల జిల్లాలో మిరప, శెనగ, మొక్కజొన్న లాంటి పంటలు అధిక వర్షాలకు దెబ్బతిన్నాయి. రెండు మూడు సార్లు అదే పొలంలో పంటలు వేయాల్సి వచ్చింది. గోడు వినిపించుకునే అధికారులు కనబడడం లేదు. మార్చి నెలలో వచ్చిన అకాల వర్షాలకు నాలుగు లక్షల ఎకరాలలో వేలాది కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నాయి. ఈ దఫా రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకృతి విపత్తుల కోసం రూ.2000 కోట్లు కేటాయించినా దానికి ఇంతవరకు అతీగతీ లేకున్నది. పెరిగే ఖర్చులను ప్రకృతిలో వచ్చే ఒడిదుడుకులను రైతులు తట్టుకొని నిలబడగలిగే పంటల విధానాన్ని రూపొందించాల్సి ఉంది. ప్రభుత్వం తమకు అండగా ఉంటుందనే నమ్మకాన్ని రైతులు కోల్పోతున్నారు. పంట దెబ్బతిన్నప్పుడు, మిగిలిన పంటకు మార్కెట్‌లో సరసమైన ధరలు రావడానికి బడ్జెట్‌లో రూ.3000 కోట్లు కేటాయింపులున్నా తమ గోడు పట్టించుకునేవారు లేరనే ఆవేదనలో, అసంతృప్తిలో రైతు ఉన్నాడు.

వై.ఎస్.ఆర్ ఉచిత పంటల బీమాను...ఏ రాష్ట్రంలో అమలు చేయలేనన్ని పంటలకు, వివిధ రకాల భూములకు అమలు చేస్తున్నామని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం...ఈ సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1600 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నది. గత అక్టోబర్ నుండి ఈ మార్చి చివరకు రకరకాల విపత్తులకు లక్షల మంది రైతులు పంటలు నష్టపోయారు. పాత పద్ధతిలో ఇస్తే ఎకరానికి చాలా కొద్ది మొత్తం మాత్రమే పొందుతారు. వాణిజ్య పంటలకు లక్షలలో ఖర్చు పెడుతున్నారు. పొగాకు, మిర్చి, చెరకు లాంటి పంటల నుంచి కేంద్ర ప్రభుత్వానికి విదేశీ మారక ద్రవ్యం వస్తుంది. కాని రైతు కష్టాలను, అవసరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నది రైతుల ఆవేదన.

/ వ్యాసకర్త ఎ.పి రైతుసంఘం అధ్యక్షులు,
సెల్ : 9090499000 /

★

లారీ యజమానుల సమస్యలపై దృష్టి

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల (నంద్యాల)

లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బేతంచెర్ల పట్టణంలోని వైసిపి కార్యాలయంలో లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సెవెన్ హిల్స్ నాగరాజు బృందం మంత్రి బుగ్గనను కలిశారు. ఈ సందర్భంగా లారీ యజమానుల బృందం మంత్రితో మాట్లాడుతూ బేతంచెర్ల పట్టణంలో బండ్లమెట్ట రుసుము వసూళ్లను లారీ యజమానులకు మినహాయించా లని కోరారు. మండలంలో లారీ యజమానులు వారి వారి లారీలను నిలుపుకొనుటకు ప్రభుత్వం ద్వారా ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేయాల న్నారు. అనంతరం పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ సాధ్యమైనంత త్వరలో లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వైసిపి ముస్లిం ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకులు ముర్తుజావలి అనారోగ్యంతో బాధపడుతూ కోలుకున్న విషయాన్ని తెలుసుకున్న మంత్రి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. బేతంచెర్ల మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుగ్గన పరిశీలించారు.

కృష్ణా డెల్టాపై నిర్లక్ష్యం

కనీస నిర్వహణ పనులకు నిధుల లేమి • రూ.45.88 కోట్లతో ప్రతిపాదనలతోనే సరి • ముందుకుసాగని అవుట్‌ఫాల్ స్లూయిజ్ల పనులు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

కృష్ణా డెల్టాలో సాగునీటి కాల్వలు, డ్రెయిన్లకు ఈ ఏడాది ముందస్తుగానే మరమ్మతులు చేపడతామని ప్రభుత్వం చెప్పినా అమలుకు నోచుకోలేదు. 208 పనులకు రూ.45.88 కోట్లతో జలవనరుల శాఖ పంపిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ మరమ్మతుల కారణాన్ని చెబుతూ కృష్ణా జిల్లాలో దాళ్వా వరి సాగుకు నీటి విడుదలను ప్రభుత్వం నిలిపివేసింది. కానీ, పనులను మాత్రం ప్రారంభించలేదు. నిధులలేమి వల్ల ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ పనుల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది.

నిధులు లేక ఔట్ ఫాల్ రెగ్యులేటర్ల ఆధునీకరణలో జాప్యం

సముద్రంలోని నీరు డ్రెయిన్లలోకి రాకుండా, పంట పొలాల్లోని మురుగు నీరు డ్రెయిన్ల ద్వారా సముద్రంలోకి వెళ్లేలా మూడు దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వం డ్రెయిన్లు సముద్రంలో కలిసే ప్రాంతాల్లో అవుట్ ఫాల్ రెగ్యులేటర్లను ఏర్పాటు చేసింది. తీర ప్రాంత భూములు ముంపునకు గురికాకుండా ఈ రెగ్యులేటర్లు రక్షణగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఇవి కనీస మరమ్మతులకు నోచుకోకవడంతో రెగ్యులేటర్ల షటర్లు ధ్వంసమయ్యాయి. దీంతో, తరచూ ముంపు సమస్య ఎదురవుతోంది. కోడూరు, నాగాయలంక, కృత్తివెన్ను మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలు ఏటా ముంపునకు గురవుతున్నాయి. నష్టాలను భరించలేక కోడూరు మండలంలోని మూడు వేల ఎకరాల్లో రైతులు పంటల సాగు మానుకున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణా జిల్లాలో ఎనిమిది అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల ఆధునీకరణకు మూడు నెలల క్రితం రూ.35 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపినా ఫలితం లేకపోయింది.

నీటి తీరువా వసూలైతేనే ఒ అండ్ ఎం పనులు!

విజయవాడ కెసి, కెఇ, సెంట్రల్, గుడివాడ డ్రెయినేజీ డివిజన్ల పరిధిలోని 208 కాలువలతోపాటు డ్రెయిన్ల ఒ అండ్ ఎం పనులకు రూ.45.88 కోట్లతో జలవనరుల శాఖ ప్రతిపాదించింది. కానీ, ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. వసూలైన నీటి తీరువా డబ్బులతోనే పనులు చేయాలని సూచించింది. నీటి తీరువా రూ.45.88 వసూలు కావాల్సి ఉండగా 32.66 కోట్లు వసూలయ్యాయి. పనుల అంచనా మేరకు మిగిలిన రూ.13.22 కోట్ల నిధులు విడుదలపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.


కృష్ణా జిల్లా చల్లపల్లి మండలంలో తూటుకాడతో పూడుకుపోయిన కాలువ

రెండు నెలల్లో ఎలా పూర్తి చేస్తారో?

ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణా తూర్పు డెల్టా పరిధిలో కృష్ణా, పశ్చిమగోదావరి ఉమ్మడి జిల్లాల్లో 7.37 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు, ఆక్వా సాగవుతున్నాయి. బందరు, కృష్ణా ఈస్టు బ్యాంక్ కెనాల్ (కెఇబి), ఏలూరు, రైవస్ కాల్వల ద్వారా ఖరీఫ్, రబీ పంటలకు సాగునీరు, ప్రజలకు తాగునీటి అవసరాల కోసం ఏటా 100.59 టిఎంసిలను అధికారులు విడుదల చేస్తున్నారు. ఈ కాలులతోపాటే అధిక వర్షాల సమయంలో పంటలు ముంపు బారిన పడకుండా అదనపు నీటిని వేగంగా సముద్రంలోకి తరలించేందుకు వేలాది కిలోమీటర్ల మేర మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లు డెల్టాల్లో ఉన్నాయి. కాల్వల నిర్వహణ సరిగా లేక పంటల సాగు సమయంలో నీటి ఎద్దడి ఎదురవుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ నిర్వహణ సరిగా లేక ముంపు కారణంగా రైతులు పంటలను నష్టపోతారు. ఈ నేపథ్యంలో కాల్వలు, డ్రెయిన్లలో పేరుకుపోయిన తూడు, కర్ర నాచు, మట్టిని తొలగించడం, బలహీన కట్టలను పటిష్టపరచడం తదితర ఒ అండ్ ఎం వర్కులు చేయాలి. కాల్వలు, డ్రెయిన్లలో నీరు ఉండని వేసవి కాలం ఈ పనులు చేయడానికి అనుకూలం. కానీ, ఇప్పటి వరకు కనీసం టెండర్లను కూడా పిలువలేదు. దీంతో, ఖరీఫ్ పంటలకు నీరు విడుదల చేసేలోగా పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

త్వరలో పనులు

కాల్వలు, డ్రెయిన్ల నిర్వహణలో భాగంగా 208 ఒ అండ్ ఎం పనులకు రూ.45.88 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం నుండి ఆమోదం లభించింది. త్వరలోనే టెండర్లు ఆహ్వానిస్తాం. సకాలంలో పనులు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటాం.

-కె.శ్రీనివాసరావు,
డిస్ట్రిక్ట్ వాటర్ రిసోర్సెస్ ఆఫీసర్, కృష్ణా జిల్లా

వార్డు సచివాలయాల్లో ప్రొబేషన్ డిక్లరేషన్‌కు ప్రతిపాదనలు

సిద్ధం చేయాలంటూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ సర్క్యులర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2020-21 సంవత్సరంలో రిక్రూట్ అయిన వార్డు సెక్రటేరియట్ ఫంక్షనరీస్‌కు సంబంధించిన సచివాలయ కార్యదర్శుల ప్రొబేషన్ డిక్లరేషన్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మినిస్టీరియల్ విభాగంలో వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, వార్డు విద్య, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు, పబ్లిక్ హెల్త్ విభాగంలో వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి గ్రేడ్-2, ఇంజనీరింగ్ విభాగంలో వార్డు సౌకర్యాల కార్యదర్శి (ఎమినిటీస్) గ్రేడ్-2, టౌన్ ప్లానింగ్ విభాగంలో వార్డు ప్రణాళిక అండ్ నియంత్రణ కార్యదర్శి గ్రేడ్-2, వెల్ఫేర్ విభాగంలో వార్డు సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన సెక్రటరీలకు సంబంధించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రాంతీయ డైరెక్టర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ ప్రాంతీయ డైరెక్టర్లు, అన్ని సంబంధిత నియామక అధికారులు తక్షణమే సిద్ధం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇంజనీర్-ఇన్-చీఫ్ (పిహెచ్) డైరెక్టర్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు, కంట్రిప్లానింగ్ ప్రాంతీయ డైరెక్టర్లు సంబంధిత కేటగిరీ పోస్టులకు ప్రతిపాదనలు పంపాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనరు ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియలో భాగంగా కదలిక వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లరేషన్ ప్రక్రియకు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఎటువంటి ఉత్తర్వులు విడుదల చేయకపోవడం పట్ల గ్రామ సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

పోలవరం పునరావాసానికి కష్టాలు!

- జాప్యమైతే మళ్లీ వర్షాల సమస్యలు
- కాంట్రాక్టర్లకు బకాయిలు రూ.156 కోట్లు!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఒకవైపు పోలవరం ప్రాజెక్టు నత్తనడకన సాగుతుండగా, మరోవైపు పునరావాసం కూడా సమస్యల్లో పడుతోంది. చేసిన పనులకు నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు మిగిలిన పనులను చేసేందుకు ముందుకు రావడం లేదు. దాదాపు రూ.156 కోట్ల వరకు కాంట్రాక్టర్లకు బకాయిలు ఉండిపోయినట్లు సమాచారం. పునరావాస కాలనీలు 41.15 కాంటూర్ పరిధిలోనే జరుగుతున్నాయి. అటు కేంద్రం, ఇటు రాష్ట్రం కాంటూర్ స్థాయిపై నిర్ణయం ప్రకటించకపోయినప్పటికీ కాంట్రాక్టర్లు మాత్రం 41.15 స్థాయిలోనే కాలనీల నిర్మాణం చేపడుతుండడం గమనార్హం. ఈ పనులు కొంతవరకు పూర్తయినప్పటికీ, తమకు రావాల్సిన నిధులు పెండింగ్‌లో ఉండడంతో మిగిలిన పనులపై వారు ఆసక్తి కనపరచడం లేదని తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే పలు దఫాలు కాంట్రాక్టర్ల నాయకులు ప్రభుత్వానికి, ఆర్థికశాఖకు లేఖలు రాసినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. తమకు మొత్తం రూ.156.56 కోట్లు బకాయిలు ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని వారు పదేపదే డిమాండ్ చేస్తున్నారు. సహాయ పునరావాసం పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల తరపున రాష్ట్ర బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తాజాగా మరోసారి ఆర్థిక శాఖకు లేఖ రాయడం విశేషం. ఇప్పటివరకు జరిగిన పనులను 2015-16, 2016-17 షెడ్యూల్ ఆఫ్ రేట్స్ (ఎస్ఒఆర్) మేరకే చేస్తున్నామని, ప్రస్తుతం 2022-23 ఎస్ఒఆర్ అమలులో ఉన్నప్పటికీ, తమకు ఆ రేట్లు వర్తించడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. దీనివల్ల నిర్మాణ వ్యయం కూడా పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం నిధులు విడుదల కాకపోతే పనుల్లో జాప్యం పెరుగుతుందని, వర్షాలు ప్రారంభమైతే పనులు నిలిచిపోయే పరిస్థితి కూడా ఉంటుందని వారు చెబుతున్నారు.

విద్య ప్రైవేటీకరణ సామాజిక న్యాయానికి విఘాతం

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం విద్యా రంగం బాధ్యత నుంచి తప్పుకొని ప్రైవేటీకరణ చేయడం వల్ల రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయానికి విఘాతం కలుగుతుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. విజయనగరం జిల్లా యుటిఎఫ్ ఆఫీసుబేరర్స్ సమావేశం జె. రమేష్ చంద్ర పట్నాయక్ అధ్యక్షతన స్థానిక ఎన్‌పిఆర్ భవన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చే నాటికి అక్షరాస్యత 12శానికి మించిలేదన్నారు. సామాజికంగా అణిచివేత కు గురయ్యే కులాలు అభివృద్ధి చెందడానికి ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాలలో సమాన అవకాశాలు ఇవ్వాలని రాజ్యాంగంలో నిర్దేశించారని తెలిపారు. ఆర్థిక సంస్కరణలు ప్రభావం వల్ల ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొని ప్రవేటీకరణకు పూనుకొంటుందని విమర్శించారు. ఎన్ఇపిలో భాగంగా విద్య వ్యాపారమయం అవుతుందన్నారు. ఇన్ఇపి అమలుతో సామాజిక న్యాయం ఉండదని ఆవేదన వ్యక్తంచేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్ రావు మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణల పేరుతో 3,4,5 తరగతులను హైస్కూల్లో విలీనం చేయడం వలన బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరం అవుతారని అన్నారు. కాబట్టి ఈ సంస్కరణలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఎ.సత్యశ్రీనివాస్, సహాధ్యక్షులు వి ప్రసన్నకుమార్, కోశాధికారి సిహెచ్ భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, పి.త్రినాధ, కేశవరావు, ఆర్‌ఎవి సూర్యారావు, పి.వాసు, సిహెచ్ తిరుపతి నాయుడు, జి.రాజారావు, వి.రాధాభవాని, బి. రామినాయుడు, ఎన్.సత్యనారాయణ, ఎ.శంకరరావు పాల్గొన్నారు.

మళ్లీ పులి కలకలం

ముషిడిపల్లి సమీపంలో ఆవుదూడ మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట (విజయనగరం)

విజయనగరంలో మరోసారి పులి పంజా విసిరింది. శృంగవరపుకోట మండలం ముషిడిపల్లి గ్రామానికి చెందిన యల్లపు శ్రీరాములుకు చెందిన ఆవు దూడను చంపేసింది. శుక్రవారం తెల్లవారుజామున ముషిడిపల్లి-మధుపాడ మార్గంలోని గోస్తనీ నది తీరంలో శ్రీరాములు పశువుల పాకలో ఉన్న ఆవు దూడపై పులి దాడి చేసి, సమీపంలోని అరటి తోటలోకి తీసుకెళ్లి చంపేసింది. సంఘటనా స్థలాన్ని ఆటవీశాఖ డిఆర్ఒ రవికుమార్ పరిశీలించారు. పాదముద్రలను పరిశీలించి, పులిగా నిర్ధారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ ఇళ్ల వద్ద ఉండాలనీ రోడ్డుపైకి, పొలాల్లోకి రాకూడదని సూచించారు. పులి జాడ కనిపెట్టేందుకు రెండు ట్రాకింగ్ కెమెరాలను అమర్చినట్లు తెలిపారు.

ఇదేనా చట్టసభల పనితీరు ?

- ఇప్పటివరకూ లోక్‌సభ పని చేసింది 230 రోజులే
- చర్చ లేకుండానే కీలక బిల్లులు ఆమోదం
- సభ్యుల చొరవ అంతంత మాత్రమే
- ఉప సభాపతి ఎన్నిక కూడా జరగలేదు



న్యూఢిల్లీ : ప్రస్తుత లోక్‌సభ సమావేశాలు చివరి దశకు చేరుకున్నాయి. అయితే 17వ లోక్‌సభ ఇప్పటి వరకూ కేవలం 230 రోజులు మాత్రమే సమావేశమైంది. ఇప్పటి వరకూ పూర్తికాలం పనిచేసిన లోక్‌సభల్లో 16వ లోక్‌సభ అతి తక్కువగా 331 రోజులు సమావేశమైంది. ప్రస్తుత లోక్‌సభ కాలపరిమితి ముగియడానికి కేవలం సంవత్సరం మాత్రమే సమయం ఉన్న నేపథ్యంలో అంతకంటే ఎక్కువ రోజుల పాటు సమావేశాలు జరిగే అవకాశాలు కన్పించడం లేదు. ఎందుకంటే ప్రస్తుత లోక్‌సభ సగటున సంవత్సరంలో 58 రోజులు మాత్రమే కార్యకలాపాలు సాగించింది. దీనినిబట్టి 1952 తర్వాత ఇంత తక్కువ రోజులు సమావేశమయ్యే లోక్‌సభ ఇదే అవుతుంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభ నిర్ణీత కాలంలో కేవలం 33 శాతం (46 గంటలు), రాజ్యసభ 24 శాతం (32 గంటలు) మాత్రమే సమావేశమయ్యాయి. పక్షం రోజుల పాటు జరిగిన రెండో అర్థభాగంలో నిర్ణీత కాలంలో లోక్‌సభ ఐదు శాతం, రాజ్యసభ ఆరు శాతం మాత్రమే సమావేశమయ్యాయి. ఇందులోనూ సభల ముందు పత్రాలు ఉంచడంతోనే ఎక్కువ సమయం గడచిపోయింది.

బడ్జెట్ సమావేశాలలో ద్రవ్య వినిమయ బిల్లులు కాకుండా ఒకే ఒక్క బిల్లు...కాంపిటీషన్ (సవరణ బిల్లు)-2022 మాత్రమే ఆమోదం పొందింది. ఇది కూడా ఆర్థిక బిల్లు మాదిరిగానే ఎలాంటి చర్చ లేకుండానే సభ ఆమోదం పొందింది. బడ్జెట్ సమావేశాలలో మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. వీటిలో అటవీ (సంరక్షణ) సవరణ బిల్లు-2023ను సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపారు. 17వ లోక్‌సభలో ఇప్పటివరకూ 150 బిల్లులను ప్రవేశపెట్టగా వాటిలో 131 బిల్లులు (ద్రవ్య వినిమయ బిల్లులు మినహా) ఆమోదం పొందాయి. మొదటి సమావేశాలలో 38 బిల్లులు ప్రవేశపెట్టగా 28 బిల్లులను ఆమోదించారు. అప్పటినుంచీ ప్రవేశపెట్టిన, ఆమోదం పొందిన బిల్లుల సంఖ్య తగ్గిపోయింది. గత నాలుగు సమావేశాలలోనూ ఒక్కో దానిలో పది కంటే తక్కువగా బిల్లులను ప్రవేశపెట్టడమో లేదా ఆమోదించడమో జరిగింది.

1952 తర్వాత బడ్జెట్ సమావేశాలు తక్కువ సమయంలో ముగియడం ఇది ఆరోసారి. ప్రస్తుత లోక్‌సభ ఆర్థిక వ్యవహారాలపై 18 గంటలు చర్చించింది. ఇందులో 16 గంటల పాటు సాధారణ బడ్జెట్ పైనే చర్చ సాగింది. ప్రస్తుత లోక్‌సభ బడ్జెట్ సమావేశాలలో సగటున 55 గంటల పాటు ఆర్థిక వ్యవహారాలపై సభ్యులు చర్చించారు. అయిదు మంత్రిత్వ శాఖలకు చెందిన రూ.11 లక్షల కోట్ల ఖర్చుకు సంబంధించిన పద్దులు లోక్‌సభ ముందుకు వచ్చినప్పటికీ ఏ ఒక్క దానిపైనా చర్చ జరగలేదు. అన్ని మంత్రిత్వ శాఖలకు సంబంధించిన ప్రతిపాదిత రూ. 42 లక్షల కోట్ల వ్యయం పైన ఎలాంటి చర్చ జరగకుండానే ఆమోదం లభించింది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే గడచిన ఏడు సంవత్సరాల కాలంలో సగటున 79 శాతం బడ్జెట్‌ను చర్చ జరపకుండానే ఆమోదించారు.

రాజ్యసభలో కొన్ని ఎంపిక చేసిన మంత్రిత్వ శాఖల పనితీరుపై చర్చించారు. బడ్జెట్ సమావేశాలలో రైల్వేలు, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, సహకారం, సాంస్కృతిక శాఖలు సహా ఏడు మంత్రిత్వ శాఖలపై ఎలాంటి చర్చ జరగలేదు.

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తెలిపే తీర్మానంపై మాత్రమే ఉభయసభల్లో చర్చించారు. దీనిపై రెండు సభలలోనూ 28 గంటల పాటు చర్చ సాగింది. 150 మంది సభ్యులు చర్చలో పాలుపంచుకున్నారు. సభా నిబంధనల ప్రకారం సభ్యులు ప్రజా ప్రాధాన్యత ఉన్న అంశాలపైన చర్చించవచ్చు. ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. అరగంట చర్చలు, స్వల్పకాలిక చర్చలు, వాయిదా తీర్మానాల ద్వారా సభ్యులు తమ హక్కులను ఉపయోగించుకోవచ్చు. అయితే 17వ లోక్‌సభ సమావేశాలలో ఇప్పటివరకూ 11 స్వల్పకాలిక చర్చలు, అరగంట వ్యవధి ఉండే చర్చ ఒకటి మాత్రమే జరిగాయి. బడ్జెట్ సమావేశాలలో అలాంటి చర్చ ఒక్కటీ జరగలేదు. రాజ్యసభలో 267వ నిబంధన కింద ప్రాధాన్యత కలిగిన అంశంపై చర్చించేందుకు ఛైర్‌పర్సన్ అనుమతితో ఇతర కార్యకలాపాలను సస్పెండ్ చేయవచ్చు. ప్రస్తుత సమావేశాలలో ఈ నిబంధన కింద సభ్యులు 150 నోటీసులకు పైగా ఇచ్చినప్పటికీ అవన్నీ తిరస్కరణకు గురయ్యాయి.

ప్రస్తుత లోక్‌సభ సమావేశాలలో ప్రశ్నోత్తరాల సమయానికి కేటాయించిన సమయం చాలా తక్కువ. నిర్ణీత సమయంలో లోక్‌సభలో 19 శాతం, రాజ్యసభలో 9 శాతం మాత్రమే ప్రశ్నోత్తరాలు సాగాయి. రెండు సభలలోనూ కేవలం ఏడు శాతం చొప్పున ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు లభించాయి. ఈ సమావేశాలలో ప్రయివేటు సభ్యుల బిల్లులేవీ సభ ముందుకు రాలేదు. రెండు సభల్లోనూ ఒక్కో ప్రయివేటు సభ్యుని తీర్మానాలపై మాత్రం చర్చించాయి. లోక్‌సభలో రైల్వేల సుందరీకరణ, ఆధునీకరణపై చర్చ జరగగా రాజ్యసభలో సచార్ కమిటీ నివేదికపై చర్చించారు.

17వ లోక్‌సభ సమావేశలు చివరి దశకు చేరుకున్నప్పటికీ సభకు ఇప్పటి వరకూ ఉప సభాపతి లేకపోవడం గమనార్హం. ఉప సభాపతి పదవికి ఎన్నిక నిర్వహించడంలో జరుగుతున్న జాప్యంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన సుప్రీంకోర్టు, ఫిబ్రవరిలో కేంద్రానికి నోటీసు జారీ చేసింది. అయినప్పటికీ ఎన్నిక జరగలేదు. గతంలో ఇలాంటి సందర్భం ఒక్కటి మాత్రమే వచ్చింది. 12వ లోక్‌సభ కాలంలో సభ 269 రోజులు జరగగా ఉప సభాపతిని ఎన్నికోవడానికి మూడు నెలల సమయం తీసుకున్నారు.

పార్లమెంట్ జరిగిన తీరు సునితంగా గమనిస్తే..ప్రతిపక్షాలు వల్లే సభను నడిపించలేకపోతున్నామనే సీన్ క్రియేటే చేసి..మరోవైపు ప్రభుత్వానికి అవసరమైన బిల్లుల్ని మూజువాణి ఆమోదించుకోవటం గమనార్హం.




మీకోసం

వంటకాలు నూనె తక్కువగా పీల్చుకోవాలంటే కూర వండే నూనెలో అరచెంచా వెనిగర్ కలుపుకోవాలి.

జీవన సౌరభం

దృఢ సంకల్పం, తరగని ఆత్మవిశ్వాసం, బలమైన కోరిక ఉన్నచోట విజయం తప్పక వచ్చి తీరుతుంది.



కథను చెప్పు



గడ్డ పెరుగు మీగడంటి
కమ్మనైన కథను చెప్పు
బిడ్డ బోసి నవ్వు వంటి
అందమైన కథను చెప్పు

కథను చెప్పు తాతయ్యా!
కమ్మగ నిదురోయేందుకు

గడ్డాన్నే సవరించే
గడుగ్గాయి మాంత్రికుడూ
వడ్డాణం సింగారపు
రాలుగాయి రాకుమారి

ఎచట దాగి ఉన్నారో
చెప్పు చెప్పు తాతయ్యా!
రాకుమారుడొచ్చాడా?
చెప్పవేమి తాతయ్యా?

గడ్డివామిలో దాగిన
బుడ్డి బుడ్డి దెయ్యాలూ
చెడ్డీలను వేసుకునే
చిన్నారుల నెయ్యాలూ


అడ్డు పెట్టి ఆపకుండ
చెప్పు చెప్పు తాతయ్యా?
విడ్డూరాలన్నిటినీ
విప్పి చెప్పు తాతయ్యా!

ఎడ్డెమంటె తెడ్డెమనే
అత్తగారి సరదాలూ,
బిడ్డేదని వెతుక్కునే
గుడ్డి కుక్క సాహసాలు

అడ్డొచ్చిన నిద్రనాపి
చెప్పరాద? తాతయ్యా!
చెడ్డోళ్ళకి శాస్తి జరుగు
కథను చెప్పు తాతయ్యా!

- గుడిపూడి రాధికారాణి
94949 42583

దారి చూపండి



చిన్నారులూ, బయట ఉన్న చీమకు బాగా ఆకలిగా ఉందట. మరి చాక్లెట్ దగ్గరకు వెళ్లే దారి చూపి సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ





కామా ఉమేష్ కృష్ణ,
7వ తరగతి,
నిర్మలా హైస్కూలు,
విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

తాటాకులతో ఆభరణాలు

తాటిచెట్టు మనందరికీ తెలుసు. దాని ఆకులను పందిళ్లు వేయటానికి, ఇంటి పైకప్పు నేయటానికి గతంలో ఎక్కువగా ఉపయోగించేవారు. ఇప్పుడు ఆవినియోగం బాగా తగ్గింది. మరి ఆ ఆకులతో ఆభరణాలు తయారు చేస్తే ... ? ఈ ఆలోచన ఆ దంపతులను ప్రత్యేకంగా నిలిపింది.


తాటాకులతో చేసిన పెళ్లి ఆభరణాలు

చెన్నైకు 200 కి.మీ. దూరంలో ఉన్న వేదాంతవాడి గ్రామానికి చెందిన కార్తికేయన్ డిజైన్ ఇంజనీర్. కోయంబత్తూర్‌లో ఓ కంపెనీలో ఉద్యోగం. భార్య నీలవేణి మ్యాథ్స్ లెక్చరర్. ఇద్దరివీ మంచి జీతాలు. పెళ్లి అయిన దగ్గర నుంచీ ఉరుకులు, పరుగుల జీవితాలు అయ్యాయి. కలిసి ప్రశాంతంగా గడిపిన క్షణాలు తక్కువ. దాంతో ఉద్యోగాలు విడిచి ఏడేళ్లుగా ఊరిలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. సొంత భూమి మూడు ఎకరాల్లో అరుదైన వరి పంటను, ఎర్ర జొన్నలను సాగు చేశారు. రసాయన మందులు వాడకుండా పండించారు. నాణ్యమైన బియ్యం పండించిన రైతుగా పేరు తెచ్చుకున్నారు.

ఓసారి స్నేహితుడు ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లిన ఈ దంపతులకు అక్కడ ఎండిన తాటి ఆకు ముక్కలతో బొమ్మలు కనిపించాయి. ఇంట్లో అలంకరణ కోసం ఉంచిన అవి ఆ గదికే అందాన్ని తెచ్చాయి. ఇంటికి వచ్చాక ఆ తాటి ఆకుల కళల మీద సమాచారం సేకరించారు. పూర్వం వాటితో ఆభరణాలు, బొమ్మలు తయారు చేసేవారని తెలుసుకున్నారు. తామూ ఆ కళను నేర్చుకోవాలని అనుకున్నారు. కానీ, నేర్పించేవారే లేరు. కనుమరుగైన తాటి ఆకుల ఆభరణాల కళను ఎలాగైనా తయారుచేయాలని నిర్ణయించుకున్నారు. భార్య ప్రోత్సాహంతో కార్తికేయన్ ఆన్‌లైన్ ద్వారా కొన్ని విషయాలను తెలుసుకుని నగలు చేయడం ప్రయత్నించాడు. తాటాకులు తెచ్చి ఎండబెట్టి చిన్న చిన్న వస్తువులు, అభరణాలు చేయడం మొదలు పెట్టారు. పొలంలో పనులు చేస్తూనే సమయం ఉన్నప్పుడల్లా నీలవేణి, కార్తికేయన్లు ప్రయత్నాలు సాగించారు. వీరిని చూసి ఊరి జనం 'తాటి ఆకులతో అభరణాలు ఏంటి? పిచ్చికాకపోతే. ఈ కాలంలో ఎవరు వేసుకుంటారు' అంటూ నవ్వారు. అయినా పట్టు విడవకుండా కార్తికేయన్ సాంకేతిక నేపథ్యంతో నగలు చేశాడు. దాంతో పాటు తాటి, కొబ్బరి ఆకులతో దేవుళ్ల కళారూపాలూ స్వయంగా వేయడం నేర్చుకున్నాడు. వీరి చేసిన నగలు అందంగా, ఆకర్షణీయంగా ఉండటంతో అమ్మాయిలు కొనుగోలు చేయసాగారు. కొన్నాళ్లకు జనం ఈ నగల పట్ల ఆసక్తి కనబరచడంతో ఈ తాటి ఆకుల ఆభరణాలకు డిమాండ్ పెరిగింది. వీరి ప్రతిభ గుర్తించిన జనం తమకు నచ్చినట్లు డిజైన్లలో, పెళ్లి బట్టలకు మ్యాచింగ్ అయ్యేలా నగలు చేయించుకుంటున్నారు.

పెళ్లి ఆభరణాలు

ఇప్పుడు తాటి ఆకుతో కళ్లు చెదిరే 12 రకాల ఆభరణాలు చేస్తున్నారు ఈ దంపతులు. చెవిపోగులు, హెయిర్ క్లిప్‌లు, హెయిర్ బ్యాండ్‌లు, గాజులు, పెండెంట్‌లు చేస్తున్నారు. వీటన్నిటిలోకి పెళ్లి సెట్ వీరి ప్రత్యేకత. నేతి చుట్టి అని పిలువబడే నుదిటి ఆభరణం, ఒడ్డియానం అని పిలువబడే హిప్ బ్యాండ్లు ఎంతో అందంగా చేస్తున్నారు. 'బంగారంతో పోలిస్తే ఇవి చౌకగా ఉంటాయి. పర్యావరణ అనుకూలమైనవి. విడివిడి వస్తువులు రూ. 30 నుండి రూ. 150 వరకు ధర పలుకుతాయి. పెళ్లి సెట్ రూ. 2,500 నుంచి రూ. 3,000 మధ్య ఉంటుంది. ఆకులకు రంగు వేయం. కానీ వాటి సహజ లేత ఆకుపచ్చ రంగును ప్రతిబింబించేలా, మెరిసే రంగు రాళ్లు, ఎండిన పూల రెక్కలు వాటికి అతికిస్తాం. డిజైన్, తయారీలో బంగార వస్తువులకు ఏ విధంగానూ తక్కువ కాదు.' అంటారు కార్తికేయన్, నీలవేణి దంపతులు.

రైలు ప్రమాదం తప్పించి ...



మార్చి 21. సమయం మధ్యాహ్నం 2:10 నిమిషాలు.

మత్స్యగంధ ఎక్స్‌ప్రెస్ రైలు మంగుళూరు నుంచి ముంబైకి బయలుదేరింది. బయల్దేరిన 10 నిమిషాలకు అల్లంత దూరంలో 70 ఏళ్ల వృద్ధురాలు ఎర్రగుడ్డ ఊపుతూ, పరిగెడుతూ రైలుకు ఎదురొచ్చింది. అది చూసిన రైలు డ్రైవర్లు వెంటనే బ్రేకులు వేసి, స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆమె దగ్గరకు వెళ్లి ఏం జరిగిదంటూ ఆరా తీశారు. అరకిలో మీటరు దూరంలో పట్టాలపై ఓ పెద్ద చెట్టు పడి ఉంది. ఇంత పెద్ద ప్రమాదం నుంచి వందల మంది ప్రాణాలను కాపాడిన ఆ వృద్ధురాలు పేరు చంద్రావతి.

పాడిల్, జోకట్టె రైల్వే ట్రాక్ మధ్యలో చంద్రావతి ఇల్లు. ముంబైలో ఉన్న ఆమె బంధువులు ఎక్కువగా రైలు ప్రయాణం చేసి తన దగ్గరకు వస్తూ, పోతూ ఉంటారు. దాంతో ఏ ట్రైన్ ఏ సమయంలో వెళుతుందో కొంత అవగాహన ఉంది. ఈ మధ్య కాలంలో చంద్రావతికి గుండె ఆపరేషన్ జరిగింది. దాంతో పనికి వెళ్లకుండా విశ్రాంతి తీసుకుంటూ ఇంట్లోనేఉంటోంది. రోజూలాగే ఆ రోజు కూడా అన్నం తిని నిద్రపోయింది. ఇంతలో పెద్ద చెట్టు విరిగిపడిన శబ్దం వినిపించింది. లేచి చూడగా... రైలు పట్టాలపై కనిపించింది. మత్స్యగంధ ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్లే సమయం అని గుర్తొచ్చింది. ఇంట్లో ఉన్న మగవాళ్లకు చెబుదామా అంటే కొడుకు ఉద్యోగానికి, మనవడు కాలేజీకి వెళ్లారు. కొన్ని నిమిషాలు ఆమెకు కాలు, చెయ్యి ఆడలేదు. ధైర్యం తెచ్చుకుని వెంటనే ఇంటి ముందు ఆరబెట్టిన మనవరాలి ఎర్రచున్నీ తీసుకుని రైలు పట్టాల గుండా 150 మీటర్లు ఎర్రటి ఎండలో చెప్పులు లేకుండా పరిగెత్తింది. ఎలాగైనా ప్రమాదం తప్పించాలన్న ఆశతో దూరాన నుంచి వేగంగా వస్తున్న రైలుకు ఎదురెళ్లింది. ఆమెను చూసిన సిబ్బంది ట్రైన్‌ను ఆపారు. పది అడుగుల దూరంలో పట్టాలపై అడ్డంగా పడి ఉన్న చెట్టును చూసి పెద్ద ప్రమాదం తప్పిందంటూ సంతోషపడ్డారు. వెంటనే పై అధికారులకు చెప్పి చెట్టు తొలగించే ప్రయత్నం చేశారు.

చంద్రావతి ఇంటికి ద్విచక్ర వాహనం వెళ్లే దారి కూడా లేదు. ఆమె భర్త ఉద్యోగ బాధ్యతలు ముగించుకుని ఇంటికి వచ్చే క్రమంలో వాహనాన్ని రైలు పట్టాలకు మరో వైపు తెలిసిన వాళ్ల ఇంటి దగ్గర ఉంచేవాడు. ట్రాక్ దాటి ఇంటికి వచ్చేవాడు. ఓ రోజు ఆమె భర్త ట్రాక్ దాటుతుండగా రైలు ప్రమాదం జరిగి మరణించాడు. ఇది జరిగి చాలా ఏళ్లు అయ్యింది. ఇటువంటి సంఘటన ఎవరికీ జరగకూడదనే... సాహసం చేసి ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడింది. వృద్ధురాలైన చంద్రావతి ... ఎంతో ధైర్యంతో, సమయస్ఫూర్తితో జనం ప్రాణాలను కాపాడిన తీరుకు రైల్వే సిబ్బంది కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.



ఇది పుష్ప గాడి రూలు


ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పుష్ప-2'. వరల్డ్ వైడ్‌గా క్రేజ్‌ను సంపాదించుకున్న ఈ చిత్రం సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంకి సంబంధించిన లేటెస్ట్ వీడియోను మేకర్స్ వేర్ ఈజ్ పుష్ప పేరిట రిలీజ్ చేశారు. ఈ వీడియోలో పుష్ప ను చంపేసినట్లు, చనిపోయినట్లు ముందుగా చూపించినా... తర్వాత అడవిలో రీ ఎంట్రీ అల్లు అర్జున్‌ను హైలైట్ చేస్తూ చూపించారు. స్మగ్లింగ్ చేసి సంపాదించిన డబ్బును పేదల కోసం ఉపయోగించాడు అనేది చూపించేలా కథను మలిచినట్లు కనిపించింది. ఇది పుష్ప గాడి రూలు అంటూ బన్నీ చెప్పిన డైలాగ్ వీడియో జోడిస్తూ.. అర్జున్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు మేకర్స్. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా మూవీ లో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తుంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

8న 'విడుదల' ట్రైలర్

దర్శకుడు వెట్రిమారన్ తమిళంలో తీసిన కొత్త చిత్రం 'విడుదలై పార్ట్ 1'. యాక్టర్ సూరి హీరోగా, విజయ్ సేతుపతి స్పెషల్ రోల్ లో కనిపించిన ఈ సినిమా మార్చి 31న విడుదలై కోట్లు రాబట్టింది. దాంతో ఈ చిత్రాన్ని గీత ఆర్ట్స్ తెలుగులోకి డబ్ చేసి రిలీజ్ చేస్తోంది. తెలుగులో 'విడుదల' అనే టైటిల్ ని ఫిక్స్ చేసి ఏప్రిల్ 15న విడుదల చెయ్యనున్నారు. ఏప్రిల్ 8న ట్రైలర్‌ని రిలీజ్ చేస్తున్నట్లు గీత ఆర్ట్స్ అనౌన్స్ చేసింది. రియలిస్టిక్ పోలీస్ డ్రామా నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో విజయ్ సేతుపతి నటన అద్భుతంగా ఉందంటూ ప్రసంశలు వచ్చాయి. దాంతో వెట్రిమారన్ ది బెస్ట్ వర్క్ టిల్ డేట్ అని కాంప్లిమెంట్స్‌ని అందుకుంది.



బలగం వేణుకి అంతర్జాతీయ అవార్డు



తెలంగాణ సంస్కృతి, కుటుంబ అనుబంధాల కథాంశంతో రూపొందిన 'బలగం' చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. కేవలం మౌత్ టాక్‌తోనే బలగం మంచి వసూళ్లు సాధించింది. దాంతో దర్శకుడు వేణుకు, సినిమాకు వరుస అవార్డులు వస్తున్నాయి. తాజాగా మరో అంతర్జాతీయ అవార్డు వచ్చింది. ఉత్తమ దర్శకుడిగా వేణు ఆమ్ స్టర్ డామ్ ఇంటర్నేషనల్ అవార్డు వచ్చింది. కాగా ఇప్పటికే బలగం లాస్ ఏంజెలెస్ సినిమాటోగ్రఫీ నుంచి బెస్ట్ ఫీచర్ ఫిల్మ్, బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ సినిమాటోగ్రఫీ విభాగాల్లో అవార్డులను సొంతం చేసుకుంది. ఉక్రెయిన్‌కు చెందిన ఒనికో ఫిల్మ్ అవార్డ్స్ నుంచి బెస్ట్ డ్రామా ఫీచర్ ఫిల్మ్ అవార్డును గెలుచుకుం ది. డీసీ ఇంటర్నేషనల్ సినిమా ఫెస్టివల్‌లో నాలుగు అవార్డులు అందుకున్న ఈ మూవీకి మరో ఇంటర్నేషనల్ అవార్డు దక్కడం విశేషం.




'ఏజెంట్' అఖిల్

అక్కినేని అఖిల్, సురేందర్ రెడ్డితో కలిసి చేస్తున్న సినిమా 'ఏజెంట్'. మమ్ముట్టి స్పెషల్ రోల్ ప్లే చేస్తున్న ఈ చిత్రం నుంచి అఖిల్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్ బయటకి వచ్చింది. అఖిల్ పుట్టిన రోజు ఏప్రిల్ 8, అయినా ఒక రోజు ముందే మేకర్స్ ఈ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పోస్టర్ ట్రెండ్ అవుతోంది. 'ఏప్రిల్ 8న మరిన్ని అప్డేట్స్ వస్తాయి వెయిట్ చెయ్యండి' అంటూ మేకర్స్ చిన్న హింట్ కూడా ఇచ్చారు. ఈ మూవీని ఏప్రిల్ 28న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ఇదివరకే ప్రకటించారు.

కాస్ట్యూమ్స్ టు డైరెక్షన్

దక్షిణాదిలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా పేరు సంపాదించుకున్న నీరజ కోన ఇప్పుడు దర్శకురాలిగా మారబోతున్నారు. కోన వెంకట్ సిస్టర్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆమె మొదటిసారిగా బాద్ షా సినిమాకి అసిస్టెంట్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేశారు. ఆ తరువాత ఇండిపెండెంట్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా మారి చాలా సినిమాలకి పనిచేశారు. తాజా ఆమె సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్ డేట్స్‌ని ఆమె తీసుకున్నట్లు తెలిసింది. ఈ సినిమాకు మిథున్ చైతన్య కథ అందిస్తున్నారు. ఇదిలా ఉంటే నితిన్ ఈ ప్రాజెక్ట్‌ని ఉద్దేశిస్తూ ఓ ట్వీట్ చేశారు. 'ఎంత అద్భుతమైన కథతో నువ్వు దర్శకురాలిగా పరిచయం అవుతున్నావ్. పీసీ శ్రీరామ్ గారితో కలిసి నువ్వు మంచి హిట్ కొట్టాలని ఆశిస్తున్నా' అంటూ ట్వీట్ చేశారు. దీనిపై నీరజ కోన కూడా థాంక్స్ చెప్పారు. ఇక ఈ సినిమా క్యాస్టింగ్ వివరాలు త్వరలో వెల్లడికానున్నాయని తెలుస్తోంది.





'ఉగ్రం' ఫ్యామిలీ పాట

షైన్ స్క్రీన్ బ్యానర్‌పై విజయ్ కనకమేడల, నరేష్ కాంబోలో వస్తోన్న తాజా చిత్రం 'ఉగ్రం'. ఇందులో నరేష్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ విజయ్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రం నుంచి తాజాగా 'అల్బెలా' సాంగ్‌ని రిలీజ్ చెయ్యబోతున్నారు. సెకండ్ సాంగ్‌గా బయటకి వస్తున్న ఈ సాంగ్ ఏప్రిల్ 9న 11:07 నిమిషాలకి రిలీజ్ కానుంది. ఈ విషయాన్ని ప్రకటిస్తూ మేకర్స్ ఓ పోస్టర్ విడుదల చేశారు. మిర్నా హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమా మే 5న విడుదల కానుంది.

మళ్లీ సన్‌రైజర్స్‌కు నిరాశ

లక్నో సూపర్‌జెయింట్స్ చేతిలో ఐదు వికెట్ల తేడాతో ఓటమి


కృనాల్ పాండ్యా ఆల్‌రౌండ్ ప్రతిభ

లక్నో: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-16లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 121పరుగులే చేయగా.. ఛేదనలో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు 16ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 127పరుగులు చేసి ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన కెప్టెన్ మార్‌క్రమ్ తొలిగా బ్యాటింగ్‌కు మొగ్గు చూపాడు. ఓపెనర్ మయాంక్ అగర్వాల్(8) మరోసారి నిరాశపరచగా.. మరో ఓపెనర్ అన్మోల్‌ప్రీత్ సింగ్(31), రాహుల్ త్రిపాఠి(35)కలిసి 2వ వికెట్‌కు 29పరుగుల జతచేశారు. ఆ తర్వాత సన్‌రైజర్స్ జట్టు వరుసగా మరో మూడు వికెట్లు కోల్పోయింది. దీంతో 55పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అత్యధిక బిడ్ రూ.15కోట్లకు వేలంగా దక్కించుకున్న హారీ బ్రూక్ కేవలం 3పరుగులే చేసి వెనుదిరిగాడు. కెప్టెన్ మార్‌క్రమ్ కూడా డకౌట్ కావడంతో సన్‌రైజర్స్ భారీ స్కోర్‌పై ఆశలు వదులుకుంది. చివర్లో సుందర్(16), అబ్దుల్ సమద్(21) బ్యాట్ ఝుళిపించారు. కృనాల్ పాండ్యాకు మూడు, అమిత్ మిశ్రాకు రెండు, యశ్ ఠాకూర్, రవి బిష్ణోకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో రాజస్తాన్‌కు ఓపెనర్ మయర్స్(13) నిరాశపరిచినా.. కెప్టెన్ కేఎల్ రాహుల్(35), కృణాల్ పాండ్యా(34) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఆదిల్ రషీద్ ఒకే ఓవర్లో కేఎల్ రాహుల్, షెఫర్డ్‌ను ఔట్ చేసినా.. పూరన్(11), స్టొయినీస్(10) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు.రషీద్‌కు రెండు, భువనేశ్వర్, ఫారుఖీ, ఉమ్రన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కృనాల్ పాండ్యాకు లభించింది. దీంతో లక్నో జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోగా.. సన్‌రైజర్స్ 10వ స్థానంలోనుంది.

స్కోర్‌బోర్డు..

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అన్మోల్‌ప్రీత్ సింగ్ (ఎల్‌బి)కృనాల్ 31, మయాంక్ (సి)స్టొయినీస్ (బి)కృనాల్ 8, త్రిపాఠి (సి)అమిత్ మిశ్రా (బి)యశ్ ఠాకూర్ 35, మార్‌క్రమ్ (బి)కృనాల్ పాండ్యా 0, హారీ బ్రూక్ (స్టంప్)పూరన్ (బి)బిష్ణోయ్ 3, వాషింగ్టన్ సుందర్ (సి)దీపక్ హుడా (బి)అమిత్ మిశ్రా 16, అబ్దుల్ సమద్ (నాటౌట్) 21, ఆదిల్ రషీద్ (సి)దీపక్ హుడా (బి)అమిత్ మిశ్రా 4, ఉమ్రన్ మాలిక్ (రనౌట్) దీపక్ హుడా/ఉనాద్కట్ 0, భువనేశ్వర్ (నాటౌట్) 0, అదనం 3, (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 121పరుగులు. **వికెట్ల పతనం:** 1/21, 2/50, 3/50, 4/55, 5/94, 6/104, 7/108, 8/109 **బౌలింగ్:** మయర్స్ 1-0-5-0, ఉనాద్కట్ 3-0-26-0, కృనాల్ పాండ్యా 4-0-18-3, యశ్ ఠాకూర్ 3-0-24-1, రవి బిష్ణోయ్ 4-0-16-1, అమిత్ మిశ్రా 4-0-23-2.

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: మయర్స్ (సి)మయాంక్ (బి)ఫారూఖీ 13, కేఎల్ రాహుల్ (ఎల్‌బి)ఆదిల్ రషీద్ 35, దీపక్ హుడా (సి అండ్ బి)భువనేశ్వర్ 7, కృనాల్ పాండ్యా (సి)అన్మోల్‌ప్రీత్ (బి)ఉమ్రన్ 34, స్టొయినీస్ (నాటౌట్) 10, షెఫర్డ్ (ఎల్‌బి)ఆదిల్ రషీద్ 0, నికోలస్ పూరన్ (నాటౌట్) 11, అదనం 17. (16 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 127పరుగులు. **వికెట్ల పతనం:** 1/35, 2/45, 3/100, 4/114, 5/114 **బౌలింగ్:** భువనేశ్వర్ 2-0-19-1, సుందర్ 1-0-11-0, ఫారూఖీ 3-0-13-1, మార్‌క్రమ్ 2-0-14-0, రషీద్ 3-0-23-2, నటరాజన్ 3-0-23-0, ఉమ్రన్ 2-0-22-1.

సెమీస్‌కు ప్రియాంశు

క్వార్టర్స్‌ఫైనల్లో ఛి-యు-జెన్‌పై గెలుపు



ఓర్లీన్(ఫ్రాన్స్): ఓర్లీన్ ఓపెన్ మాస్టర్స్ సూపర్-300 టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో భారత యువ షట్లర్ ప్రియాంశు రాజవత్ ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రియాంశు 21-18, 21-18పాయింట్ల తేడాతో ఛి-యు-జెన్(చైనీస్ తైపీ)పై వరుస సెట్లలో గెలిచాడు. ఈ మ్యాచ్ సుమారు 44నిమిషాలసేపు సాగింది. రెండుగేమ్‌లలోనూ ప్రత్యర్ధినుంచి ప్రియాంశుకు గట్టి పోటీ ఎదురైంది. ఈ టోర్నమెంట్‌లో సెమీస్‌కు చేరిన ఏకైక షట్లర్ ప్రియాంశు మాత్రమే. సెమీస్‌లో ప్రియాంశు 35వ సీడ్ నాట్ నుయేన్(వియత్నాం)తో తలపడ నున్నాడు. క్వార్టర్స్‌లో నుయేన్‌కు వాకోవర్ లభిం చింది. తొలిరౌండ్‌లో నుయాన్ భారత్‌కు చెందిన సమీర్‌వర్మపై మూడోసెట్ల హోరాహోరీ పోరులో నెగ్గిన విషయం తెలిసిందే. ఇక పురుషుల డబుల్స్‌లో 7వ సీడ్ ఎంఆర్ అర్జున్-ధృవ్ కపిల జోడీ.. 2వ సీడ్ లియో రోలే-డానియేల్ (ఇండోనేషియా)తో తలపడనున్నారు.

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	పా	నె.ర.
లక్నో	3	2	1	4	+1.35
గుజరాత్	2	2	0	4	+0.70
పంజాబ్	2	2	0	4	+0.31
కోల్‌కతా	2	1	1	2	+2.05
రాజస్తాన్	2	1	1	2	+1.67
చెన్నై	2	1	1	2	+0.03
బెంగళూరు	2	1	1	2	-1.25
ఢిల్లీ	2	0	2	0	-1.70
ముంబయి	1	0	1	0	-1.98
హైదరాబాద్	2	0	2	0	-2.86

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్



ఐపిఎల్‌లో నేడు..

రాజస్తాన్ × ఢిల్లీ
(వేదిక: గౌహతి, మ.3.30గంIIలకు)
ముంబయి × చెన్నై
(వేదిక: ముంబయి, రా.7.30గంIIలకు)

కుర్మీల ఆందోళనతో బెంగాల్‌లో 64 రైళ్ళు రద్దు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో వివిధ కుర్మి సంఘాలు చేస్తున్న ఆందోళనల కారణంగా 64 ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను శుక్రవారం రద్దుచేశారు. ఈ నెల 5 నుండి కొనసాగుతున్న ఆందోళనలతో ఇప్పటివరకు 2256 పైగా రైళ్లు రద్దయ్యాయి. కీలకమైన ఖరగ్‌పూర్-టాటా నగర్, ఆద్రా-చాండిల్ సెక్షన్లలోని రైల్వే ట్రాక్‌లను ఆందోళనకారులు మొత్తంగా దిగ్బంధించారని రైల్వే అధికారులు తెలిపారు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులు, స్థానికులు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. తమను ఎస్‌టిలుగా గుర్తించాలని కుర్మిలు డిమాండ్ చేస్తున్నారు. సర్నా మతాన్ని గుర్తించాలని, కుర్మాలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతున్నారు. పశ్చిమ బెంగాల్, ఒడిషా, జార్ఖండ్‌ల్లో ప్రధానంగా వీరుంటారు. గతేడాది కూడా వీరు ఐదు రోజుల పాటు ఇలాగే ఆందోళన నిర్వహించారు.

అమెరికాలో వృద్ధులను మోసగించిన భారతీయునికి శిక్ష

వాషింగ్టన్ : అమెరికాలో వృద్ధులను మోసం చేసినందుకు అమెరికాలోని భారత జాతీయుడికి 33 నెలల జైలుశిక్ష విధించారు. దీంతో పాటు 24 లక్షల డాలర్ల జరిమానాను విధిస్తూ జిల్లా న్యాయమూర్తి కెవిన్ మెక్‌నల్టీ తీర్పు చెప్పారు. న్యూజెర్సీలో, అమెరికా అంతటా వృద్ధులను ఎరగా చేసుకుని అంతర్జాతీయంగా కుట్రకు పాల్పడడంలో బజాజ్ పాత్రకు గానూ ఈ శిక్ష పడిందని న్యాయ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కోర్టుకు అందిన పత్రాల ప్రకారం, 2020 ఏప్రిల్ నుండి 2021 ఆగస్టు వరకు బజాజ్ మరికొంతమంది కుట్రదారులు కలిసి అమెరికావ్యాప్తంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని మోసానికి పాల్పడ్డారు. వివిధ బ్యాంకులు, ఆన్‌లైన్ రిటైలర్లు, ఆన్‌లైన్ చెల్లింపుల కంపెనీల నుండి వచ్చిన మోసాల నిరోధక నిపుణులమని చెప్పుకుంటూ వారీ కుట్రలకు దిగారు. ఆ మోసాలను అరికట్టాలంటే స్టింగ్ ఆపరేషన్‌కు దిగాలంటూ ఆ పేరుతో బాధితుల బ్యాంక్ ఖాతాల నుండి తాము చెప్పిన ఖాతాలకు డబ్బు పంపాల్సిందిగా చెప్పేవారు. కొద్ది రోజుల తర్వాత వారి డబ్బు వారికి ఇచ్చేస్తామంటూ హామీలిచ్చేవారు. ఈ రకంగా వారు భారత్, చైనా, సింగపూర్, యుఎఇల్లోని వివిధ బ్యాంకుల అంతర్జాతీయ వైర్ బదిలీల ద్వారా డబ్బులు పంపుకునేవారని న్యాయశాఖ పేర్కొంది.

మంచి తల్లిగా ఉంటా

- న్యూజిలాండ్ మాజీ ప్రధాని జెసిండా

వెల్లింగ్టన్ : తాను మంచి తల్లిగా ఉండాలనుకుంటున్నట్లు న్యూజిలాండ్ మాజీ ప్రధాని జెసిండా ఆర్డెర్న్ పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ..తాను మంచి తల్లిగా ఉండాలనే రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని అన్నారు. నాయకత్వం వహించాలనుకునే మహిళలకు మాతత్వం అడ్డు కాకూడదని అన్నారు. ఆమె గత జనవరి నెలలో ప్రధాని పదవికి రాజీనామా చేస్తూ అందర్నీ షాక్ గురి చేసిన సంగతి తెలిసిందే. తన ఐదేళ్ల పాలనలో దేశం ఎదుర్కొన్న ఎన్నో సంక్షోభాలను ఆమె చూశారు. 2019 క్రైస్ట్‌చర్చిలోని రెండు మసీదులపై జరిగి తీవ్రవాద దాడిలో 51 మంది మరణించారు. అదే ఏడాది అగ్నిపర్వతం విస్పోటనం చెంది సుమారు 22 మంది మరణించారు. తర్వాత కరోనా ఇలా వరుస సంక్షోభాలను జెసిండా పాలన ఎదుర్కొంది

ఏప్రిల్ 14 వరకు సెలవులన్నీ రద్దు : పంజాబ్ డిజిపి

చండీగఢ్ : పంజాబ్‌లో పోలీసుల సెలవులను ఏప్రిల్ 14 వరకు రద్దు చేశారు. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు జారీ అయినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఏప్రిల్ 14న బైశాఖీ సందర్భంగా సిక్కులతో సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా ఖలిస్తాన్ వేర్పాటు వాద నేత అమృత్‌పాల్ సింగ్ అకాల్ తక్త్ చీఫ్‌ను అభ్యర్థించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. దీంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. గెజిటెడ్, నాన్ గెజిటెడ్‌తో సంబంధం లేకుండా అందరికీ ఏప్రిల్ 14 వరకు ఇప్పటికే ఇచ్చిన సెలవులను రద్దు చేస్తున్నట్లు పంజాబ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) గౌరవ్ యాదవ్ ఆదేశాలు పంపినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అలాగే కొత్త సెలవులను మంజూరు చేయవద్దని కూడా ఆదేశించినట్లు సమాచారం.

బిజెపి హింసాకాండపై రైతన్నల దేశవ్యాప్త ప్రచారం

మే 20 నుండి ప్రచారోద్యమం : ఎఐకెఎస్ నేతలు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

త్రిపురలో ఎన్నికల ఫలితాల వెల్లడి తరువాత బిజెపి-ఆర్ఎస్ఎస్ శక్తులచే భీకరమైన హింసను ఎదుర్కొంటున్న త్రిపుర ప్రజలకు అఖిల భారత కిసాన్‌సభ (ఎఐకెఎస్) దేశవ్యాప్త సంఘీభావ ప్రచారాన్ని నిర్వహించనుంది. జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సి)ను కలిసి వామపక్ష, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు, ప్రజలపై జరుగుతున్న దాడులను నివేదిస్తామని ఆ సంఘం నేతలు తెలిపారు. త్రిపుర ప్రజలకు సంఘీభావంగా మే 20 నుంచి 30 వరకు ప్రచారోద్యమం చేపడతామని వెల్లడించారు. శుక్రవారం నాడిక్కడ ఎఐకెఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఐకెఎస్ త్రిపుర ప్రధాన కార్యదర్శి పబిత్రా ఘర్ మాట్లాడారు. రాష్ట్రంలో 216 కుటుంబాలను ప్రజా పంపిణీ వ్యవస్థ ఇచ్చే రేషన్ తీసుకొనేందుకు కూడా అనుమతించటం లేదని అన్నారు. ఇప్పటి వరకు ఐదుగురిని హత్య చేశారని, హింసాకాండలో 630 మందిపై భౌతిక దాడి చేయడంతో గాయాలు పాలయ్యారని తెలిపారు. 1,647 ఇళ్లను ధ్వంసం చేసి, లూటీ చేసి తగులబెట్టారని వివరించారు. దుకాణాలు తెరవడానికి, ఆటోలు నడపడానికి బిజెపి అనుమతించని పరిస్థితి నెలకొందని, ఒకవేళ ఎవరైనా దుకాణాలు తెరిస్తే, ఆటోలు తీస్తే వారిని హత్య చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారని తెలిపారు. మార్చి 3న ఎన్నికల ఫలితాలు విడుదలైన తరువాత నుంచి ఇప్పటి వరకు కొంత మంది దుకాణాలు కూడా తెరవలేదని అన్నారు. 95 దుకాణాలను ధ్వంస చేశారని తెలిపారు. వెయ్యి ఎకరాల్లో 211 రబ్బరు తోటలు దగ్ధం చేశారని, దాదాపు 500 ఎకరాల్లో 286 కూరగాయల తోటలు ధ్వంసం చేశారని వివరించారు. 60 చేపల చెరువులను విషపూరితం చేయడంతో చేపలు నాశనమయ్యాయని, చాలా చోట్ల నీటిపారుదల వ్యవస్థ ధ్వంసం చేశారని తెలిపారు. నిరంతరం గోమాత అంటూ ప్రగల్భాలు పలికే బిజెపి, ఆర్ఎస్ఎస్ పది ఆవులు, గేదెలను కాల్చేశారని, 15 మేకలు, 20 బాతులు, కోళ్లను సైతం తగులబెట్టారని వివరించారు. 22 ఇళ్ల నుంచి బాతులు, కోళ్ళ వంటి వాటిని దొంగిలించారని, 41 వాహనాలను ధ్వంసం చేశారని తెలిపారు. పౌల్ట్రీ ఫామ్‌లను, మిరప తోటలను కాల్చారని అన్నారు. హింసా ఘటనలను పరిశీలనకు వచ్చిన ఎంపిల బృందంపైనా దాడి చేశారు. సిపిఎం ఎమ్మెల్యే శైలేంద్ర చంద్రకాంత్‌కు చెందిన రూ.20 లక్షల విలువ చేసిన రబ్బరు తోటలు ధ్వంసం చేశారని తెలిపారు.

ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా మాట్లాడుతూ త్రిపురలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, ప్రజాస్వామ్యాన్ని హననం చేస్తున్నారని విమర్శించారు. కిసాన్ సభ కార్యకర్తలను, నేతలను శారీరకంగా, మానసికంగా హింసించడమే కాకుండా జీవనాధారంపై దాడికి దిగుతున్నారని దుయ్యబట్టారు. నిరాశ్రయులైన, నిస్సహాయులైన వందలాది మంది ప్రజలు సమీపంలోని అడవుల్లో, రాజధాని నగరం అగర్తలాలోని వివిధ ప్రజా సంఘాల కార్యాలయాలలో ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. చివరికి పిల్లల పుస్తకాలు కూడా వదల్లేదని, సెకండియర్, హయ్యర్ సెకండరీ పరీక్షలు జరుగుతున్న సమయంలో గూండాలు పిల్లల పుస్తకాలను తగులబెట్టారని ధ్వజమెత్తారు. ఆటో రిక్షాలు, చిన్న వాహనాలు రోడ్లపై తిరగడానికి లేదని ఆదేశించారని, ధిక్కరించిన వారి వాహనాలను తగులబెట్టారని పేర్కొన్నారు. డబ్బు దోపిడీ అనేక రెట్లు పెరిగిందని, కుటుంబాల నుంచి స్థానిక బిజెపి మాఫియాలు లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. స్కీమ్ వర్కర్లు తమ విధుల్లో చేరడానికి వీలు లేదని, గ్రామీణ ఉపాధి హామీ, త్రిపుర పట్టణ ఉపాధి పథకం కార్మికులు కూడా వారి ఉద్యోగాల నుండి నిషేధించబడ్డారని విమర్శించారు.

ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ దావలే, విజూ కృష్ణన్ మాట్లాడుతూ త్రిపుర రైతులు, కిసాన్ సభ నాయకులు దేశంలోని సాధ్యమైన అన్ని గ్రామాలను సందర్శించి కార్యక్రమాలను వివరిస్తారని, ఫోటో ఎగ్జిబిషన్, డాక్యుమెంటరీ ప్రదర్శన కూడా నిర్వహిస్తారని తెలిపారు. దేశంలోని నేతలు, ప్రముఖులు త్రిపురలో పర్యటించనున్నారని తెలిపారు. త్రిపురలో బిజెపి, ఆర్ఎస్ఎస్ హింసకు సంబంధించి డాక్యుమెంటరీని, ఫోటోలను ప్రదర్శించారు. ఈ సమావేశంలో ఎఐఎడబ్ల్యుయు త్రిపుర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల్ దేబ్, సిపిఎం ఎమ్మెల్యే శైలేంద్ర చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై క్రమశిక్షణ చర్యను ఎత్తివేయండి

- ఢిల్లీ వర్సిటీ అధికారులకు విద్యావేత్తల వినతి

న్యూఢిల్లీ : 2002 గుజరాత్ అల్లర్లపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించిందుకు విద్యార్థులపై తీసుకున్న క్రమశిక్షణా చర్యను ఎత్తివేయాల్సిందిగా 59 మంది విద్యావేత్తలు ఢిల్లీ యూనివర్సిటీ అధికారులను కోరారు. ఈ మేరకు వారు యూనివర్సిటీ ఛాన్సలర్ యోగేష్ సింగ్‌కు లేఖ రాశారు. డాక్యుమెంటరీ ప్రదర్శనపై దేశంలో అధికారిక నిషేధమేమీ అమలులో లేనందున చర్యలు సబబు కావని వారు తెలిపారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు అపూర్వానంద్, సతీష్ దేశ్‌పాండే, నందినీ సుందర్, ఇరా రాజా, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుచిత్రాసేన్, విశ్వభారతి ప్రొఫెసర్ సుదీప్త భట్టాచార్య తదితరులు ఈ లేఖపై సంతకాలు చేశారు. డాక్యుమెంటరీని ప్రదర్శించిందుకు సంవత్సరం పాటు పరీక్షలు రాయకుండా ఇద్దరు విద్యార్థులపై యూనివర్సిటీ అధికారులు నిషేధం విధించారు. మరో ఆరుగురిపై ఇతర క్రమశిక్షణా చర్యలు సిఫార్సు చేశారు. విద్యార్థులు నిషేధం విధించేంత తీవ్రమైన నేరం చేశారా అని విద్యావేత్తలు తమ లేఖలో వర్సిటీ ఛాన్సలర్‌ను ప్రశ్నించారు. 'ఎక్కడి నుండైనా సమాచారాన్ని తీసుకుని దానిని వ్యక్తపరిచే హక్కు విద్యార్థులు, అధ్యాపకులకు ఉంటుందన్న విషయం మీకు తెలియనిది కాదు. వారు పెద్దలు. ఏం చేయాలో వారికి మనం చెప్పనక్కర లేదు. ముస్లింల పట్ల బిజెపి వైఖరిని డాక్యుమెంటరీ ఎత్తిచూపింది. దానిని ప్రదర్శించడం ఎందుకు ప్రమాదకరమో మాకు అర్థం కావడం లేదు' అని వారు పేర్కొన్నారు. డాక్యుమెంటరీ ప్రదర్శన ఎలాంటి హింసకు, ఆందోళనకు దారి తీయలేదని గుర్తు చేశారు. భద్రతా సిబ్బంది జోక్యం చేసుకొని దానిని బలవంతంగా అడ్డుకొని నిలిపి వేయకుండా ఉంటే అంతా శాంతియుతంగా జరిగి ఉండేదని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. గుజరాత్ అల్లర్లకు ప్రధాని నరేంద్ర మోడీయే బాధ్యుడంటూ జనవరి17న బిబిసి ఒక డాక్యుమెంటరీని విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో కేంద్రప్రభుత్వం ఐటీ నిబంధనల కింద తనకున్న అధికారాలను ఉపయోగించుకొని డాక్యుమెంటరీని ప్రదర్శించవద్దని జనవరి 20న యూట్యూబ్, ట్విటర్‌లకు హుకుం జారీ చేసింది. మరోవైపు దేశ రాజధానిలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, అంబేద్కర్ యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ, ముంబయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, కొల్‌కతాలోని ప్రెసిడెన్సీ యూనివర్సిటీలలో డాక్యుమెంటరీ ప్రదర్శనలు జరిగాయి. జనవరి 28న డాక్యుమెంటరీని ప్రదర్శించేందుకు సిద్ధపడిన 24 మంది ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులను పోలీసులు నిర్బంధించి, గంట తర్వాత విడిచిపెట్టారు. ఆ తర్వాత యూనివర్సిటీ క్రమశిక్షణా సంఘం ఇద్దరు విద్యార్థులపై పరీక్షలకు హాజరు కాకుండా నిషేధం విధించింది.

విమాన సర్వీసుల పునరుద్ధరణ

- సౌదీ, ఇరాన్ నిర్ణయం

బీజింగ్: చైనా మధ్యవర్తిత్వంలో బీజింగ్‌లో సమావేశం తరువాత తమ ఇరు దేశాల మధ్య విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించాలని సౌదీ అరేబియా, ఇరాన్ నిశ్చయించుకున్నాయి. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సందర్శనలను పునరుద్ధరించాలని ఇరు దేశాలు భావించాయి. బద్ధ విరోధులుగా ఉన్న ఇరాన్, సౌదీ అరేబియా తమ మధ్య తెగిపోయిన దౌత్యసంబంధాలను తిరిగి నెలకొల్పుకోవాలని చైనా మధ్యవర్తిత్వంలో గత నెలలో ఒక ఒప్పందానికి వచ్చాయి. దానికి కొనసాగింపుగానే ఈ విమాన సర్వీసుల పునరుద్ధరణ అని సౌదీ అరేబియా కాన్సులేట్ కార్యాలయం పేర్కొంది. ఈ పరిణామాలు మధ్య ప్రాచ్యంలో అమెరికా ఆధిపత్యానికి గట్టి దెబ్బ అని పరిశీలకులు పేర్కొన్నారు. ఇరాన్, సిరియాలతో సౌదీ అరేబియా సఖ్యత పెంచుకోవడం అమెరికాకు కన్నుకుట్టినట్టుగా ఉంది.

సిలబస్‌లో మార్పులు, మతపరమైన దాడులపై

బనారస్ వర్శిటీలో నిరసనలు



వారణాసి: దేశంలో పెరుగుతున్న మతోన్మాదం, సిలబస్‌లో మార్పులకు వ్యతిరేకంగా గురువారం బనారస్ యూనివర్శిటీ (బిహెచ్‌యు) విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. బీహార్‌లో చారిత్రిక మదర్సా దహనం, ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యాంశాల్లో మార్పులను వారు ఖండించారు. విశ్వ విద్యాలయంలోని లంక గేట్‌వద్ద విద్యార్థులు పెద్ద సంఖ్యలో గుమికూడి 'సద్భావన వర్ధిల్లాలి', 'హిందూ, ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ ఐక్యత వర్ధిల్లాలి', 'హిందూ, ముస్లిం భాయి భాయి', 'లౌకికవాదం వర్ధిల్లాలి' అంటూ బిగ్గరగా నినదించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై బనారస్ వర్సిటీ విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు,పౌర సమాజం ఎప్పటికప్పుడు గళమెత్తుతారు. గతంలో వివక్షాపూరిత పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా రుద్దేందుకు ప్రయత్నించినప్పుడు దానికి వ్యతిరేకంగా బనారస్ వర్శిటీ ముందుండి పోరాడింది. కొందరు జైలుకు కూడా వెళ్లారు. తాజాగా ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య పుస్తకాల్లో ప్రతిపాదిత మార్పులపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్లపైకి వచ్చారు. నిరసనలో పాల్గొన్న యూనివర్సిటీ పూర్వ విద్యార్థి ధనుంజయ్ సగ్గు న్యూస్‌క్లిక్‌తో మాట్లాడుతూ, బీహార్‌లో ఒక పురాతన మదర్సాను తగులబెట్టడం ద్వారా దేశంలో మత సామరస్యానికి, పరస్పర సోదర భావానికి విఘాతం కలిగించాలని కొన్ని శక్తులు యత్నిస్తున్నాయని అన్నారు. ఇటువంటి ఘటనలు నాగరిక, ప్రజాస్వామ్య సమాజానికే మాయని మచ్చ, మానవాళికే అవమానం అని పేర్కొన్నారు. దేశంలో తీవ్ర రూపం దాల్చిన నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైన మోడీ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు మతతత్వ ఎజెండాను ముందుకు తెస్తోందని, దీనిని తిప్పికొట్టాల్సిన బాధ్యత యువతపై ఉందని ఆయన అన్నారు. బిహెచ్‌యు విద్యార్థి అపరాజిత వట్లాడుతూ, వారంతా చదివి పెరిగిన ఈ సిలబస్ ఈ రోజు ఎందుకు పనికిరాకుండా పోయిందో తెలపాలని అన్నారు. దీని ద్వారా వారు ఏ ఎజెండాను ప్రచారం చేస్తున్నారో జనానికి తెలుసు. వర్తమానాన్ని, భవిష్యత్తును మార్చగలం, చరిత్రను మార్చలేం. ఈ విషయం వారికి ఎందుకు తలకెక్కడం లేదు? అని సూటిగా ప్రశ్నించారు. మధ్యయుగ భారత దేశ చరిత్ర నుండి మొఘలుల కాలాన్ని అదృశ్యం చేస్తే 1857 తిరుగుబాటులో బహదూర్ షా జాఫర్ గురించి ఎలా తెలుస్తుందని ఆమె అడిగారు. ఆ యుగం గురించి మీరు తెలపకపోతే కబీర్ దాస్, సూర దాస్, తులసీదాస్, రవిదాస్ వంటి గొప్ప వ్యక్తుల గురించి మీకు ఎలా తెలుస్తుంది? నిరాల, సుమిత్రానందన్ పంత్, ఫిరాక్ గోరఖ్‌పురి గ్రంథాలను తొలగిస్తే హిందీలో పెద్ద శూన్యత ఏర్పడుతుంది. ఇటువంటి చర్యలు విద్య, సాహిత్యాలకు వ్యతిరేకం మాత్రమే కాదు, విజ్ఞానానికి, దేశ సమైక్యత, సమగ్రతలకు కూడా వ్యతిరేకమని అన్నారు.

బిహెచ్‌యులో రిసెర్చి స్కాలర్ రోష్ని మాట్లాడుతూ, 'పుస్తకాల్ని మనం కాల్చివేస్తే, చివరికి అవి మనల్ని కాల్చివేస్తాయి' అన్న హెన్రిచ్ హీన్ రాసిన సుప్రసిద్ధ కొటేషన్‌ను ఉటంకించారు. 1933 మే 10న జర్మనీలో తర్కశాస్త్రం, విజ్ఞానం, నాలెడ్జికి సంబంధించిన పుస్తకాలను తగులబెడుతూ నాజీ హిట్లర్ మూకలు గంతులేశాయి. ఈ ఘటన తరువాత ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త రాబర్ట్ ఐన్‌స్టీన్ జర్మనీని వీడి వెళ్లిపోయారు. బీహార్‌లో మదర్సాలను, లైబ్రరీలను మతోన్మాదులు తగులబెట్టినప్పుడు జర్మనీలోని ఆ భయంకర రాత్రిని మనం గుర్తుకుతెచ్చుకోవాలి అని ఆయన అన్నారు.

మరో నిరసనకారుడు ధనుంజయ్ త్రిపాఠి మాట్లాడుతూ, నేడు దేశాన్ని మితవాద భావజాలం కమ్మేస్తున్నది. ఇతర మతాల వారిని, వారి ఆలోచనలను, అవగాహనను చంపేస్తున్నారు. సంఘ్‌పరివార్ మూకలు ఇసుకలో తలదూర్చిన ఉష్ట్ర పక్షి బాపతులా వ్యవహరిస్తూ, చరిత్రలో నాగరికతను, ప్రగతిశీలతను చెరిపేయాలని చూస్తున్నాయి. సిలబస్‌లోని పాఠాలను మతపరంగా, అహేతుకమైన రీతిలో తొలగించేస్తున్నారు. శాస్త్రీయతకు, ప్రగతిశీలతకు సంఘ్‌పరివార్ వ్యతిరేకం, అయితే, భారతదేశ ఆలోచన విభిన్నజాతులు, మతాలు, సంస్కృతుల సహజీవనం, పురోగతిని కోరేదిగా ఉంది.

పేదల సమస్యలపై గ్రామాల్లో ఆందోళన సభలు

- ఈ నెల 20 నుంచి నిర్వహణ
- కనీసం 25 వేల గ్రామాల్లో ఉద్యమం
- ఎఐఎడబ్ల్యుయు వెల్లడి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యవసాయ కార్మిక, గ్రామీణ పేదల వ్యతిరేక విధానాలపై అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) సమరశంఖం పూరించింది. పేదలు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామాల్లో ఆందోళన సభలు నిర్వహించాలని బుధ, గురువారాల్లో ఇక్కడి ఏపి, తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఎఐఎడబ్ల్యుయు వర్కింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ఈ నెల 20 నుంచి మూడు నెలల పాటు కొనసాగనున్న ఈ ప్రచారోద్యమంలో కనీసం 25 వేల గ్రామాల్లో ఆందోళన సభలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ వివరాలను సంఘం నాయకులు విక్రమ్ సింగ్, రాజ్యసభ సభ్యులు వి శివదాసన్‌తో కలిసి ఎఐఎడబ్ల్యుయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ విజయరాఘవన్, బి వెంకట్ గురువారం ఇక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందని, అందులోనూ గ్రామీణ నిరుద్యోగం భారీగా పెరిగిందని తెలిపారు. 10 నుంచి 15 కోట్ల మంది గ్రామీణ పేదలకు ఉపాధి లేదని తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్)ను కుదిస్తున్నారని వాపోయారు. ఉపాధి హామీకి నిధులు కోత విధిస్తున్నారని, రాష్ట్రాలకు ఇవ్వాల్సిన వేల కోట్లు బకాయిలు కేంద్రం విడుదల చేయటం లేదని విమర్శించారు. మోడీ సర్కార్ హయంలో లక్ష మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. దేశంలో ఆరు లక్షల హెక్టర్ల భూమి ఉందని, దాన్ని భూమి లేని వారికి పంపిణీ చేయాలన్నారు. కానీ మోడీ సర్కార్ కార్పొరేట్లకు భూములను ధారాదత్తం చేస్తుందని విమర్శించారు.

అవినీతి ఉద్యోగులపై చర్యలేవి ?

- 68 శాతం కేసుల్లో నామ్‌కేవాస్తేగా విచారణ..
- లోక్‌పాల్ పనితీరుపై పార్లమెంటరీ కమిటీ అసంతృప్తి

న్యూఢిల్లీ : అవినీతిపరులైన ప్రభుత్వోద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన లోక్‌పాల్ నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. సాంకేతిక కారణాలు సాకుగా చూపి వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తోంది. గత నాలుగు సంవత్సరాలలో ప్రభుత్వోద్యోగులపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించిన ఫిర్యాదులపై విచారణ జరిపిన లోక్‌పాల్ వాటిలో 68 శాతం కేసుల్లో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సిబ్బంది, శిక్షణ విభాగానికి చెందిన పార్లమెంటరీ కమిటీ తన నివేదికలో ఈ విషయాన్ని తెలియజేసింది. ఈ నివేదిక ప్రకారం....కేవలం మూడు ఫిర్యాదులపై మాత్రమే లోక్‌పాల్ పూర్తి స్థాయి విచారణ జరిపింది. ఫిర్యాదులు నిర్ణీత నమూనాలో లేవన్న కారణంతోనే ఎక్కువ భాగం తిరస్కరణకు గురయ్యాయి. ఇప్పటి వరకూ ఏ ఒక్క ఉద్యోగినీ లోక్‌పాల్ విచారించకపోవడం గమనార్హం. అవినీతి కేసుల విచారణ విషయంలో లోక్‌పాల్ పనితీరు ఏ మాత్రం సంతృప్తికరంగా లేదు.

లోక్‌పాల్ ఛైర్‌పర్సన్ పదవి 2022 మే నుండి ఖాళీగా ఉంది. దీని భర్తీ విషయంలో తీసుకున్న చర్యలేమిటో తెలియజేయాలని పార్లమెంటరీ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి పొరబాట్లకూ తావులేని బాధ్యతాయుతమైన పాలన లభించేలా చూసేందుకు లోక్‌పాల్ ఏర్పడింది. కేవలం నిర్ణీత నమూనాలో లేవన్న కారణంతో సహేతుకమైన ఫిర్యాదులను లోక్‌పాల్ తిరస్కరించకూడదని పార్లమెంటరీ కమిటీ సూచించింది. జీ-20కి చెందిన అవినీతి నిరోధక కార్యాచరణ బృందానికి భారత్ నాయకత్వం వహిస్తున్న నేపథ్యంలో లోక్‌పాల్ ఈ సందర్భాన్ని ఉపయోగించుకొని తన యత్నాలను బలోపేతం చేయాలని అభిప్రాయపడింది.

ఆర్థిక మాంద్యంతో పెరగనున్న ఆకలి, దారిద్ర్యం : ఐఎంఎఫ్

న్యూయార్క్ : ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది మూడు శాతం కన్నా తక్కువే వృద్ధి చెందుతుందని భావిస్తున్నట్లు అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జివా తెలిపారు. దీనివల్ల ఆకలి, దారిద్ర్యం ముప్పు పెరుగుతుందని హెచ్చరించారు. గతేడాది ఈ వృద్ధిరేటు 3.4 శాతంగా వుటుందని అంచనా వేశారు. వచ్చే ఐదేళ్ళ పాటు వృద్ధిరేటు దాదాపు మూడు శాతంగానే వుంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. 1990 నుండి ఇప్పటివరకు ఇదే అత్యంత తక్కువైన మధ్యకాలిక వృద్ధి అంచనాగా ఆమె పేర్కొన్నారు. తక్కువ ఆదాయం కలిగిన దేశాలను ఈ పరిస్థితి తీవ్రంగా దెబ్బతీస్తుందని హెచ్చరించారు. "కోవిడ్ సంక్షోభం వల్ల ప్రారంభమైన ప్రమాదకరమైన ధోరణి దారిద్ర్యం, ఆకలి మరింత పెచ్చరిల్లుతాయి." అని క్రిస్టలినా పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్రమైన అంశాలపై చర్చించేందుకు వచ్చే వారం ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ సమావేశమవుతున్న నేపథ్యంలో క్రిస్టలినా వ్యాఖ్యలు వెలువడ్డాయి. అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వుండేలా అన్ని దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు వడ్డీరేట్లను పెంచడం, వర్ధమాన దేశాల్లో కొనసాగుతున్న రుణ సంక్షోభంతో రుణా భారాలు మరింత పెరిగి దేశాల అభివృద్ధి దెబ్బతింటోన్న తరుణంలో ఈ వార్షిక సమావేశాలు జరుగుతున్నాయి. పెరుగుతున్న రుణ వ్యయం, మరోవైపు తమ ఎగుమతులకు తగ్గుతున్న డిమాండ్ ఇలా రెండు రకాలుగా తక్కువ ఆదాయ దేశాలు దెబ్బతింటాయని భావిస్తున్నారు. ఫలితంగా ఆకలి, దారిద్ర్యం పెచ్చరిల్లుతుందని హెచ్చరించారు. ఇప్పటికే 15 శాతం తక్కువ ఆదాయ దేశాలు రుణ ఉచ్చులో ఇరుకున్నాయి. అదనంగా 45 శాతం దేశాలు దానికి సమీపంగా వస్తున్నాయని అన్నారు. ఇటువంటి తరుణంలో సంపన్న ఐఎంఎఫ్ సభ్య దేశాలు మరింతగా తోడ్పాటునందించాల్సి వుందన్నారు.

మీడియా వన్‌పై తీర్పును స్వాగతించిన జర్నలిస్టు సంఘాలు

- సీల్డ్ కవర్‌పై హెచ్చరికల ప్రభావం చూడాల్సి వుందని వ్యాఖ్య

న్యూఢిల్లీ : మలయాళం వార్తా చానెల్ మీడియావన్‌పై కేంద్ర ప్రభుత్వ నిషేధాన్ని కొట్టివేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఎజె), ఢిల్లీ జర్నలిస్టుల యూనియన్ (డియుజె) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) స్వాగతించాయి. కానీ సీల్డ్ కవర్ పద్ధతిపై హెచ్చరికలను ఆందోళనతో గమనించాయి. సిఎఎ నిరసనలను, ఢిల్లీ అల్లర్లపై మీడియా వన్ చాలా విస్తృత కవరేజీ ఇచ్చింది, ఆ సమయంలోనే 2020 మార్చిలో 48గంటల పాటు చానెల్ ప్రసారాలను కూడా నిలిపివేశారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై ఇలా ఆంక్షలు విధించడం వల్ల పౌరులు కూడా అదే రీతిలో ఆలోచించాల్సిన పరిస్థితి వస్తుందని సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలను జర్నలిస్టు సంఘాలు స్వాగతించాయి. సామాజిక, ఆర్థిక రాజకీయాల నుండి రాజకీయ సైద్ధాంతిక భావజాలం వరకు అన్ని అంశాలపై ఒకే రకమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చడం ప్రజాస్వామ్యానికి తీరని ముప్పు అని కోర్టు వ్యాఖ్యానించడం పట్ల జర్నలిస్టు సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రభుత్వ సంస్థలన్నీ చాలా తరచుగా సీల్డ్ కవర్ పద్ధతిని ఉపయోగిస్తూ వుంటాయని, ముఖ్యంగా యుఎపిఎ కేసుల్లో ఇది ఎక్కువ చూస్తుంటామని ఎన్ఎజె-డియుజె పేర్కొన్నాయి. ఇలా సీల్డ్ కవర్‌ను అందచేయడం వల్ల తమపై ఎందుకు అభియోగాలు మోపారో నిందితులకు తెలుసుకునే అవకాశాన్ని తిరస్కరించడమే అవుతోందని జర్నలిస్టు యూనియన్లు పేర్కొన్నాయి. దాంతో వారికి తమ వాదన వినిపించడం కష్టంగా మారుతోంది. అంతిమంగా వారికి న్యాయాన్ని తిరస్కరించడానికి దారితీస్తోంది. ఇటువంటి ఈ పద్ధతిపై సుప్రీం కోర్టు విమర్శలు చేయడం స్వాగతించదగ్గ పరిణామమని ఆ యూనియన్లు వ్యాఖ్యానించాయి. అయితే ఇటువంటి కేసుల్లో నిందితుడికి నేరుగాసమాచారం ఇవ్వడం కన్నా అమికస్ క్యూరీని నియమించి వారికి ఇవ్వాలని సూచించడం ద్వారా సుప్రీంకోర్టు తన వ్యాఖ్యలను సమతుల్యం చేసింది. తాజాగా చేసిన ఈ సూచనతో భవిష్యత్తులో కేసులు ఎలా ప్రభావితమవుతాయో చూడాల్సి వుంది. అయితే మొత్తంగా బహిరంగ న్యాయం కోసం జరిగే న్యాయ పోరాటంలో ఈ తీర్పు ఒక ముందడుగు అని ఎన్ఎజె, డియుజె, ఎపిడబ్ల్యుజెఎఫ్ అభివర్ణించాయి.

గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ వైమానిక దాడులు

జెరూసలెం : ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్‌పై వైమానిక దాడికి దిగింది. ప్రస్తుతం లెబనాన్‌పై దాడి చేపడుతున్నట్లు ఇజ్రాయిల్ సైన్యం శుక్రవారం ఉదయం ఓ ప్రకటనలో తెలిపింది. దక్షిణ ఓడరేవు నగరమైన టైర్‌లోని శరణార్థి శిబిరం సమీపంలో పేలుళ్లు జరిగినట్లు లెబనాన్ మీడియా కూడా ధ్రువీకరించింది. గురువారం అర్ధరాత్రి పాలస్తీనాలోని గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులకు పాల్పడింది. లెబనాన్ నుంచి హమాస్ తీవ్రవాదులు తమ దేశంపై రాకెట్లతో దాడులకు పాల్పడంతోనే తాము వైమానిక దాడులు చేసినట్లు తెలిపింది. జెరూసలెంలోని అల్-అక్సా మసీదులో పాలస్తీయన్లపై ఇజ్రాయెల్ పోలీసులు రబ్బరు పూత పూసిన ఇనుప బుల్లెట్లు, గ్రెనేడ్‌లతో దాడికి దిగన సంగతి తెలిసిందే. అనంతరం ఈ దాడులు జరగడం గమనార్హం. లెబనాన్ భూభాగం నుంచి 34 రాకెట్లతో తమ దేశంపైకి దాడికి పాల్పడినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. అయితే వాటిలో 25 రాకెట్లను తమ రక్షణ వ్యవస్థ అడ్డుకుందని, మరో ఐదు ఇజ్రాయెల్ భూభాగంలో పడినట్లు పేర్కొంది. హమాస్ చర్యకు ప్రతిస్పందనగా వారికి చెందిన రెండు సొరంగాలు, రెండు ఆయుధ తయారీ స్థలాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. లెబనాన్ చర్యలపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు మాట్లాడుతూ.. బాధ్యులు తగిన మూల్యం చెల్లించుకుంటారని ప్రకటన చేసిన గంటల వ్యవధిలోనే గాజా స్ట్రిప్‌పై దాడులు జరగడం గమనార్హం. అయితే లెబనాన్ లేదా గాజాలో ప్రాణనష్టానికి సంబంధించి ఎలాంటి సమాచారం అందలేదు.కాగా ఇజ్రాయెల్ వ్యాప్తంగా ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిలీల ఆవాసాలకు సమీపంలో జరిగిన పాలస్తీనా జాతీయుని కాల్పుల్లో ఇద్దరు మహిళలు మరణించారు. మరొకరు గాయపడ్డారు. ఈ విషయాన్ని ఇజ్రాయిల్ వైద్యులు ప్రకటించారు. వెస్ట్ బ్యాంక్‌లో వారాల తరబడి అసాధారణంగా నెలకొన్న అశాంతి, ఉద్రిక్తతల తర్వాత జరిగిన ఈ దాడితో జెరూసలేంలోని ఉద్రిక్తతలు ఆక్రమిత భూభాగానికి కూడా పాకినట్లు తెలుస్తోంది. ఇజ్రాయిల్ ఉత్తర, దక్షిణాది సరిహద్దుల్లో ప్రశాంత పరిస్థితులు నెలకొన్నా లెబనాన్‌పై తెల్లవారు జామున ఇజ్రాయిల్ దాడులతో ఘర్షణలు కొత్త దశకు చేరుకున్నాయని భయపడుతున్నారు. గురువారం లెబనాన్ నుండి వరుసగా వచ్చిన రాకెట్ల దాడికి ప్రతిగా ఈ దాడులు జరిగాయని భావిస్తున్నారు. జెరూసలేంలోని అల్ అక్సా మసీదు వద్ద ఇజ్రాయిల్ పోలీసుల దాడులతో అరబ్ ప్రపంచం వ్యాప్తంగా ఆగ్రహాలు వ్యక్తమయ్యాయి.

తైవాన్, అమెరికా సంస్థలపై చైనా ఆంక్షలు

బీజింగ్ : కరడుగట్టిన వేర్పాటువాది 'తైవాన్ ఇండిపెండెన్స్'కి చెందిన సియావో బి ఖిమ్‌పైన, మరో రెండు తైవాన్ సంస్థలతో బాటు అమెరికాకు చెందిన యుఎస్ హడ్సన్ ఇనిస్టిట్యూట్, రొనాల్డ్ రీగన్ ప్రెసిడెన్షియల్ లైబ్రరీపైన, నలుగురు అమెరికన్లపైన చైనా శుక్రవారం నాడు ఆంక్షలు విధించింది. కాలిఫోర్నియాలో అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ కెవిన్ మెకార్థీతో తైవాన్ ప్రాంతీయ నేత త్సాయి ఇంగ్ వెన్ ఇటీవల జరిపిన సమావేశం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన చైనా ఈ ప్రతి చర్యలు తీసుకుంది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ పేరుతో తైవాన్ వేర్పాటువాదానికి మద్దతిచ్చిన ఏ సంస్థ లేదా వ్యక్తికైనా చైనా ఇదే తీరున స్పందిస్తుందని తాజా ఆంక్షలు తెలియచేస్తున్నాయని చైనా నిపుణులు భావిస్తున్నారు. అమెరికా తైవాన్ కుమ్మక్కుపై ఈ చర్యలు ప్రతికూల ప్రభావాన్ని చూపించగలవని, అమెరికా జాతీయ ప్రయోజనాల కోసం మితిమీరిన, కన్జర్వేటివ్ శక్తులు, తైవాన్ వేర్పాటువాద శక్తుల మధ్య అనధికార కుమ్మక్కుకు అమెరికా ప్రభుత్వం పాల్పడకుండా హెచ్చరిస్తాయని పేర్కొన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీలోని తైవాన్ వ్యవహారాల విభాగం శుక్రవారం ఈ ఆంక్షలను ప్రకటించింది. అమెరికాతో కుమ్మక్కైన తైవాన్ వేర్పాటువాది సియావో బి కిమ్ తైవాన్ జలసంధుల మధ్య ఘర్షణలను రెచ్చగొడుతున్నందుకు ఈ ఆంక్షలు విధించినట్లు ప్రకటించింది. తైవాన్ సంస్థలైన ది ప్రాస్పెక్ట్ ఫౌండేషన్, ది కౌన్సిల్ ఆఫ్ ఆసియన్ లిబరల్స్ అండ్ డెమోక్రాట్ల పైనా కూడా ఆంక్షలను విధించింది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సహకారం పేరుతో, విద్యా సంబంధిత మార్పిడులు, సెమినార్ల ముసుగులో అంతర్జాతీయ వేదికలపై తైవాన్ వేర్పాటువాదాన్ని లేవనెత్తుతూ, చైనా వ్యతిరేక శక్తులతో కుమ్మక్కవుతున్నాయని పేర్కొంది. ఒక చైనా విధానాన్ని ఉల్లంఘించేలా ఒక చైనా, ఒక తైవాన్ లేదా రెండు చైనాలు అన్న భావాన్ని ప్రచారం చేస్తున్నాయని పేర్కొంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68



తెలంగాణలో అభివృద్ధిలో కొత్త తరం ప్రారంభమైనది

రూ.11,300 కోట్లకు పైగా విలువగల ప్రాజెక్టులతో



రైల్వేలు, రోడ్డు మరియు హెల్త్ సెక్టార్ల జాతీయ ప్రాజెక్టులకు జెండా ఊపి ప్రారంభం, శంకుస్థాపన చేయుట మరియు అంకితం చేయుట

జెండా ఊపి ప్రారంభం

సికింద్రాబాద్- తిరుపతి మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్

• తిరుపతి వద్ద వేంకటేశ్వర దేవస్థానం దర్శించుకొనువీలు • సికింద్రాబాద్ నుండి తిరుపతికి ప్రస్తుతం సుమారుగా 12గం.లకుగాను కేవలం 8.00 గం.ల 30నిమిషాలలో కవరుచేస్తుంది • నల్లగొండ, గుంటూరు, ఒంగోలు & నెల్లూరు వద్ద హాల్టులు • వారంలో ఆరు రోజులు • 160కి.మీ.లు గంటకు అతివేగంతో చేరుకొను సామర్థ్యం • కవచ్ (రైలు వివాదాల నివారణ విధానం)తో పరికరాలు కలిగియున్నది • 'మేక్ ఇన్ ఇండియా' ప్రాజెక్టు

&

హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాల పరిధిలో సబ్ అర్బన్ సెక్షన్లలో 13 కొత్త ఎంఎంటిఎస్ సర్వీసులు

• మొదటి సారిగా సికింద్రాబాద్- మేడ్చల్ మరియు ఫలక్‌నుమా - ఉమ్దానగర్ యొక్క సబర్బన్ సెక్షన్లలో ఎంఎంటిఎస్ కార్యకలాపాలు • ప్రస్తుత 48కి.మీ.ల నుండి 90కి.మీ.లకు ఎంఎంటిఎస్ సర్వీసెస్ నెట్‌వర్క్ పొడిగింపు • ఉప-పట్టణ రవాణా యొక్క అత్యంత ఆర్థిక సాధనాలు • మహిళల బోగీలలో విశృత సిసిటివి కారణంగా సురక్షిత ప్రయాణం • విద్యార్థినులు, విద్యార్థులు, రోజువారి ప్రయాణీకులు మరియు మహిళల కొరకు సౌకర్యవంతమైన అతి సామర్థ్య బోగీలు.

శంకుస్థాపన

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి
• మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్, రూఫ్ ప్లాజా, దివ్యాంగులకు అనువుగా, గ్రీన్ బిల్డింగ్

ఎన్‌హెచ్-15ఓసి యొక్క అకాల్‌కోట్- కర్నూలు సెక్షన్ యొక్క 6-లేన్ల యాక్సెస్ నియంత్రణ జాతీయ రహదారి
• సూరత్ మరియు చెన్నై మధ్య దూరంను 280కి.మీ.లకు తగ్గించి మరియు 06 గంటల్లోనే ప్రయాణ సమయం ఉంటుంది.

ఎన్‌హెచ్-167ఎన్ యొక్క మహబూబ్‌నగర్- చింకోలి సెక్షన్ యొక్క పేవ్డ్ షోల్డర్స్‌తో 2 లేన్/4 లేన్ కు విస్తరణ
• టూరిజం కు బూస్ట్, రీజియన్ యొక్క సోసియో-ఎకనామిక్ డెవలప్‌మెంట్ మెరుగుపరుచుట.

ఎన్‌హెచ్-167కె యొక్క కల్వకుర్తి-కొల్లాపూర్ సెక్షన్ యొక్క ఎవ్డ్ షోల్డర్స్‌తో 2 లేన్ కు విస్తరణ
• హైదరాబాద్ నుండి తిరుపతి, నంద్యాల నుండి చెన్నై వరకు 80 కి.మీ.ల దూరం మరియు ప్రయాణ సమయం తగ్గించుట.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో 4 లేన్ యాక్సెస్ కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే సెక్షన్ (ఎన్‌హెచ్-365బిజి యొక్క ఖమ్మం-దేవరపల్లి సెక్షన్) నిర్మాణం
• తెలంగాణ & ఆం.ప్ర. తీరప్రాంతాల మధ్య అనుసందానంచేయుట. • హైదరాబాద్ నుండి విశాఖపట్నం వరకు అనుసందానం మెరుగుపరుచుట
• రాజమండ్రి నుండి హైదరాబాద్ మధ్య 56కి.మీ.ల దూరం తగ్గించబడును.

ఎన్‌హెచ్-161బి యొక్క నిజాంపేట - నారాయణ్‌ఖేడ్-బీహార్ సెక్షన్ యొక్క పేవ్డ్ షోల్డర్స్‌తో 2 లేన్‌కు విస్తరణ
• వ్యవసాయ ఉత్పత్తులు మరియు తయారి సరుకులు సరసమైన రేట్లకు రవాణాచేయుట, ప్రయాణికుల రాకపోకలు మరియు వేగం యొక్క హాస్సెల్ రహితం.

ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, బీబీనగర్
• మెడికల్ కేర్, అకాడెమిక్ & రిసర్చ్ లో ప్రపంచస్థాయి సంస్థ
• తెలంగాణ ప్రజలకు ఆఫర్ సమీకృత, నాణ్యత& హోలిస్టక్ హెల్త్‌కేర్ సర్వీసెస్‌కు

జాతికి అంకితం

సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ మధ్య (85కి.మీ.) రైల్వే లైన్ విద్యుదీకరణతో డబ్లింగ్
• సరాసరి వేగం పొందుటకు సికింద్రాబాద్ నుండి చెన్నై మరియు సికింద్రాబాద్ నుండి బెంగళూరు వరకు ఎలక్ట్రిక్ ఇంజన్ ద్వారా రాకపోకలు.

బై

నరేంద్ర మోడీ
ప్రధానమంత్రి

8 ఏప్రిల్ 2023 | పరేడ్ గ్రౌండ్, సికింద్రాబాద్ | ఉ॥ 11:15గం.లు

గౌరవనీయులైన ప్రముఖుల సమక్షంలో

తమిళిసై సౌందరరాజన్
తెలంగాణ రాష్ట్ర గవర్నర్

కె. చంద్రశేఖర్ రావు
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు

అశ్వినీ వైష్ణవ్
రైల్వేలు, సమాచారం, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యొక్క కేంద్ర మంత్రివర్యులు

జి. కిషన్ రెడ్డి
ఈశాన్య ప్రాంతపు టూరిజం, సాంకేతిక & అభివృద్ధి యొక్క కేంద్రమంత్రివర్యులు

DD NEWS డిడి న్యూస్ పై నేరుగా ప్రసారం వీక్షించగలరు